www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 2-4-2020 | పేజీలు: 8 + 4 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 | సంచిక (Issue) : 348

శ్రీశార్వరినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: నవమి రా. 2.44 వరకు తదుపరి దశమి; నక్షత్రం: పునర్వసు రా. 7.29 తదుపరి పుష్యమి; వర్జ్యం: ఉ. 7.29-9.05, తె. 3.13-4.45; దుర్ముహూర్తం: ఉ. 10.17-11.06, మ. 3.10-3.59; అమృతఘడియలు: సా. 5.05-5.41; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.13; సూర్యాస్తమయం: 6.26 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore

కేంద్ర కేబినెట్ కార్యదర్శి గౌబ వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్, డీజీపీ తదితరులు

వారంతా ఎక్కడ?

యుద్ధ ప్రాతిపదికన గుర్తింపునకు ఆదేశాలు

కరోనా అగ్గి రాజుకుంటోంది. ఇంతింతై అన్నట్లుగా ఎగసి పడుతోంది. 'నియంత్రణలోనే ఉన్నాం! లాక్‌డౌన్ కష్టం ఫలిస్తోంది' అనుకుంటుండగానే ఒక్కసారిగా కేసులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. ఆంధ్రప్రదేశ్‌లో మంగళవారం రాత్రికి 44 ఉన్న కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య ఒక్కరోజులో 111కు చేరుకుంది. ఇతర రాష్ట్రాల్లోనూ దాదాపు అదే పరిస్థితి. కొత్తగా బయటపడుతున్నవన్నీ 'మర్కజ్ నిజాముద్దీన్' సదస్సుతో ముడిపడినవే. దీంతో కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలనూ అప్రమత్తం చేసింది.

విజయవాడ రాజరాజేశ్వరి పేటలో మందు స్ప్రే చేస్తున్న దృశ్యం

ఎక్కడెక్కడ తిరిగారో తేల్చండి

పరీక్షలు నిర్వహించి క్వారంటైన్‌కు!

అన్ని రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం

కేబినెట్ కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్

భారీగా పెరుగుతున్న కరోనా కేసులు

అత్యధికం నిజాముద్దీన్ నుంచే వ్యాప్తి

దేశవ్యాప్తంగా కొనసాగుతున్న చర్యలు

మౌలానా సహా ఆరుగురిపై కేసు నమోదు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): దేశంలో కరోనా విస్తరణ కేంద్రంగా మారిన తబ్లీగ్ జమాత్ ప్రధాన కార్యాలయం మర్కజ్ నిజాముద్దీన్‌ను పోలీసులు పూర్తిగా ఖాళీ చేయించారు. 36 గంటల్లో 2361 మందిని అక్కడి నుంచి తరలించారు. కరోనా అనుమానిత లక్షణాలున్న వారిని ఆస్పత్రులకు... మిగిలిన వారిని క్వారంటైన్‌లకు పంపించారు. వైద్యులు, ఢిల్లీ పోలీసులు, కేంద్ర బలగాలు, రవాణా

మిగతా 8వ పేజీలో...

రాష్ట్రాన్ని చుట్టేసింది!

ఇప్పటికి 111 మంది బాధితులు

ఒక్కరోజులోనే 67 పాజిటివ్ కేసులు

కడపలో 15, పశ్చిమలో 14, గుంటూరులో 11, కృష్ణాలో 10, ప్రకాశంలో 4

చిత్తూరు, తూర్పులో ఐదుగురు చొప్పున

నెల్లూరులో ఇద్దరు, విశాఖలో ఒకరు

బాధితుల్లో అత్యధికులు ఢిల్లీ వెళ్లొచ్చినవారే

అసోం సందర్శనకు వెళ్లిన ముగ్గురికీ పాజిటివ్

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

కరోనా మహమ్మారి రాష్ట్రాన్ని చుట్టేస్తోంది. ప్రమాద ఘంటికలు మోగిస్తూ అన్ని జిల్లాలకూ విస్తరిస్తోంది. బుధవారం ఒక్కరోజే రాష్ట్ర వ్యాప్తంగా 67 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో ఏపీలో కరోనా బాధితులు 111కు పెరిగారు. కేవలం 24గంటల వ్యవధిలోనే 88 కొత్త కేసులు నమోదవగా, వీరిలో ఢిల్లీ సమావేశాలకు వెళ్లి వచ్చినవారు, వారితో దగ్గరి సంబంధాలు ఉన్నవారే అధికంగా ఉన్నారు. కొత్తగా నమోదైన 11 కేసులతో కలిపి గుంటూరు జిల్లాలో

మిగతా 7వ పేజీలో...

జిల్లాల వారీగా కేసుల వివరాలు

గుంటూరు	20
కడప	15
ప్రకాశం	15
కృష్ణా	15
పశ్చిమ గోదావరి	14
విశాఖపట్నం	11
తూర్పు గోదావరి	9
చిత్తూరు	6
నెల్లూరు	3
అనంతపురం	2
కర్నూలు	1
మొత్తం	111

కరోనా కాటు

దేశంలో ఒక్క రోజే 437 కేసులు, 23 మరణాలు

- మొత్తం పాజిటివ్ కేసులు 1,900పైనే
- యూపీలో తొలి కరోనా మరణం నమోదు
- ఇండోర్‌లో ముగ్గురు చిన్నపిల్లలు సహా ఒకే కుటుంబంలో 9 మందికి వైరస్
- మహారాష్ట్రలో 12కు చేరిన మరణాలు
- ముంబై, ఇండోర్‌లో ఇద్దరు పోలీసులకు
- రాజస్థాన్‌లో దర్గా వద్ద గుమికూడిన వంద మంది.. చెదరగొట్టిన పోలీసులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: దేశంలో కరోనా వైరస్ తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. నిజాముద్దీన్ మర్కజ్ లింకుతో కేసుల సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. 24 గంటల్లో 376 కొత్త కేసులు వెలుగు చూశాయని బుధవారం కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటించింది. దీంతో మొత్తం కేసులు 1,637కు, మరణాలు 38కి పెరిగాయని వెల్లడించింది. అయితే వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ప్రకటించిన లెక్కల ప్రకారం కేసుల సంఖ్య 1900 దాటింది. ఒక్కరోజే 400 కేసులు నమోదయ్యాయి. మరణాల సంఖ్య 58కి చేరింది. అత్యధిక కేసులు నమోదైన రాష్ట్రాల్లో తమిళనాడు, మహారాష్ట్ర, ఢిల్లీ ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లో తొలి కరోనా మరణం నమోదయింది. రెండు రోజుల కిందట గోరఖ్‌పూర్ ఆస్పత్రిలో 25 ఏళ్ల

మిగతా 8వ పేజీలో...

ఆ పది యమ డేంజర్!

దేశవ్యాప్తంగా 10 కరోనా వ్యాప్తి కేంద్రాలు

అందులో ఢిల్లీ నిజాముద్దీన్ దర్గా ప్రధానం

తబ్లీగీల భేటీ ద్వారానే సోకినట్లు నిర్ధారణ

యూపీ, కేరళ, మహారాష్ట్రల్లో మరో రెండేసి హాట్‌స్పాట్స్.. వీటన్నింటిపైనే ఫోకస్

8

పుంజుకున్న వైరస్ వేగం

నిపుణులతో చర్చలో చంద్రబాబు ఆందోళన

వ్యాప్తి వేగం పెరిగిన రాష్ట్రాల్లో ఏపీ కూడా..

రాష్ట్రంలో కనిపించని 21 మంది 'మర్కజ్' యాత్రికులు

తెలంగాణలో ఒక్కరోజే 30 కేసులు.. 3 మరణాలు

వరల్డోమీటర్ ప్రకారం బుధవారం రాత్రి 12.15 గంటలకు..

ప్రభావిత దేశాలు	అమెరికా	ఇటలీ	చైనా	స్పెయిన్	జర్మనీ	ఇరాన్	బ్రిటన్	ఇండియా	ప్రపంచం	తెలంగాణ	ఏపీ
బుధవారం నమోదు	16,908	4,782	36	6,213	4,736	2,988	4,324	437	59,810	30	67
మరణాలు	4,528	13,155	3,312	9,053	858	3,036	2,352	41	46,063	09	0
బాధితులు	2,05,438	1,10,574	81,554	1,02,136	76,544	47,593	29,474	1,834	9,18,129	121	111



శవాల దిబ్బ.. స్పెయిన్!

9 వేలు దాటిన మరణాలు, లక్షపైనే కేసులు

ప్రపంచవ్యాప్తంగా 45వేలకు చేరిన మృతులు

9 లక్షలను మించిన పాజిటివ్ కేసులు

యూరప్‌లోనే 30 వేల మందిపైగా బలి..

దక్షిణాఫ్రికాలో భారత సంతతి మహిళా శాస్త్రవేత్త మృతి

బంగ్లా, పాక్, శ్రీలంకలో పెరుగుతున్న ఉధృతి

2

నేడే శ్రీరామ నవమి

కనిపించని సందళ్లు, పందిళ్లు.. భక్తులు లేకుండానే భద్రాద్రి వేడుక.. తిరుమలలో నవమి ఆస్థానం

నేడే... శ్రీరామ నవమి! ఊరూ, వాడా పందిళ్లు వెలిసి... సందళ్లు నెలకొనాల్సిన వేళ ఇది! కానీ... రాష్ట్రాన్నీ, దేశాన్నీ 'కరోనా రక్కసి' కమ్మివేసింది. లాక్‌డౌన్ నేపథ్యంలో పండుగ ఇంటికే మాత్రమే పరిమితమవుతోంది. తెలుగు వారందరూ కనులారా చూడాలనుకునే భద్రాచల సీతారాముల కల్యాణాన్ని గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. కరోనా నేపథ్యంలో సామాన్య భక్తులకు అనుమతి ఉండదని ఇప్పటికే స్పష్టం చేశారు. తిరుమలలో శ్రీవారి ఆలయంలో గురువారం ఉదయం సీతారామ లక్ష్మణులకు తిరుమంజనం నిర్వహిస్తారు. రాత్రి 10 గంటలకు బంగారు వాకిలి చెంత శ్రీరామనవమి ఆస్థాన వేడుక నిర్వహిస్తారు. శుక్రవారం రాత్రి 8 గంటలకు బంగారు వాకిలి చెంత శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం నిర్వహిస్తారు. ఈ వేడుకలన్నింటినీ ఏకాంతంగానే నిర్వహిస్తారు. ఒంటిమిట్ట రామాలయంలో బ్రహ్మోత్సవాలకు గురువారం అంకురార్పణ జరుగుతుంది. ఇక్కడ పున్నమి రోజున సీతారామ కల్యాణం నిర్వహిస్తారు.

అజీమ్ విరాళం 1125 కోట్లు

అజీమ్ ప్రేమ్‌జీ

100 కోట్లు చొప్పున ఇచ్చిన లక్ష్మీ మిత్తల్, ఇన్ఫోసిస్ ఫౌండేషన్

పుణెలో ఆస్పత్రిని నిర్మిస్తామన్న మెర్సిడెజ్ బెంజ్

రూ. 27 కోట్లు ఇచ్చిన ఎరువుల కంపెనీలు

2

లక్ష్మీ మిత్తల్

కడుపు కొట్టిన కరోనా!

ముంబైలో తెలుగువారి బతుకు పోరాటం

పనుల్లేక 600 వలస కుటుంబాల ఆకలి కేకలు

రూ.5 పెట్టి బిందె నీళ్లు కూడా కొనలేని దుస్థితి

గుడిసె బాడుగ, కరెంటు చార్జీలు పెనుభారం

దాతలు పంచే అన్నం కూడా అందక ఇక్కట్లు

బయట అడుగు పెడితే లాఠీలతో ఒళ్లు గుల్ల

ఆదుకోవాలని ఏపీ ప్రభుత్వానికి వేడుకోలు

వర్సోవాలోని వలస కూలీల కుటుంబాలు

కర్నూలు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గుప్పెడు మెతుకుల కోసం వెళ్లిన వలస బతుకులు గంజి నీళ్ల కోసం అలమటిస్తున్నాయి. కూలి చేసుకునే శరీరాలు రూ.5 నీళ్ల బిందె కోసం లాఠీ దెబ్బలకు రక్తమోడుతున్నాయి. పూరి గుడిసెలకూ అద్దె వసూలు చేసే ముంబై మహానగరంలో కర్నూలు జిల్లా వాసుల ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. పాల కోసం ఏడ్చే పసిబిడ్డకు కొంగు చాటున కడుపు నింపుదామన్నా నెత్తురు చుక్కలే వస్తున్నాయన్న ఓ తల్లి రోదన అక్కడివారిని కంట తడి పెట్టిస్తోంది. కర్నూలు జిల్లాలోని 11 మండలాల నుంచి

మిగతా 8వ పేజీలో...

2

మనకు మూడో దశ ముప్పు తక్కువే

కానీ తాజా కేసులతో అప్రమత్తం కావాలి

ముందే మేలుకొని దేశాల్లోనే వైరస్ ఉధృతి

మాస్కులు అందరూ ధరించాల్సిన పని లేదు

దానివల్ల నిజంగా కావాల్సిన వారికి కొరత

'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేక ఇంటర్వ్యూలో యశోద సీనియర్ వైద్యుడు ఎంవీ రావు

గమనిక: కరోనా వ్యాప్తి, లాక్ డౌన్ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' టాబ్లాయిడ్‌ను మెయిన్ పేజీల్లో కలిపి ఇస్తున్నాం. ప్రధాన పత్రికలోని *I, II, III, IV* పేజీలను టాబ్లాయిడ్ ఫుల్ అవుట్‌గా తీసుకోవచ్చు.

వైరస్ వర్రీ వద్దు

బాధితులపై వివక్ష వద్దు

ప్రేమ, ఆప్యాయతలు చూపండి

పెద్దవయసు, అస్వస్థులకు సోకితేనే కొంతవరకు తీవ్రత

దేశ ప్రధానులకే తప్పలేదు

జాగ్రత్తల్తో తగ్గించుకున్నారు

ఇంతగా పెరగడం బాధాకరం

కరోనా వ్యాప్తిలో ఢిల్లీ లింకు

వారికివారే పరీక్షకు రావాలి

ఆరోగ్య సర్వేకు సహకరిస్తే ఇంట్లోనే తగ్గించుకోవచ్చు

రైతులు పనులు చేసుకోవచ్చు

జీతాలు వాయిదా వేసుకున్న ఉద్యోగులకు ధన్యవాదాలు

సీఎం జగన్ వీడియో సందేశం

అదొక జ్వరం లాంటిదే

అమరావతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): "కరోనా వైరస్ జ్వరం, ఫ్లూ లాంటిదే. అది క్యూరబులే. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు" అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. కాకపోతే కరోనా ప్రభావం కొద్దిగా వయస్సులో పెద్దవారిపైనా, బీపీ, షుగర్, కిడ్నీ సమస్యలు ఉన్నవారిపైనా మామూలు జ్వరం కంటే తీవ్రంగా ఉంటుందన్నారు. అలాగని ఎవరూ అధైర్యపడాల్సిన పనిగానీ, ఆందోళన చెందాల్సిన

మిగతా 7వ పేజీలో...

ఆదాయం ఉంది.. జీతాలివ్వొచ్చు: టీడీపీ

సమస్యను భూతద్దంలో చూపే యత్నం

టీడీపీ టెలి కాన్ఫరెన్స్‌లో నేతల వ్యాఖ్య

ఆదాయ వివరాలు ఇవ్వాలని డిమాండ్

7

పరంజ్యోతి

రామనామాత్ పరోమంత్రః నభూతో నభవిష్యతి

వేదవేద్యే పరేపుంసి జాతే దశరథాత్మజే
వేదః ప్రాచేత సాదాసీత్ సాక్షద్రామాయణాత్మనా

..వేదవేద్యుడైన ఆ పరమాత్మ దశరథ నందనుడైన రాముడిగా జన్మించడంతో వాల్మీకి ద్వారా వేదమే రామాయణ రూపంలో అవతరించిందని ఆర్షవాక్యం. రామనామంలో త్రిమూర్తులున్నారు. 'ర'కారం అగ్ని బీజాక్షరం. రంగు ఎరుపు. రజోగుణం. దానికధిపతి బ్రహ్మ. 'అ'కారం సూర్యబీజం. రంగు తెలుపు. సత్వగుణం. దానికధిపతి విష్ణువు. 'మ'కారం చంద్ర బీజం. రంగు నలుపు. తమో గుణం. దానికధిపతి శివుడు. కనుక 'రామ'నామం.. హరిహరమయం. అందుకే.. 'రామనామాత్ పరోమంత్రః నభూతో నభవిష్యతి' అన్నారు. రామనామానికి సమమైన మంత్రం ఇంతకుముందు లేదు. ఇకపై ఉండబోదని దీని అర్థం. అష్టాక్షరీ మంత్రంలోని ఐదో అక్షరమైన 'రా'.. పంచాక్షరీ మంత్రంలోని 'మ' అనే రెండవ అక్షరం చేరితే 'రామ' అవుతుంది. విష్ణువు రామావతారమెత్తిన చైత్ర శుద్ధ నవమి తిథి సర్వకామద (అన్ని కోర్కెలూ తీర్చేది).

ముముక్షూణాం విరక్తానాం తథా చాశ్రమవాసినామ్
ప్రణవత్వాత్సదా ధ్యేయో యతీనాంచ విశేషతః

మోక్షాన్ని పొందగోరు గృహస్థులు, విరక్తులైన వానప్రస్థులు, ఆశ్రమవాసులైన బ్రహ్మచారులు.. ముఖ్యంగా యతులు.. ప్రణవం వంటిదైన రామ నామమనే మంత్రాన్ని సదా జపిస్తే జీవన్ముక్తి లభిస్తుందని 'రామ రహస్యోపనిషత్' తెలుపుతోంది. రామతత్వాన్ని బాగా తెలుసుకొంటే పరతత్వం తెలుస్తుంది. రామతత్వమే పరతత్వం. పరతత్వమే రామతత్వం. 'శ్రీరామ రామ రామ అని నేను రామునియందు సదా రమించుచుందును. అది సహస్రనామములతో సమానమైనద'ని సాక్షాత్తూ ఆ శివుడు పార్వతికి చెప్పాడు. బ్రహ్మతత్వంతో నూటికి నూరు పాళ్లూ సమన్వయమయ్యేది రామ తత్వమే. రామనామం జపించడం వలన, స్మరించడం వల్ల, రాయడం వల్ల, సంకీర్తనం చేయడం వల్ల ముక్తి లభిస్తుందని భక్త కబీరు తెలిపాడు. నారద మహర్షి ప్రేరణచే శ్రీరామచరిత్రను ఏడు కాండలుగా అనుష్టుప్ ఛందస్సులో రచించి 'వాల్మీకి'.. మహర్షియై జన్మ సాఫల్యం చేసుకున్నాడు. 'రామో విగ్రహవాన్ ధర్మః' 'సాధుః సత్య పరాక్రమః' అని ప్రపంచానికి తెలిపి చరితార్థుడైనాడు. రామునికి ప్రియమైన వాటిలో సత్యమొకటి. రామస్వరూపమే సత్యం. అగ్ని కణాన్ని పొరపాటున తాకినా ఎలా దహిస్తుందో.. అలాగే, పెదవుల వెంట ఎలా వెలువడినా రామనామం పాపాలను దహించివస్తుంది. 'రా' అనగానే తెరచిన పెదవుల గుండా శరీర గతి దోషాలు వెలుపలికి పోతాయి. 'మ' అనగానే పెదవులు కలిసిపోయి తిరిగి పాపాలను లోనికి రానీయవు. నాలుక అనే గడప దగ్గర శ్రీరామ నామమను మణిదీపాన్ని వేలాడగడితే లోపలి చీకటి, బయటి తమస్సు ఒక్కసారిగా మాయమవుతాయంటూ శ్రీరామమహిమను గురించి తులసీదాసు తన దోహాలలో చెప్పాడు. రామాయణాన్ని శరణాగత శాస్త్రమన్నారు. అట్టి శ్రీమద్రామాయణ పారాయణ, శ్రవణం సర్వ పాపాలనూ తొలగిస్తుంది. కొడుకుగా, అన్నగా, భర్తగా, రాజుగా, పరిపూర్ణ మానవునిగా శ్రీరాముడు మనకు ఆదర్శం.

- మేఘశ్యామ (ఈమని) 83329 31376

అజీమ్ విరాళం 1,125 కోట్లు

రూ.100 కోట్లు ప్రకటించిన లక్ష్మీ మిత్తల్

- పుణెలో ఆస్పత్రిని నిర్మిస్తామన్న మెర్సిడెజ్ బెంజ్
- రూ. 27 కోట్లు ఇచ్చిన ఎరువుల కంపెనీలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: కరోనాపై పోరుకు విప్రో అధినేత అజీమ్ ప్రేమ్‌జీ రూ.1125 కోట్ల విరాళం ప్రకటించారు. అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ద్వారా రూ.1000 కోట్లు, విప్రో లిమిటెడ్ ద్వారా రూ.100 కోట్లు, విప్రో ఎంటర్‌ప్రైజెస్ ద్వారా రూ.25 కోట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. విప్రో ప్రతి ఏట సీఎస్ఆర్ ఫండ్ కింద కేటాయించే మొత్తం కాకుండా అదనంగా ఈ విరాళాన్ని ఇచ్చారు. ఎన్నారై బిలియనీర్ లక్ష్మీ మిత్తల్ కరోనాపై పోరుకు తన వంతుగా రూ.100 కోట్లు విరాళమిచ్చారు. పుణెలో కరోనా బాధితులకు కోసం 1500 బెడ్లతో కూడిన తాత్కాలిక ఆస్పత్రిని నిర్మిస్తామని మెర్సిడెజ్ బెంజ్ ఇండియా ప్రకటించింది. అంతే కాకుండా సంస్థలో ఉద్యోగులు తమ ఒక రోజు వేతనాన్ని మహారాష్ట్ర సీఎం సహాయ నిధికి ఇవ్వనున్నట్లు పేర్కొంది. వైద్య పరికరాల కోసం 100 కోట్ల రూపాయల విరాళం అందించిన విషయం తెలిసిందే. వైద్య సిబ్బందికి అవసరమైన రక్షణ సూట్లు, మాస్క్‌లను అందించేందుకు టిక్‌టాక్ యాప్ ముందుకొచ్చింది. రూ.100 కోట్ల విలువైన 4 లక్షల ప్రొటెక్టివ్ సూట్లు, మాస్క్‌లను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు అందించడంతో పాటుగా రెండు లక్షల మాస్క్‌లను ఢిల్లీ, మహారాష్ట్ర ప్రభుత్వాలకు అందించామని ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. మధ్యప్రదేశ్‌లో 82 ఏళ్ల శలభా ఉస్కర్ అనే ఓ రిటైర్డ్ ఉద్యోగిని కరోనా సహాయ కార్యక్రమాల కోసం తన పెన్షన్ నుంచి రూ.లక్ష విరాళంగా ప్రకటించారు. లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రముఖ ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణమూర్తి, సుధామూర్తి కుటుంబీకులు అక్షయపాత్ర ఫౌండేషన్‌కు రూ.10 కోట్ల విరాళం ప్రకటించారు. ఇన్ఫోసిస్ ఇప్పటికే రూ. 100 కోట్ల విరాళం ప్రకటించిన విషయం తెలిసిందే.

- పీఎం కేర్స్ ఫండ్‌కు ఇండియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ రూ.25 కోట్ల విరాళాన్ని ప్రకటించింది.
- దేశవ్యాప్తంగా ఉన్న ఎరువుల కంపెనీలు రూ. 27 కోట్లు విరాళమిచ్చాయి.
- బీడీఎల్ రూ.9.02 కోట్ల విరాళం ఇచ్చింది.
- ప్రభుత్వ రంగ సంస్థ బెల్ రూ.15.72 కోట్ల విరాళాన్ని ఇచ్చింది.
- జెమ్స్, జువెల్లరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ రూ. 21 కోట్ల విరాళం ఇవ్వనున్నట్లు బుధవారం ప్రకటించింది. జిందాల్ అల్యూమీనియం రూ. 5 కోట్లు ఇచ్చింది.
- సీజేఐ సహా సుప్రీంకోర్టు జడ్జిలందరూ తలో 50 వేలను విరాళమిచ్చారు.
- లోక్‌సభ సచివాలయ సిబ్బంది ఒక రోజు వేతనాన్ని విరాళంగా ప్రకటించారు.

విరాళాల సేకరణకు సంగీత కచేరీ

కరోనా సహాయ కార్యక్రమాలకు విరాళాలు సేకరించేందుకు సినీ గాయకులు, సంగీత కళాకారులు కేర్ కాన్సెర్ట్ పేరుతో డిజిటల్ కచేరీని నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా వారంతా తమ ఇళ్లలో నుంచే ప్రదర్శనలిస్తారు. ఈ కచేరీ ఈ నెల 11న జరగనుంది. దీన్ని టీ సిరీస్ 93.5 రెడ్ ఎఫ్ఎం, యూట్యూబ్ ప్రసారం చేస్తాయి.

సీఎంఆర్ఎఫ్‌కు విరాళాలు

సీఎంకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

అమరావతి, విజయవాడ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ నివారణ కోసం ప్రభుత్వానికి చేయూత అందించేందుకు పలు సంస్థలు ముందుకొస్తున్నాయి. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో బుధవారం నాడు సీఎం జగన్మోహన్‌రెడ్డికి లైనా గ్రూప్ తరఫున కోటి రూపాయల విరాళాన్ని గోకరాజు గంగరాజు అందజేశారు. అదే విధంగా సీఎం జగన్‌ను కలసి వల్లభ గ్రూప్ తరఫున రూ.50 లక్షల విరాళాన్ని వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అందజేశారు. కృష్ణా మిల్క్ యూనియన్ రూ.25 లక్షల చెక్‌ను చైర్మన్ చలసాని ఆంజనేయులు చెక్కును మంత్రి మోపిదేవికి అందించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ రీజియన్ ఉద్యోగులు సీఎం సహాయ నిధికి రూ.3.07 లక్షలు విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తాన్ని బ్యాంకు ఉన్నతాధికారులు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.ఎస్.రావత్‌కు అందించారు. రాష్ట్ర ఐపీఎస్ అధికారులు 3 రోజుల వేతనాన్ని సీఎం సహాయ నిధికి ఇవ్వాలని నిర్ణయించారు. డీజీపీ గౌతం సవాంగ్, ఐపీఎస్ అధికారుల సంఘం కార్యదర్శి ద్వారకా తిరుమలరావు ఇతర అధికారులు బుధవారం సీఎం జగన్‌ని కలిసి తమ నిర్ణయాన్ని తెలిపారు. రాష్ట్రంలోని కాంట్రాక్ట్ అధ్యాపకులు తమ ఒక రోజు వేతనం కోటి రూపాయలను సీఎం సహాయ నిధికి విరాళంగా ఇస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీజే గాంధీ తెలిపారు.

ఎండాకాలం

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
విశాఖపట్నం	36.4	25.2
హైదరాబాద్	37.3	26.2
గుంటూరు	37.9	24.7
విజయవాడ	38.8	25.4
రాజమండ్రి	40.0	19.0
కడప	41.0	22.0

ఒకరిది ఇంట్లో యోగా.. మరొకరిది మనుగడ పోరాటం

దేశంలో రెండు భారత్‌లు కనిపిస్తున్నాయి. ఒకరు ఇంట్లో కూర్చొని యోగా చేస్తున్నారు. రామాయణం చూస్తున్నారు. అంత్యాక్షరి ఆడుతున్నారు. మరొకరు ఇంటికి వెళ్లేందుకు పోరాడుతున్నారు. లాక్‌డౌన్ నేపథ్యంలో వేలాది మంది వలస కూలీలు స్వస్థలాలకు వెళ్లేందుకు వందలాది కిలోమీటర్లు నడుస్తున్నారు. భోజనం, ఆశ్రయం, సహాయం అందక మనుగడ కోసం పోరాడుతున్నారు.

- కపిల్ సిబల్, కాంగ్రెస్ సీనియర్ నేత

ప్రధాని సొంత ప్రచారానికే 'పీఎం కేర్స్ ఫండ్'

కరోనా వైరస్ సాకుతో 'పీఎం కేర్స్ ఫండ్' పేరుతో నిధులు సమకూర్చడం ప్రధాని మోదీ సొంత ప్రచారం కోసమే. ఉద్దీపన ప్యాకేజీకి 'పీఎం గరీబ్ కల్యాణ్ యోజన' అని పేరు పెట్టడం భారత్‌లోనే జరిగింది. సొంత ప్రచారానికి లభించే ఏ అవకాశాన్నీ మోదీ వదులుకోరు. మరే దేశ అధ్యక్షుడు, ప్రధానమంత్రి ఉద్దీపన ప్యాకేజీకి తన పేరు పెట్టుకోలేదు. ప్రధానమంత్రి సహాయ నిధి ఉండగా మరో నిధి అవసరమేంటి?

- పృథ్వీరాజ్ చవాన్, కాంగ్రెస్ సీనియర్ నేత

శవాల దిబ్బ.. స్పెయిన్!

- 9 వేలు దాటిన మరణాలు, లక్షపైనే కేసులు
- ప్రపంచవ్యాప్తంగా 46వేలకు చేరిన మృతులు
- 9 లక్షలను మించిన పాజిటివ్ కేసులు
- దక్షిణాఫ్రికాలో భారత సంతతి శాస్త్రవేత్త మృతి

మాడ్రిడ్, రోమ్, లండన్, ఏప్రిల్ 1: రోజుకు ఆరేడు వేల పాజిటివ్ కేసులు.. ఎనిమిది వందలకు తగ్గని మరణాలు..! స్పెయిన్‌లో కరోనా ఉధృతి ఇది. మరో 864 మంది మృతితో బుధవారం నాటికి దేశంలో వైరస్‌కు బలైనవారి సంఖ్య 9 వేలు దాటింది. కేసులు లక్షను మించాయి. తాగాగా 727 మంది చనిపోవడంతో ఇటలీలో మృతుల సంఖ్య 13,155 వేలకు చేరింది. ఫ్రాన్స్, యూకే (563), బెల్జియం (123), నెదర్లాండ్స్ (134) సహా యూరప్‌లోనే కరోనా మృతుల సంఖ్య 30 వేలపైగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా 46వేల మంది ప్రాణాలు కోల్పోయారు. కొవిడ్ తో బ్రిటన్‌లో బాలుడు (13), బెల్జియంలో బాలిక (12) చనిపోయారు. కరోనా లక్షణాలతో దక్షిణాఫ్రికాలో భారత సంతతికి చెందిన ప్రఖ్యాత వైరాలజీ శాస్త్రవేత్త గీతా రామ్‌జీ (64) కన్నుమూశారు. టీకా శాస్త్రవేత్త, హెచ్ఐవీ నిరోధక పరిశోధక బృంద నాయకురాలైన గీతా.. గతవారం లండన్ నుంచి వచ్చారు. డర్బన్‌లోని సౌతాఫ్రికన్ మెడికల్ రిసెర్చ్ కౌన్సిల్‌లో ఆమె పనిచేస్తున్నారు. ఇరాన్‌లో మరో 138 మంది మృతిచెందారు. పాకిస్థాన్‌లో కేసుల సంఖ్య 2 వేలు దాటింది.

సంక్షోభంలోనూ పాక్‌లో మత వివక్ష

కరోనాపై పోరాటంలో ప్రపంచమంతా ఒక్కటవుతుంటే.. పాకిస్థాన్ మాత్రం తన వక్ర బుద్ధిని చాటుకుంటోంది. కరాచీలోని రెహ్రీ ఘోత్ వద్ద ఆహార పదార్థాలు, నిత్యావసరాల పంపిణీని ముస్లింలకే పరిమితం చేశారు. 'మా అబ్బాయి రిక్షా కార్మికుడు. ఇప్పుడు పని లేక ఇంట్లో ఉంటున్నాడు. రేషన్ సెంటర్లకు వెళ్తే మీకు ప్రత్యేక వాహనంలో పంపుతామని చెబుతున్నారు. అదంతా అబద్ధమే. మా ఇరుగుపొరుగు ఉన్న ముస్లింలకు మాత్రం సరుకులు వస్తున్నాయి' అని ఓ హిందువు చెప్పుకొచ్చాడు.

యూరప్‌లో ఐసీయూ మంచాల కొరత

యూరప్‌లోని ఆసుపత్రుల్లో ఐసీయూల కొరత నెలకొంది. వైద్య సిబ్బందికి రక్షణ సామగ్రి కరువయ్యాయి.. తాత్కాలిక ఆసుపత్రుల నిర్మాణం చేపడుతున్నా.. లక్షల సంఖ్యలో కేసులు వస్తుండటంతో అవి చాలడం లేదు. దీంతో రోగులను హై స్పీడ్ రైళ్లు, సైనిక విమానాల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

దుబాయిలో విజృంభిస్తున్న కరోనా?

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

దుబాయి నగరం నడిబొడ్డున ఉన్న దేరాలో కరోనా విజృంభిస్తోంది. పోలీసులు, సాయుధ దళాల పారా మెడికల్ వైద్య సిబ్బంది భవనాలన్నింటిలో తనిఖీ చేసి వ్యాధి లక్షణాలు ఉన్నవారిని ఆస్పత్రులకు తరలిస్తున్నారు. పాజిటివ్ నిర్ధారణ అయిన కొందర్ని ఆస్పత్రులలో, మరికొందర్ని కేరళకు చెందిన ప్రవాసుల సాయంతో ఐసోలేషన్ సెంటర్‌కు తరలిస్తున్నారు. పాజిటివ్‌గా నిర్ధారణయిన వారితో ఇటీవల కలిసి ఉండి నెగిటివ్‌గా తేలిన వారిని మొదట వదిలేశారు. అయితే, మలయాళ ప్రవాసీ ప్రముఖులు జోక్యం చేసుకోవడంతో, నెగిటివ్‌గా తేలిన వారినీ క్వారంటైన్ కు తరలించారు. ఆ సమయంలో మలయాళీ వాలంటీర్లు, పోలీసులు సాయం చేశారు.

చైనాలో నిద్రాణ కేసుల కలకలం

చైనాలో ఇప్పుడు కొత్త కలకలం. దేశంలో 1,541 అసింప్టొమాటిక్ (నిద్రాణ లేదా నెమ్మదైన వైరస్ వాహక) కేసులు బయటపడినట్లు బుధవారం జాతీయ ఆరోగ్య కమిషన్ ప్రకటించింది. దీంతో వైరస్ సెకండ్ వేవ్ ఇన్ఫెక్షన్ ఆందోళనలు రేగుతున్నాయి. వైరస్ ఉన్నప్పటికీ అసింప్టొమాటిక్ కేసుల్లో త్వరగా బయటపడదు. కానీ, క్రమంగా విస్తరిస్తూ ప్రభావం చూపుతుంది. ఇలాంటి వారందరినీ వైద్య పరిశీలనకు తరలించారు.చైనాలో కరోనాతో బుధవారం ఏడు మరణాలు మాత్రమే నమోదయ్యాయి.

శుద్ధ ఇంధన దేశంగా భారత్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: 100% శుద్ధమైన పెట్రోలు,డీజిల్ విక్రయించే ప్రపంచదేశాల జాబితాలో భారత్ చేరింది. 'యూరో-6 ఇంధన ఉద్గారాల నియంత్రణ' నిబంధనలకు అనుగుణంగా ఇంధనాలను శుద్ధిచేసేలా చమురు కంపెనీలు ప్లాంట్లను నవీకరించుకోవడంతో ఇది సాధ్యమైంది. బుధవారం నుంచి బంకుల్లో బీఎస్-6 గ్రేడ్ ఇంధనం అందుబాటులోకి వచ్చిం ది.

రూ.61 తగ్గిన సబ్సిడియేతర సిలిండర్ ధర

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: సబ్సిడియేతర ఎల్పీజీ సిలిండర్ ధర రూ.61.5 తగ్గింది. దీంతో 14.2 కిలోగ్రాముల సిలిండర్ ధర రూ.744కి తగ్గింది. మార్చి 1న కూడా సబ్సిడియేతర ఎల్పీజీ సిలిండర్ ధర రూ.53 తగ్గింది.

హజ్‌యాత్ర ఆలస్యం: సౌదీ అరేబియా

దుబాయ్, ఏప్రిల్1: కరోనాతో హజ్‌యాత్ర ఆలస్యమయ్యే సూచన కనిపిస్తోంది. ఈ సారి హజ్‌యాత్ర ప్రణాళికను ఆలస్యంగా రూపొందించుకోవాలని ముస్లింలకు సౌదీ అరేబియా ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. తాము స్పష్టతనిచ్చేవరకు ట్రావెల్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకోవద్దని సౌదీ మంత్రి మహ్మద్ సలేహ్ బిన్ తాహెర్ సూచించారు.

కరోనా నుంచి జాగ్రత్త పడినా కాలం కాటేసింది!

చింతలపూడి, ఏప్రిల్ 1: పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడి మండలం రాఘవాపురంలో కరోనా కారణంగా విధించిన లాక్‌డౌన్ విషాదాన్ని నింపింది. గ్రామంలో గత నెల 18న ఒకరి ఇంటిలో జరిగిన విందు భోజనానికి తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెం నుంచి ఓ యువకుడు వచ్చి వెళ్లాడు. అతడికి కరోనా పాజిటివ్ రావడంతో విందుకు వచ్చిన వారందరినీ అధికారులు హోం క్వారంటైన్‌లో ఉంచారు. అదే వీధిలో ఉంటున్న రవీంద్ర (56) కుటుంబం కూడా ఆ విందు భోజనానికి వెళ్లారు. వారు కూడా 14 రోజులు (గత మంగళవారం వరకు) క్వారంటైన్‌లో ఉన్నారు. బుధవారం ఉదయం ఇంటి ముందున్న మొక్కల నుంచి కూరగాయలను రవీంద్ర కోసి ఇంట్లోకి తీసుకొస్తుండగా ముందుకు తూలి పడడంతో చేతిలోని చాకు ఛాతీలో బలంగా దిగింది. అతడి అరుపు విన్న భార్య వచ్చి చూడగా రక్తపు మడుగులో భర్త పడి ఉన్నాడు. సాయం కోసం ఆమె కేకలు వేసినా పూర్తిస్థాయి లాక్‌డౌన్ కారణంగా వీధుల్లో జన సంచారం లేకపోవడంతో ఎవరూ స్పందించలేదు. తక్షణ వైద్య సహాయం అందక రవీంద్ర మృతి చెందాడు. కళ్ల ముందే భర్త మృతి చెందడంతో భార్య కన్నీరుమున్నీరయింది.

అధికారిక సమాచారాన్నే ఇవ్వాలి

- ఆర్థిక ఎమర్జెన్సీపై 2 వారాల తర్వాత: సుప్రీం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: కరోనా వైరస్ వ్యాప్తిపై సోషల్ మీడియా, డిజిటల్ మీడియా సహా అన్ని మీడియా సంస్థలు ప్రభుత్వ అధికారిక సమాచారాన్నే ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ధ్రువీకరించుకోకుండా ఇచ్చే వార్తలతో ప్రజలు భయపడే ప్రమాదం ఉంటుందని పేర్కొంది. కరోనా వైరస్‌పై కేంద్రం సమర్పించిన నివేదిక ఆధారంగా ప్రధాన న్యాయమూర్తి ఎస్ఏ బోబ్డే నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ ఆదేశాలిచ్చింది. ఈ ఆదేశాల ను జాతీయ బ్రాడ్‌కాస్టర్స్ అసోసియేషన్(ఎన్‌బీఏ) స్వాగతించింది. ఈ అంశంపై ప్రభుత్వమే రోజువారీ వివరాలను సోషల్ మీడియా సహా అన్ని మీడియా వేదికలకు విడుదల చేయాలని ఎన్‌బీఏ అధ్యక్షుడు రజత్‌శర్మ కోరారు. కాగా.. ఇరాన్‌లోని కోమ్‌లో 250 మంది భారత యాత్రికులు చిక్కుకున్నారని కేంద్రం బుధవారం సుప్రీంకోర్టుకు తెలిపిం ది. వారందరికీ కరోనా పరీక్షలు జరపగా పాజిటివ్ వచ్చిందని పేర్కొంది. మరో 500 మందిని స్వదేశానికి తీసుకొచ్చినట్లు వివరించింది. అయితే అక్కడ చిక్కుకున్న వారి బాధ్యతను భారత దౌత్యకార్యాలయం తీసుకోవాలని ఆదేశించనున్నట్లు న్యాయమూర్తులు డీవై చంద్రచూడ్, ఎంఆర్ షాల ధర్మాసనం తెలిపింది. అంతర్జాతీయ విమానాలు రద్దయినందున, వారిని తీసుకొచ్చేందుకు విదేశాంగ శాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అన్నారు. మరోవైపు దేశంలో ఆర్థిక ఎమర్జెన్సీ విధించాల ంటూ దాఖలైన పిటిషన్‌పై విచారణను 2 వారాల తరువాత చేపడతామని సుప్రీంకోర్టు తెలిపింది. దేశవ్యాప్త లాక్‌డౌన్‌తో ఆర్థిక పరిస్థితి అతలాకుతలమైందని, అందుకే ఆర్థిక ఎమర్జెన్సీ విధించాలంటూ సెంటర్ ఫర్ అకౌంటబిలిటీ, సిస్టమ్ చేంజ్ (సీఏఎస్‌సీ) ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది.

విషాదంలోనూ విధి నిర్వహణ

- లాక్‌డౌన్‌తో తల్లి అంత్యక్రియలకు వెళ్లలేకపోయిన ఎస్ఐ

విజయనగరం క్రైమ్, ఏప్రిల్ 1: కరోనాపై పోరులో పోలీసు అధికారులు, సిబ్బంది నిర్విరామంగా సేవలందిస్తున్నారు. కుటుంబ సభ్యుల బాగోగులు సైతం పక్కన పెట్టేస్తున్నారు. ఇందుకు ఎస్ఐ శాంతారాం ఓ ఉదాహరణ. విజయనగరం జిల్లా లక్కవరపుకోటకు చెందిన కె.శాంతారాం ప్రస్తుతం విజయవాడలో జీఆర్‌పీ ఎస్ఐగా పనిచేస్తున్నారు. మార్చి 28న తల్లి అనారోగ్యంతో మృతిచెందింది. ఈ విషయాన్ని సోదరుడు చంద్రశేఖర్ అదేరోజు శాంతారాంకు తెలియజేశారు. అంత బాధలోనూ శాంతారాం.. ఈ సమయంలో విధులను పక్కనబెట్టి రాలేనని చెప్పాడు. ఇప్పటికిప్పుడు నాలుగు జిల్లాలు దాటి రావడం కూడా అంత శ్రేయస్కరం కాదని సోదరుడికి చెప్పాడు. తన కోసం ఎదురు చూడకుండా తల్లి అంత్యక్రియలు చేసేయాలని, తాను విధులు నిర్వహిస్తేనే తల్లి ఆత్మకు శాంతిచేకూరుతుందని చెప్పారు. దీంతో ఆ రోజే ఆయన తల్లికి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ విషయం తెలిసి పోలీసు ఉన్నతాధికారులు శాంతారాంను అభినందించారు.

మూడో దశ ముప్పు తక్కువే

'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేక ఇంటర్వ్యూలో యశోద ఆస్పత్రి సీనియర్ వైద్యుడు ఎంవీ రావు

ప్రపంచవ్యాప్తంగా కరోనా కరాళ నృత్యం కొనసాగుతోంది. పాజిటివ్ కేసుల సంఖ్య అపరిమితంగా పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది! ఏ వస్తువు తాకితే వైరస్ సంక్రమిస్తుందో.. ఏ వ్యక్తిలో వైరస్ దాగి ఉందో అనే భయం ప్రతి ఒక్కరిలో!! ఈ తరుణంలో ఎలా వ్యవహరించాలి? కరోనా నుంచి ఎలా కాపాడుకోవాలి అనే అంశాలపై 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో యశోద ఆస్పత్రి సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ ఎమ్.వి.రావు పలు సూచనలు చేశారు. అవి ఆయన మాటల్లోనే..

కరోనా తీరే వేరు!

ఒక వ్యక్తి ద్వారా పది మందికి వ్యాధి వస్తే ఆర్ 10 అంటారు. కరోనా విషయంలో వైరస్ సంక్రమించే తీవ్రత 'ఆర్-3' నుంచి 'ఆర్-5' దాకా ఉంది. అంటే... జనసాంద్రతను బట్టి, కరోనా సోకిన ఒక వ్యక్తి ద్వారా ఆ వైరస్ ముగ్గురి నుంచి ఐదుగురికి సోకుతోంది. లక్షణాలు బయల్పడే లోపే, వైరల్ లోడ్ ఇతరులకు సోకే స్థాయికి చేరుకుంటోంది. ఫలితంగా 14 రోజుల ఇంక్యుబేషన్ పీరియడ్‌లోనే.. వైరస్ సోకిన వ్యక్తికి తెలియకుండానే.. ఎంతోమందికి ఈ వైరస్ సోకుతోంది. వారి ద్వారా ఇంకొందరికి వైరస్ సోకుతోంది. ఈ వ్యాధి ఇంతలా విస్తరించడానికి కారణం ఇదే. వేరే దేశాల్లో ఉండగా కరోనా సోకి, ఆ తర్వాత దేశంలోకి అడుగుపెట్టిన వ్యక్తులకే ఈ వ్యాధి పరిమితమై ఉంటే, ఆ దశను ఫేజ్-1 అనాలి. వారికి దగ్గరగా మెలిగే కుటుంబసభ్యులకూ వైరస్ సోకితే ఆ దశ... ఫేజ్-2. ఈ రెండు దశలకు భిన్నంగా ఫేజ్-1, ఫేజ్-2 వ్యక్తులతో నేరుగా సంబంధం లేకుండా సామాజిక సంక్రమణ(కమ్యూనిటీ స్ప్రెడ్)లో భాగంగా వ్యాధి సోకితే ఆ దశను ఫేజ్-3గా పరిగణించాలి. ప్రస్తుతం చాలా దేశాలు ఫేజ్-3లో ఉన్నాయి. ఫేజ్-2లో మేలుకోకపోవడం వల్లనే ఆయా దేశాలకు ఈ దుస్థితి. అక్కడ వైరస్ ఉధృతి ఎక్కువగా ఉంది. మనదేశంలో, రాష్ట్రంలో లాక్‌డౌన్ పాటిస్తూ ఇతరత్రా రక్షణచర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ఇక్కడ ఫేజ్-3 వచ్చే అవకాశాలు తక్కువే. కానీ.. తాజాగా వెలుగులోకి వచ్చిన నిజాముద్దీన్ యాత్రికుల్లో చాలామందికి వైరస్ పాజిటివ్ వస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. అయితే మరణాల శాతం తక్కువే. వైరస్ సోకినవారిలో మరణిస్తున్నవారు కేవలం 3 శాతమే.

వైద్యుల పట్ల అనుమానపు చూపు వద్దు!

కరోనా వైరస్ ప్రబలిన తొలినాళ్లలో చైనాలో చాలామంది వైద్యులు దానిపై తగిన అవగాహన లేక మాస్కులు ధరించలేదు. తగిన రక్షణ చర్యలు పాటించలేదు. వ్యాధితత్వాన్ని, ప్రభావాన్ని, తీవ్రతను అంచనా వేయలేకపోయారు. ఈ కారణాలన్నింటి వల్ల అక్కడ కొందరు వైద్యులు ఆ వైరస్‌కు బలయ్యారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కరోనా పట్ల వైద్యులకు పూర్తి అవగాహన ఉంది. కాబట్టే ఆస్పత్రుల్లో నెగెటివ్ చాంబర్లు ఏర్పాటు చేసుకుని.. రోగి నుంచి వైరస్ సోకకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. వారి ద్వారా ఇతరులకు వైరస్ సోకే వీలు లేదు. కరోనా రోగి ప్రాణాలను కాపాడిన వైద్యులను ఆకాశానికి ఎత్తేసే ప్రజలే.. వారి నుంచి తమకు వ్యాధి సోకుతుందనే భయంతో వారిని దూరం నెట్టేయడం సరికాదు. వైద్యులను, వైద్య సిబ్బందినీ అంటరానివారిగా చూడొద్దు. కొవిడ్-19 పాజిటివ్‌గా తేలిన వ్యక్తులు తప్పనిసరిగా మాస్కులు ధరించాలి.

-నవ్య డెస్క్

అమెరికా.. అలో లక్ష్మణా

- కరోనా కుదుపుతో ఉపాధికి భారీ గండి
- 4 వేలు దాటిన వైరస్ మరణాలు
- 9/11 దాడుల మృతుల కంటే ఇది ఎక్కువ

వాషింగ్టన్, న్యూయార్క్, ఏప్రిల్ 1: అమెరికా అంటే డాలర్ల కొద్దీ సంపాదన! ఎలాగొలా ఆ దేశానికి ఎగిరిపోతే కలోగంజో తా

ఇళ్ల స్థలాలపై కన్వేయెన్స్ డీడ్‌లే!

- ఖాళీ స్థలాన్ని ఐదేళ్ల తర్వాతైనా అమ్ముకోవద్దు
- ఇల్లు నిర్మించినా..నిబంధనలకు లోబడే బదలాయింపు
- సర్కారు తాజా ఉత్తర్వులు

అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇచ్చే ఇంటి స్థలాలపై కన్వేయెన్స్ డీడ్‌లే ఇవ్వాలని సర్కారు నిర్ణయించింది. ఈ మేరకు రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి వి.ఉషారాణి మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పేదలకు ఇచ్చే ఇంటిస్థలాలకు కన్వేయెన్స్ డీడ్‌ల రూపంలో పట్టాలు ఇవ్వాలని, వీటిని మండల తహసీల్దార్లు సబ్ రిజిస్ట్రార్ హోదాలో రిజిస్ట్రేషన్ చేయాలంటూ ఫిబ్రవరి 12న జీవో 44 జారీచేసిన సంగతి తెలిసిందే. ఏపీ అసైన్‌మెంట్ చట్టం-1977 (పీఓటీ యాక్ట్) ప్రకారం ప్రజలకు డీ-ఫారం పట్టాలు ఇవ్వాలని, కన్వేయెన్స్ డీడ్‌ల రూపంలో ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయడం, ఐదేళ్ల తర్వాత వాటిని అమ్ముకునేలా వీలు కల్పించడం చట్ట విరుద్ధమంటూ హైకోర్టులో పిల్ దాఖలైంది. ఈ కేసును విచారించిన హైకోర్టు జీవో 44లో అనేక వైరుధ్యాలు, లోపాలున్నాయంటూ దాన్ని సస్పెండ్ చేసింది. కన్వేయెన్స్ డీడ్‌ల స్థానంలో డి-ఫారం పట్టాలు ఇస్తారని, దీనికి అనుగుణంగా మార్గదర్శకాలు ఇవ్వొచ్చని భావించారు. అయితే, సర్కారు అందుకు భిన్నంగా కన్వేయెన్స్ డీడ్‌లుగానే పట్టాలు ఇవ్వాలంటూ ఉత్తర్వులు ఇచ్చింది. జీవో 44ను హైకోర్టు సస్పెండ్ చేసిన విషయాన్ని నేరుగా ప్రస్తావించకుండా, ఆ ఉత్తర్వులో హైకోర్టు లేవనెత్తిన అంశాలపై సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్(ఎస్ఎల్‌పీ) దాఖలు చేయాలని నిర్ణయించినట్లుగా ఈ జీవోలో పేర్కొన్నారు. సుప్రీంకోర్టు జీవో 44పై ఏదో ఒక ఆదేశం ఇచ్చేదాకా ఆ ఉత్తర్వు సస్పెన్షన్‌లో ఉన్నట్లే. అంటే, కన్వేయెన్స్ డీడ్‌లు అన్నమాటకు అవకాశమే ఉండదు. కానీ, ప్రభుత్వం తాజాగా ఇచ్చిన జీవో 99లో అదే అంశాన్ని ప్రస్తావించింది. పట్టాలను కన్వేయెన్స్ డీడ్‌ల రూపంలోనే ఇస్తామని పేర్కొంది. అంతేకాదు, జీవో 367, 488ల్లో మార్పులు చేస్తూ, లబ్ధిదారుల ఎంపిక, ఐదేళ్ల తర్వాత అమ్మకంపై కొన్ని నిబంధనలు జోడించి కొత్తగా మార్గదర్శకాలు ఇచ్చింది.

కొత్త మార్గదర్శకాలు ఇవీ..

లబ్ధిదారు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దారిద్ర్యరేఖకు దిగువన ఉండటంతోపాటు తెల్లరేషన్‌కార్డు కలిగి ఉండాలి. గతంలో ఇచ్చిన మార్గదర్శకాలతో ఇప్పటికే లబ్ధిదారుల ఎంపిక పూర్తయింది. మరోసారి తాజా మార్గదర్శకాలతో లబ్ధిదారుల ఎంపికను జిల్లా కలెక్టర్లు పరిశీలించాలి. అనంతరం ఆ జాబితాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించాలి. జీవో 367 కింద తొలుత ఇచ్చిన మార్గదర్శకాల్లో లబ్ధిదారులకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 2.5 ఎకరాల మాగాణి, ఐదు కరాల కంటే ఎక్కువ మెట్టభూమి ఉండకూడదని నిబంధన విధించారు. ఆధార్ కార్డు కలిగి ఉండాలని పేర్కొన్నారు. తాజాగా ఇచ్చిన జీవో 99లో ఈ రెండు అంశాలను ప్రస్తావించలేదు. ప్రభుత్వం ఇచ్చే స్థలాల్లో పేదలు ఇళ్లే నిర్మించుకోవాలని, ఇతర అవసరాలకు వాడుకోవద్దని స్పష్టం చేశారు.

కొత్త నిబంధనతో బదలాయింపు..

లబ్ధిదారులు రుణ సమయంలో ఆర్థిక సంస్థలు విధించే నియమనిబంధనలకు లోబడి ఐదేళ్ల తర్వాత బదలాయింపు చేసుకోవచ్చనే కొత్త నిబంధన చేర్చారు. ఐదేళ్ల గడువు తీరాక ఎన్ఓసీ అవసరం లేకుండానే ఇంటిస్థలాన్ని అమ్ముకోవచ్చని పట్టామీదే ముద్రించాలని ఆదేశాలు ఇచ్చారు. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ నిబంధనను మార్చినట్లుగా కనిపిస్తోంది.

భూముల చదును కోసం లీజుకిచ్చారు

నడింపల్లిలో ఐదారు సర్వే నంబర్లలో తవ్వకాలకు డి.ఫారం రైతుల నుంచి దరఖాస్తు వచ్చింది. ఇచ్చిన భూములు వ్యవసాయానికి అనువుగా లేవని, చదును చేయడానికి ఇతరులకు లీజుకు ఇవ్వడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. దానిని పరిశీలించి ఆమోదించాం. భూములు చదునుచేసిన తరువాత సదరు భూములను రైతులకు అందజేయాల్సి ఉంటుంది.

- టి.నారాయణరావు, తహశీల్దారు, అచ్యుతాపురం

నునపర్తి పంచాయతీ పరిధిలోని నడింపల్లి గ్రామానికి ఆనుకుని ఉన్న కొండ

అధికార పార్టీలో అన'కొండ'లు!

- విశాఖ జిల్లాలో గ్రావెల్ దందా
- యలమంచిలి నియోజకవర్గంలో కొండలే ఫలహారం
- భూముల చదునుకు డి.పట్టాదారుల చేతే దరఖాస్తు
- ఆనక మరో సంస్థ ద్వారా తవ్వకాలు
- రోజుకు 350 లారీల గ్రావెల్ తరలింపు
- ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి
- జీడి తోటల మధ్య భారీ రహదారి
- పంట దెబ్బతింటున్నా నోరుమెదపని రైతులు
- పట్టించుకోని గనుల శాఖ అధికారులు

(ఆంధ్రజ్యోతి-విశాఖపట్నం)

విశాఖపట్నం జిల్లా యలమంచిలి నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు కొండలనే కొల్లగొట్టేస్తున్నారు. బినామీల పేరుతో లీజులు తీసుకుని లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వుకుంటూ రెండు చేతులా సంపాదిస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో భారీ నిర్మాణాలు చేపడుతున్న బార్క్, అచ్యుతాపురం సెజ్ అవసరాలకు భారీగా గ్రావెల్ అవసరం కావడం వీరికి కలిసొచ్చింది. క్వారీ నుంచి బార్క్‌కు జీడితోటల మధ్య పొడవైన మట్టి రహదారిని సైతం నిర్మించుకున్నారు. తెరవెనుక అధికార పార్టీ నేతలు ఉండడంతో రైతులు నోరెత్తలేకున్నారు. అధికారులు కూడా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు.

లోతట్టు ప్రాంతాల్లో డంపింగ్...

అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్), సెజ్ ఏరియాల్లో లోతట్టు ప్రాంతాలను కప్పడానికి పెద్దఎత్తున గ్రావెల్ అవసరం పడింది. ఈ నేపథ్యంలో అచ్యుతాపురం మండలం నునపర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని నడింపల్లికి ఆనుకుని ఉన్న కొండ ప్రాంతంపై అధికార పార్టీ నేతలు కన్నేశారు. ఆ ప్రాంతంలో చాలాకాలం క్రితం పేదలకు పట్టాలు ఇచ్చారు. వారంతా జీడితోటలు సాగు చేసుకుంటున్నారు. అక్కడ మేలురకం గ్రావెల్ ఉందని గుర్తించిన వైసీపీ నేతలు.. వారిపై ఒత్తిడి తెచ్చారు. దొప్పెర్ల మాజీ ప్రజా ప్రతినిధి, దోసూరు పంచాయతీ రావిపాలేనికి చెందిన మరో వ్యక్తి మధ్యవర్తులుగా వ్యవహరించి జీడితోటల రైతులతో ఒప్పందం చేసుకున్నారు. కొండవాలులో సుమారు 30 ఎకరాలు వ్యవసాయానికి అనువుగా లేదని, ఎత్తుపల్లాలుగా ఉన్న ఆ ప్రాంతాన్ని చదును చేయడానికి విశాఖ నగరానికి చెందిన పీజేఆర్ అనే సంస్థకు లీజుకు ఇచ్చుకుంటామని రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేయుంచారు. దీని వెనుక ఉన్నది అధికార పార్టీ నేతలు కావడంతో రెవెన్యూ, గనుల శాఖ అధికారులు నడింపల్లిలో సర్వే నంబర్ 89/1,2లో 1.315 హెక్టార్లు, సర్వే నంబరు 86, 88లలో 2.352 హెక్టార్లు, సర్వే నంబరు 90లో 1.35 హెక్టార్లు, సర్వే నంబరు 87లో 1.21 హెక్టార్లలో గ్రావెల్ తవ్వకాలకు అనుమతి ఇచ్చేశారు. ఒక్కొక్క సర్వే నంబర్‌లో 50 నుంచి 60 వేల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తరలించేందుకు ఈ ఏడాది ఫిబ్రవరిలో మూడు నెలల పాటు తాత్కాలిక పర్మిట్ లభించింది. కేవలం రెండు నెలల కాలంలోనే కొండవాలులో లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తరలించేశారు. గ్రావెల్ తరలించడానికి సుమారు 60 టిప్పర్లు వినియోగించారు. ఒక్కో టిప్పర్ 30 టన్నుల చొప్పున రోజుకు ఐదు ట్రిప్పులు వేసింది. అయితే కాంట్రాక్టర్ ఇచ్చిన లెక్కల మేరకు మాత్రమే సీనరేజీ వసూలుచేశారు. దీనివల్ల ఖజానాకు తీవ్ర నష్టం వాటిల్లింది. వెంకటాపురం నుంచి ధారబోగాపురం వరకు కొండవాలు ప్రాంతంలో క్వారీల నుంచి కూడా గ్రావెల్ తవ్వి భారీగా తరలిస్తున్నారు. మరో విశేషం ఏమిటంటే.. ఈ కొండను ఆనుకుని కొందరు రెండు లే అవుట్లువేశారు. పనిలో పనిగా కొండను కొంతమేర ఆక్రమించుకున్నారు. కొండను తొలిచి చదును చేసి లేఅవుట్ వేసినా ఎవరూ పల్లెత్తు మాటనడం లేదు. నడింపల్లి, ధారబోగాపురం, వెంకటాపురం కొండల నుంచి గ్రావెల్‌ను సెజ్ పునరావాస కాలనీ మీదుగా రేయింబవళ్లు సుమారు 300 నుంచి 350 లారీలతో తీసుకుపోతున్నారు. దీంతో సెజ్ పునరావాస కాలనీలో రోడ్లన్నీ పూర్తిగా పాడైపోయాయి. ప్రస్తుతం లాక్‌డౌన్ నేపథ్యంలో గ్రావెల్ తవ్వకాలు ఆగాయి.

గ్రావెల్ తరలింపునకు అనుమతి

తవ్వకాల కోసం పీజేఆర్ కంపెనీకి ఫిబ్రవరి నుంచి మూడు నెలలు అంటే ఏప్రిల్ నెలాఖరు వరకు గడువుంది. ఆ తర్వాత పర్మిట్ రద్దవుతుంది. తవ్విన గ్రావెల్‌కు కంపెనీ క్యూబిక్ మీటరుకు రూ.60 చెల్లిస్తోంది. అయితే ఇప్పటివరకు ఎంత చెల్లించిందనే వివరాలు కార్యాలయంలో ఉన్నాయి. లాక్‌డౌన్ ప్రభావంతో మేమెవరం కార్యాలయానికి వెళ్లడంలేదు. - వెంకటరావు, ఇన్‌చార్జి ఏడీ, గనుల శాఖ

అప్పుడు వ్యతిరేకం.. ఇప్పుడు అంగీకారం

నడింపల్లిలో గ్రావెల్ తవ్వడానికి మూడేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్ మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎండీసీ) దరఖాస్తు చేసింది. ఆ మేరకు గ్రావెల్ తవ్వకాల కోసం వెళితే గ్రామస్థుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుందని చెప్పి ప్రజాప్రతినిధులు అంగీకరించలేదు. దాంతో సంస్థ వెనక్కి తగ్గింది. ప్రభుత్వం మారడంతో అధికార పార్టీ నేతలు నడింపల్లి కొండపై కన్నేసి, అనుమతులు తెచ్చుకుని యథేచ్ఛగా తవ్వుకుంటున్నారు.

రైతుల నోట్లో మట్టి...

గ్రావెల్‌ను తరలించడానికి మార్గం లేకపోవడంతో నడింపల్లి నుంచి బార్క్ రోడ్డు వరకు మధ్యలో దొప్పెర్ల మీదుగా మూడు కిలోమీటర్ల పొడవున రహదారి నిర్మించారు. గతంలో ఉన్న చిన్నపాటి రహదారిని లారీలు వెళ్లేలా 40 అడుగుల వెడల్పుతో వేశారు. ఈ రహదారి నిర్మాణం సందర్భంగా జీడితోటలు కొంతవరకు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం గ్రావెల్‌తో రోజూ లారీలు తిరుగుతుండడంతో చెట్లు ఎర్రమట్టితో నిండిపోవడంతో పంటపై ప్రభావం పడింది. పరిహారం కింద కొంత మొత్తం ఇచ్చినా రైతులకు వాటిల్లుతున్న నష్టం ఎంతో ఎక్కువగా ఉంది.

కరోనా కల్లోలం

ఫీజుకు 'కరోనా' కోత

- కొందరికే రీయింబర్స్‌మెంట్ బకాయిలు
- రూ.4వేలకోట్లలో రూ.2వేల కోట్లే విడుదల
- ఉద్యోగుల జీతాలుకోసి ఆ మాత్రం క్లియర్
- ఎంపానెల్‌మెంట్ కాని కాలేజీలకు ఆపివేత
- రీయింబర్స్‌కీ, ఎంపానెల్‌మెంట్‌కీ లింకేల?
- సీఎస్‌కు 89 కాలేజీ మేనేజ్‌మెంట్ల లేఖ

అమరావతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ వ్యాప్తి ప్రభావం రాష్ట్రంలోని విద్యాసంస్థలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులపై పడింది. 2018-19, 2019-20 విద్యా సంవత్సరాలకు ఇంజనీరింగ్‌తో పాటు ఇతర ప్రొఫెషనల్ కాలేజీలు, డిగ్రీ, జూనియర్ కాలేజీలు, ఐటీఐ, పాలిటెక్నిక్స్‌కు దాదాపు రూ.4 వేల కోట్ల వరకు బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉండగా, ఇందులో భారీగా కోత పెట్టేందుకు సిద్ధమవుతోంది. ఈ ఏడాది మార్చి 30 నాటి కల్లా రీయింబర్స్‌మెంట్ బకాయి లన్నింటినీ విడుదల చేస్తామని స్వయంగా సీఎం జగన్ ప్రకటించినా.. ఆచరణలో మాత్రం ఈ ఫీజుకు కరోనా కాటు తగిలినట్లు స్పష్టమవుతోంది. ప్రజాప్రతినిధుల, ఉద్యోగుల మార్చి నెల జీతాలను రెండు విడతలుగా చెల్లించాలని నిర్ణయించిన ప్రభుత్వం.. తద్వారా ఆదా అయిన సుమారు రూ.2 వేల కోట్లను కాలేజీలకు బకాయి పడిన రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేసే ప్రక్రియ ప్రారంభించింది. మిగిలిన రూ.2 వేల కోట్లను సమకూర్చుకునే అవకాశం ప్రస్తుతానికి లేకపోవడంతో రకరకాల కారణాలతో కొన్ని కాలేజీలకు బకాయిల చెల్లింపులను వాయిదా వేయాలని భావిస్తున్నట్టు సమాచారం. ఇందులో భాగంగానే ఇంజనీరింగ్ కాలేజీలను రెండు వర్గాలుగా విభజించి మరీ కార్యాచరణకు పూనుకుంది. ఇటీవల ఖరారు చేసిన ట్యూషన్ ఫీజును అంగీకరిస్తూ ఎంపానెల్‌మెంట్ అయిన కాలేజీలకు మాత్రమే ఫీజు రీయింబర్స్ చేస్తోంది. అలా చేయని కాలేజీలకు బకాయిలను విడుదల చేయరాదని నిర్ణయించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో 287 ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలు ఉండగా.. వాటిలో 281 కాలేజీలకు 2019-20 విద్యా సంవత్సరానికి ఫీజును ప్రభుత్వం ఖరారు చేసింది. విద్యా సంవత్సరం ఆరంభంలో అడ్మిషన్ల సమయంలో ఎంపానెల్‌మెంట్ విషయం చెప్పకుండా అందరికీ పూర్తి ఫీజు రీయింబర్స్ చేస్తామని చెప్పిన ప్రభుత్వం తీరా ఇప్పుడు కొత్తగా మెలిక పెట్టింది. గతంలో కంటే భారీగా ఫీజులు తగ్గిపోవడంతో 89 కాలేజీలు ఎంపానెల్‌మెంట్ ఇవ్వలేదు. తక్కువ ఫీజులు ఉన్న 192 కాలేజీలు మాత్రం ఎంపానెల్‌మెంట్ ఇచ్చాయి. దీంతో ఆయా కాలేజీలకు మాత్రమే బకాయిల విడుదలకు మంగళవారం సర్కారు చర్యలు ప్రారంభించింది. ఎంపానెల్‌మెంట్ ఇవ్వని 89 కాలేజీలకు లెటర్లు ఇచ్చేంత వరకు పైసా ఇవ్వరాదని సాంఘిక సంక్షేమశాఖకు మౌఖిక ఆదేశాలు వెళ్లినట్లు తెలుస్తోంది. ఇక ఫీజు ఖరారు కాలేదంటూ బీఎడ్, ఎంబీఏ, ఎంసీఏ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ కాలేజీలకు ప్రస్తుతానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వరాదని నిర్ణయించడం గమనార్హం. ఇకపోతే జూనియర్, డిగ్రీ కాలేజీలు, ఐటీఐ, పాలిటెక్నిక్ కాలేజీలకు 25 నుంచి 50 శాతం వరకు బకాయిలు విడుదల చేయడానికి సర్కారు సన్నద్ధమైంది. ఈ నేపథ్యంలో ఎంపానెల్‌మెంట్ ఇవ్వని 89 ఇంజనీరింగ్ కాలేజీలు బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సహ్నీకి విజ్ఞాపన పత్రం అందజేశాయి. గతంలో ఇచ్చిన జీవోల ప్రకారం.. ఎంపానెల్‌మెంట్‌కు ఫీజులకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొంటూ వారు తమకూ రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరారు.

రాష్ట్ర ప్రజలకు శుభాలు కలగాలి

- గవర్నర్, సీఎం శ్రీరామనవమి శుభాకాంక్షలు

అమరావతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ధర్మం, సత్యం, ప్రేమ, సంతోషాలతో కూడిన జీవన విధానానికి శ్రీరాముడు ఆదర్శమని రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పేర్కొన్నారు. గురువారం శ్రీరామనవమి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సీతారాముల దీవెనలతో రాష్ట్ర ప్రజలకు శుభాలు కలగాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రకటనలో అభిలషించారు. శ్రీరామనవమి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

నవమి వేడుకలు ఇళ్లల్లోనే: చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు మాజీ సీఎం చంద్రబాబు ట్విటర్‌లో శుభాకాంక్షలు తెలిపారు. సీతారాముల కల్యాణాన్ని నిరాడంబరంగా, ఇళ్లలోనే జరుపుకోవాలని సూచించారు.

భక్తులు లేకుండానే భద్రాద్రి సీతారాముల కల్యాణం

భద్రాచలం, ఏప్రిల్ 1: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం భద్రాద్రిలో గురువారం శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారామచంద్రుల వారి కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. కరోనా కలకలం, లాక్‌డౌన్ నేపథ్యంలో ఈసారి రామయ్య కల్యాణాన్ని ఆలయంలోని నిత్య కల్యాణ మండపం వద్ద కేవలం కొద్దిమంది సమక్షంలోనే నిర్వహించనున్నారు. మూడున్నర శతాబ్దాలలో భక్తుల భాగస్వామ్యం లేకుండా ఏనాడు ఈ విధంగా కల్యాణం జరగలేదని ఆధ్యాత్మికవేత్తలు చెబుతున్నారు.

సరకు రవాణాలో తూర్పు కోస్తా రైల్వేకు ప్రథమ స్థానం

విశాఖపట్నం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సరకు రవాణాలో తూర్పు కోస్తా రైల్వే దేశంలోనే మొదటిస్థానంలో నిలిచింది. గతేడాది తూర్పు కోస్తా రైల్వే జోన్ పరిధిలో 19.17 కోట్ల టన్నుల సరకును రవాణా చేయగా, 2019-20 ఆర్థిక సంవత్సరంలో అది 20కోట్ల టన్నులకు చేరిందని విశాఖలోని రైల్వే వర్గాలు బుధవారం తెలిపాయి.

ఏపీ నుంచి 9 శాతం తగ్గిన జీఎస్టీ వసూళ్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గతేడాది మార్చితో పోల్చితే ఈ ఏడాది మార్చి నెలలో ఆంధ్రప్రదేశ్ నుంచి జీఎస్టీ వసూళ్లు 2 శాతం తగ్గినట్టు బుధవారం కేంద్ర ఆర్థిక శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. గతేడాది మార్చి నెలలో రూ. 2589 కోట్లు వసూలు కాగా.. ఈ మార్చిలో రూ. 2548 కోట్లు వసూలయ్యాయి.

పీటీడీ సిబ్బందికి సీసీఎస్ లోన్ రికవరీ లేదు!

అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రజా రవాణా సంస్థ(పీటీడీ) సిబ్బంది జీతాల నుంచి లోన్ రికవరీ ఈ నెలకు ఆపేయాలని క్రెడిట్ కోపరేటివ్ సొసైటీ నిర్ణయం తీసుకుంది. కరోనా ప్రభావంతో లాక్ డౌన్ ప్రకటించిన ప్రభుత్వం ఈ నెల ఉద్యోగుల జీతాలు 50శాతమే ఇచ్చింది. దీనికితోడు సీసీఎస్ లోన్ రికవరీ చేస్తే కనీసం పదిశాతం కూడా జీతం చేతికి అందబోదని ఈయూ నేతలు సీసీఎస్ పాలకమండలి దృష్టికి తీసుకువెళ్లిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

కరోనా వ్యాప్తికి మతం రంగు సరికాదు: సీపీఐ

అమరావతి, న్యూఢిల్లీ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): "దేశంలో కరోనా వైరస్‌కు ఢిల్లీ మర్కజ్ ప్రార్థనలే కారణమని కొందరు ప్రచారం చేయడం మంచిదికాదు. దేశవ్యాప్తంగా విధించిన జనతా కర్ఫ్యూ కన్నా ముందు జరిగిన కార్యక్రమానికి మతపరమైన రంగు పులమకుండా రాజకీయ పార్టీలు విజ్ఞతతో ఆలోచించాలి" అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇదే అంశంపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఢిల్లీలో ఓ వీడియో ప్రకటన చేశారు. "మర్కజ్‌లో పాల్గొన్న వారంతా స్వచ్ఛందంగా కరోనా వైద్య కేంద్రాలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలి. అవసరాన్ని అనుసరించి క్వారంటైన్‌లోకి వెళ్లాలి. ప్రభుత్వమే మిమ్మల్ని గుర్తించాలంటే కష్టం" అని ఆయన విజ్ఞప్తి చేశారు.

అమరావతితోనే మా బతుకులు

- 106వ రోజు రైతులు, మహిళల ఆందోళన
- కరోనాపై 'పీఎం కేర్స్'కు నిధుల సేకరణ

ఏ పండగైనా రాజధాని ప్రకటనతోనే

గుంటూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తమ బతకులు, పిల్లల భవిష్యత్తు అమరావతితోనే అని రాజధాని ప్రాంత రైతులు తేల్చి చెప్పారు. అమరావతినే ఏకైక రాజధానిగా కొనసాగించాలంటూ 106వ రోజు(బుధవారం) నిరసనలు కొనసాగించారు. గ్రామాల్లో మహిళలు వీధుల్లో నిరసనలు తెలిపారు. 'ఏ పండగైనా అమరావతి ప్రకటనతోనే.. రైతుల త్యాగాలు మరవద్దు.. ఐదు కోట్ల ఆంధ్రుల హక్కు అమరావతి' అంటూ నినాదాలు చేశారు. నీరుకొండ గ్రామంలో పల్నాటి వీరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంవత్సరం క్రితం పనుల సందడితో ఓ వెలుగు వెలిగిన అమరావతి ప్రాంతం తిరిగి ఆ స్థాయి వెలుగు సంతరించుకోవాలని కోరుతూ 'అమరాతి వెలుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశాన్ని కరోనా నుంచి కాపాడుకుందామంటూ 'పీఎం కేర్స్ నిధి'కి రైతులు నిధుల సేకరణ మొదలు పెట్టారు. ప్రతి ఇంటి నుంచి కనిష్ఠంగా రూ.121, గరిష్ఠంగా ఎంతైనా అంటూ చందాలు సేకరించారు.

మందడంలో చెట్టుకింద కూర్చొని నిరసన

అసభ్య పోస్టులపై ఫిర్యాదు..

రాజధాని ప్రాంత మహిళలపై అసభ్య పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దిశ స్పెషల్ ఆఫీసర్ దీపికకు తుళ్లూరు రైతు గద్దె తిరుపతిరావు ఫిర్యాదు చేశారు.

కోయకముందే కన్నీరు!

- కరోనాతో చేలోనే మిర్చి పంట
- కోసినా అమ్ముకొనే దారి లేక కోల్డ్ స్టోరేజీలకు తరలింపు
- ఇదే అదునుగా అద్దె మంట
- 40కేజీల బస్తా నిల్వకు 180
- కరోనా తర్వాత 250 వసూల్

కోల్డ్ స్టోరేజ్‌ల ముందు బారులుతీరిన ట్రాక్టర్లు

గుంటూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మిర్చి పంట రైతుల కంట్లో మంట పెడుతోంది. కరోనా కారణంగా కోతలకు కూలీలు దొరక్క.. ఒక వేళ కోసినా, ఈ పరిస్థితి తొలిగేదాకా పదిరోజులు పంటను దాచుకోడానికి కోల్డ్ స్టోరేజీలు వసూలు చేసే అడ్డగోలు అద్దెలు కట్టలేక రైతులు కుమిలిపోతున్నారు. నిజానికి, గతంలో 40 కేజీల బస్తాను కోల్డ్ స్టోరేజీలో నిల్వచేస్తే ఏడాదికి రూ.180 వరకు అద్దె వసూలు చేసేవారు. ఆ మొత్తం కూడా పంట అమ్ముకున్న రోజు తీసుకునేవారు. ఇప్పుడు అలా కాకుండా కొందరు బస్తాకు రూ.250 వసూలు చేస్తున్నారు. ముందస్తుగా అద్దెలు నిలబెట్టి వసూలు చేస్తున్నారు. అయినప్పటికీ గత్యంతరం లేక రైతులు తమ పంటను ట్రాక్టర్లలో తరలించుకొచ్చి కోల్డ్ స్టోరేజ్‌ల ముంగిట బారులు తీరుతున్నారు. గుంటూరు జిల్లాలో 150కి పైగా కోల్డ్ స్టోరేజ్‌లు ఉన్నాయి. జిల్లాలో సుమారు లక్షా 75వేల ఎకరాల్లో మిర్చి సాగు జరిగింది. కరోనా కర్ఫ్యూకు ముందే అంతకు ముందు ఉన్న రేటు కంటే మిర్చి రేటు పడిపోవటంతో రైతులు అమ్ముకునేందుకు అంత సుముఖత చూపలేదు. ఇక కరోనా వ్యాప్తితో అసలు అమ్మాలనుకునే వారు కూడా అమ్ముకోలేని పరిస్థితి! దీంతో కోల్డ్ స్టోరేజ్‌లే రైతులకు దిక్కు అవుతున్నాయి. కొందరు కోల్డ్ స్టోరేజ్ నిర్వాహకులు దోపిడీకి పాల్పడుతున్నారని పలువురు రైతులు వాపోతున్నారు.

పింఛన్ల పంపిణీలో పాలిటిక్స్!

- వలంటీర్‌లను పక్కన పెట్టి..తామే ఇచ్చిన కౌన్సిలర్ అభ్యర్థులు
- స్థానికంలో గెలుపుపై వైసీపీ నేతల వ్యూహం

నిడదవోలు, ఏప్రిల్ 1: స్థానిక ఎన్నికలు వాయిదా పడినప్పటికీ.. ప్రజలను తమ బుట్టలో వేసుకునేందుకు వైసీపీ నేతల వ్యూహాలు మాత్రం కొనసాగుతున్నాయి. బుధవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైన సామాజిక పింఛన్ల పంపిణీని కొన్ని చోట్ల స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తున్న వైసీపీ అభ్యర్థులే లబ్ధిదారులకు నేరుగా అందించారు. నిజానికి పింఛన్ల పంపిణీ బాధ్యతను ప్రభుత్వం వలంటీర్లకు అప్పగించింది. కానీ, పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలు పట్టణంలో మాత్రం వైసీపీ మున్సిపల్ వార్డు కౌన్సిలర్ అభ్యర్థులుగా రంగంలోకి దిగిన వారే నేరుగా పంపిణీ చేయడం వివాదాస్పదమైంది. కరోనా నేపథ్యంలో లాక్‌డౌన్, 144 సెక్షన్ అమలులో ఉండగా.. వీరు కనీస జాగ్రత్తలు కూడా తీసుకోకుండా పంపిణీ చేయడంపై టీడీపీ, జనసేన నాయకులు తీవ్ర అభ్యంతరం తెలిపారు.

చెప్పిన రేటుకు కొనకపోతే చర్యలు!: సీఎం

అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): "కలెక్టర్లందరికీ చెప్తున్నాం. ఇది చాలా ముఖ్యమైన అంశం. రాష్ట్రంలో ఆక్వాకు కనీస గిట్టుబాటు ధర రావాలి. ఎంపెడా ప్రకటించిన ధర రైతుకు దక్కాలి. ఏ రేట్లు చెప్పామో.. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ రేట్లకే ఆక్వా ఉత్పత్తులు అమ్ముడుపోవాలి. చెప్పిన రేట్లకు కొనుగోలుకు ముందుకు రాకపోతే మీ ప్రత్యేక అధికారాలను వాడండి" అని సీఎం జగన్ కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ప్రకాశం, గుంటూరు, కృష్ణా, ఉభయగోదావరి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

53 లక్షల పెన్షన్ల పంపిణీ

అమరావతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం సామాజిక పెన్షన్లను జియోట్యాగింగ్ ఆధారంగా పంపిణీ చేశారు. మధ్యాహ్నానికల్లా సుమారు 53 లక్షల పెన్షన్లను గ్రామ, వార్డు వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. కరోనా వ్యాప్తి ఉధృతమవుతున్న నేపథ్యంలో వలంటీర్లు పెన్షన్ల పంపిణీ కోసం అన్నీ జాగ్రత్తలు తీసుకున్నారు. ఆయా ఇళ్లకు వెళ్లిన వలంటీర్లు లబ్ధిదారుల ఫోటోలు తీసుకుని పెన్షన్ నగదు ఇచ్చారు. బంధువుల ఇళ్లకు, వేరే గ్రామాలకు వెళ్లిన లబ్ధిదారులు కూడా పోర్టబుల్‌ను ఉపయోగించుకుని పెన్షన్ పొందారు. రాష్ట్రంలో సామా

కొత్త భయాలు

అనేక దేశాలతో పోల్చితే కరోనా విషయంలో మన పరిస్థితి కాస్తంత మెరుగ్గా ఉన్నదని ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో మర్కజ్ ఉదంతం మనలను భయోత్పాతంలో ముంచెత్తింది. ఢిల్లీలోని నిజాముద్దీన్ ప్రాంతంలోని మర్కజ్ మసీదులో దేశవిదేశాలకు చెందిన వేలాదిమందితో మార్చిలో జరిగిన జమాత్ సభ ఇప్పుడు కరోనా వ్యాప్తికి మరో కారణమవుతున్నది. అధికారులు, శానిటైజేషన్ సిబ్బంది ముప్పై ఆరు గంటలకు పైగా శ్రమించి మర్కజ్ భవనంలో మిగిలివున్న దాదాపు రెండు న్నరవేల మందిని ఖాళీచేయించి, భవనాన్ని శుద్ధిచేశారు. కరోనా లక్షణాలు న్నట్టుగా అనుమానిస్తున్న ఆరువందలమందిని వివిధ ఆస్పత్రులకు తర లించి, మిగతావారిని క్వారెంటైన్‌లో ఉంచారు. ఈ జమాత్‌లో పాల్గొన్నవా రిని గుర్తించి కరోనా వ్యాప్తిని కట్టడిచేసేందుకు ప్రభుత్వాలు అష్టకష్టాలూ పడుతున్నాయి.

దేశం ప్రమాదం అంచున ఉండగా, తబ్లీగీ జమాత్ నిర్వహణ నిర్వా హకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నది. కరోనా నియంత్రణ దృష్ట్యా ప్రభుత్వం జారీ చేసిన అనేక ఆదేశాలను నిర్వాహకులు పాటించలేదు. యాభైమందికి మించి ఒకచోట గూమిగూడకూడదన్న నియమాన్నీ, భౌతి కదూరాన్ని పాటించాలన్న ఆదేశాన్నీ వారు బేఖాతరు చేశారన్నది ఆరోపణ. సమావేశంలో పాల్గొన్నవారిలో వందలాదిమంది దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలకు తరలిపోయి కరోనా వ్యాప్తికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కార కులవుతున్నారు. దాదాపు 20దేశాలనుంచి ఈ సమావేశంలో పాల్గొనడానికి వచ్చినవారికి, అప్పటికే విదేశాల్లో కరోనా బలంగా ఉన్న నేపథ్యంలో విమా నాశ్రయాల్లో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించకపోవడం పెద్ద తప్పిదం. మర్కజ్ ఓ ప్రబలమైన కొవిడ్ హాట్‌స్పాట్‌గా మారడం వెనుక పూర్తిగా నిర్వాహకులనే తప్పుబట్టి ప్రయోజనం లేదు. ఏడాది పొడవునా ఈ సంస్థ ప్రధాన కార్యాలయం జమాత్ కార్యకర్తల రాకపోకలతో సందడిగా ఉంటుం దన్న విషయాన్ని అటుంచితే, మొన్న జరిగిన సమావేశానికి ఎంతోముందు గానే విదేశీయుల రాకపోకలు నిర్ధారణ కావడం, వారిని దేశంలోకి అనుమ తించడం జరిగిపోయింది. మార్చి 13 వరకూ కూడా కొవిడ్ హెల్త్ ఎమ ర్జెన్సీ కాదని చెబుతూ వచ్చిన భారతదేశం 15 వతేదీన కానీ అన్ని వీసా లను రద్దుచేయలేదు. సామూహిక మత ప్రార్థనలు సహా అన్ని సమావేశా లనూ మార్చి 16న కానీ ఢిల్లీ ప్రభుత్వం రద్దుచేయని విషయాన్ని నిర్వాహ కులు గుర్తుచేస్తున్నారు. కరోనా విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పటికి ఓ సమగ్రమైన వ్యూహం ఏర్పడని మాట వాస్తవం. తమకు ఎటు వంటి స్పష్టమైన ఆదేశాలు రాకపోయినా తమకు తాముగా అతిథుల సంఖ్యను తగ్గించడానికి ప్రయత్నించామని నిర్వాహకుల వాదన. ప్రయాణ సౌకర్యాలు అందుబాటులో ఉన్నంతకాలం పోగలినవారు పోగా, మిగిలిన వారు చిక్కుబడిపోయారని నిర్వాహకులు అంటున్నారు. మర్కజ్‌లో వేల మంది మిగిలే ఉన్నారన్న సమాచారం అందిన వారం తరువాత కూడా అధికారులు రంగంలోకి దిగని విషయమూ తెలుస్తూనే ఉన్నది. నిర్వాహ కుల నిర్లక్ష్యాన్నీ, వారి వాదనల్లోని అసత్యాలను అటుంచితే, ఈ సమావేశం విషయంలో పాలనా పరమైన వైఫల్యం కూడా లేకపోలేదు. మర్కజ్‌లో వేలాదిమంది గుమిగూడిన విషయం పోలీసులకు, నిఘా వర్గాలకు తెలి యదని అనుకోలేం. మార్చి 16 ఆదేశాలు అక్కడ ఉల్లంఘనకు గురవుతు న్నప్పుడు ఢిల్లీ పోలీసులు ఎందుకు ఊరుకున్నారో, మర్కజ్ ఖాళీ చేయా లని చెప్పడానికి ఆ తరువాత ఓ వారం ఎందుకు పట్టిందో తెలియదు.

ఇటీవల పంజాబ్‌కు చెందిన సిక్కుమత బోధకుడు ఒకరు ఇటలీ, జర్మనీ ఇత్యాది దేశాలు పర్యటించి వచ్చి దాదాపు ఇరవై గ్రామాల్లో దాని వ్యాప్తికి, నలభైవేలమంది క్వారంటైన్‌కు కారకుడై తాను మరణించిన విషయం తెలిసిందే. ఇలా ప్రమాదం ఏ రూపంలోనైనా ముంచుకురాచ్చును కనుకనే ముందస్తు వ్యూహాలు ముఖ్యం. మర్కజ్ ఘటనను మొత్తం ముస్లిం సమాజానికి కట్టబెట్టి, వారిపై విషం చిమ్మేందుకు కొందరు ప్రయ త్నిస్తుండటం విషాదం. జరిగినదానికి ఏవో కుట్రలను కట్టబెట్టి సమాజాన్ని చీల్చడం వల్ల దేశానికి మరింత నష్టం వాటిల్లుతుంది. వయో లింగభేదాలు, కులమతాలకు అతీతంగా దేశం యావత్తూ సంఘటితంగా ఒక ఉమ్మడి శత్రువుమీద పోరాడుతున్న తరుణంలో ఈ రకమైన విభజన యత్నాలు ప్రమాదకరం. మనసులకు కాస్తంత సాంత్వననూ, నమ్మకాన్ని అందించే మతం, సంక్షోభ సమయాల్లో సంఘటిత పోరాటశక్తిని సమకూర్చాలే కానీ, విభజనకు ఉపకరించకూడదు. కల్లోల కాలంలోనూ అర్థంలేని కుట్రసిద్ధాం తాలను ముందుకు తెస్తే అగ్నిపరీక్షలను దాటడం అసాధ్యమైపోతుంది.

స్వాప్నికుడు, చరిత్రకారుడు

నివాళి

ప్రముఖ చరిత్రకారుడు అర్జున్ దేవ్ మార్చి 29న న్యూఢిల్లీలో మరణించారు. 1938లో ఇప్పటి పాకిస్థాన్ భూభాగంలో పుట్టిన అర్జున్ దేవ్, దేశ విభ జనానంతరం భారత దేశానికి తల్లిదండ్రులతో తరలి వచ్చి ఢిల్లీలో స్థిరపడ్డారు. ఢిల్లీ లోని కిరోరి మల్ కళా శాలలో ఆయన విద్యాభ్యాసం, ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త కె.యమ్. ఆష్‌రాఫ్ పర్యవేక్షణలో జరిగింది. ఢిల్లీ విశ్వవిద్యాలయం నుండి చరిత్ర విభాగంలో పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీ పూర్తి చేసి, జాతీయ విద్యా పరిశోధన, శిక్షణా మండలిలో (NCERT) సుమారు నాలుగు దశాబ్దాలకు పైగా పని చేసి రిటైరయ్యారు.


అర్జున్ దేవ్
(1938–2020)

అర్జున్ దేవ్ స్వయంగా భారత దేశ చరిత్ర, దేశ సాంస్కృతిక చరిత్ర, సమకాలీన చరిత్ర, ప్రపంచ చరి త్రపై పలు ప్రామాణిక గ్రంథాలు రాశాడు. 'The Story of Civilization' అనే గ్రంథం జపనీస్ భాష లోకి అనువదించబడి, జపాన్ ప్రభుత్వ అవార్డు పొందింది. జాతీయ పరిశోధనా మండలి తరపున ప్రముఖ చరిత్రకారులు రొమిలా థాపర్, ఆర్.యస్. శర్మ, బిపిన్ చంద్ర తదితరులు రాసిన పాఠ్యగ్రంథాల ప్రచురణ, పునఃపరిశీలన అనంతరం వాటి పునర్ముద్రణ, చరిత్ర పాఠ్యాంశాలపై రాష్ట్రాల సహకారంతో వర్క్‌షాపులు నిర్వహణ; ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన పాఠ్య గ్రంథాల పరిశీలనకు వర్క్‌షాపుల నిర్వహించి, తగు మార్పులు సూచించడంలో ఎన్ సి ఇఆర్ టిలోని తన సహచరులతో కలిసి ఆయన ప్రముఖ పాత్ర వహించారు. భారత దేశ స్వాతంత్ర్య సమరాన్ని, బొమ్మలతో, ఫొటో లతో పాటు ప్రతి ముఖ్య ఘట్టంపై వివర ణాత్మక రచనలతో, పెద్ద సైజులో జాతీయ పరిశోధనా మండలి ముద్రించింది. ఇది అత్యంత ప్రతి ష్టాత్మకంగా రూపు దిద్దుకొని, అప్పటి ప్రధాన మంత్రి కీ.శే. పి.వి.నరసింహారావు గారిచే ఆవిష్కరింపబడి పలువురి ప్రశంసలు పొం దింది. ఇందులో భాగంగా అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్ రాష్ట్రాల్లో జరిగిన బ్రిటీష్ వ్యతిరేక పోరాటాలను సవివ రంగా పొందుపరిచింది. తెలం గాణ రైతాంగ పోరాటం, అల్లూరి సీతారామరాజు రంప 'పితూరి', చీరాల పేరాల ఉద్యమాలతో పాటు, గరిమెళ్లవారి గేయం 'మాకొద్దీ తెల్లదొరతనము' పాటను ఆంగ్లీకరించి ప్రచురించింది. ఈ ఆల్బమ్, 'నభూతో న భవిష్యతి'గా పేరుగాంచింది.

> ఆదర్శవంతమైన ఉజ్వల భవిష్యత్తును, మత కుల రహిత సమాజాన్ని అర్జున్ దేవ్ ఆశించాడు. వాస్తవంలోనే వుంటూ, వాస్తవానికి దూరంగా, మరేదో ఉజ్వల భవిష్యత్తును ఆశించిన అర్జున్ దేవ్ చారిత్రక సంపద, వారసత్వాలను, భవిష్యత్ కలలను మిగిల్చిపోయాడు.

అర్జున్ దేవ్ రిటైరయ్యాక, ఐ.సి.హెచ్.ఆర్ (ICHR) చేపట్టిన 'Towards Freedom' ప్రాజెక్టుకు కోఆర్డినేటర్ ఎడిటర్‌గా అత్యంత ప్రామాణిక సంపుటాలకు, అపురూపమైన డాక్యు మెంట్లతో, సంపుటి సంపాదకులతో కృషి చేసి ముద్రింప చేశారు. ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ వార్షిక సభల్లోచురుగ్గా పాల్గొని పరిశోధనా పత్రాలు సమర్పించడం, విదేశీ వ్యవహారాలపై అధ్యక్షోపన్యాసం చేశాడు (అమృతసర్ వార్షిక మహాసభలు). ఆంధ్ర ప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ వార్షిక సభలో, 'పరిశోధనా పద్ధతులు' విభాగానికి అధ్యక్షత వహించారు. అర్జున్ దేవ్ జీవి తాన్ని ప్రేమించాడు. ఆదర్శవంతమైన ఉజ్వల భవిష్యత్తును, మత కుల రహిత సమాజాన్ని ఆశించాడు. అర్ధ శతాబ్దంపాటు పెంపొందుతూవచ్చిన మా స్నేహమాధుర్యంలో ఎన్నో జ్ఞాప కాలు. సంభాషణల్లో ఉర్దూ, సూఫీ కవుల పద పంక్తుల్ని అలవోకగా ఆలపించేవాడు. ఇటీవల కొంతకాలంగా తాను చూసి అనుభవించిన సమాజం, యింకా అంతకంటె తానాశిస్తున్న భవి ష్యత్తు క్రమేపీ దూరం కావడం గమనించి నిరాశ చెందుతూవచ్చాడు. వాస్తవంలోనే వుంటూ, వాస్తవానికి దూరంగా, మరేదో ఉజ్వల భవిష్యత్తును ఆశించిన అర్జున్ దేవ్ యివ్వాళ లేడు. చారిత్రక సంపద, వారసత్వాలను, భవిష్యత్ కలలను మిగిల్చిపోయాడు.

● వకుళాభరణం రామకృష్ణ

కరోనాకు ధన్వంతరి ఎవరు?

కరోనా బాధితులు చూస్తుండగానే లక్షల సంఖ్యకు చేరిపోయారు... మృతుల సంఖ్య వేలల్లో ఉంది. ఈ కరోనా వైరస్‌కు విరుగుడు కనుగొనేది ఎప్పుడు అనేదే ఇప్పుడు అందరినీ కలచివేస్తున్న ప్రశ్న. ఇదిగో వచ్చేస్తోంది, అదిగో తయారవుతోంది అని నిరర్థక కబుర్లు వినవ స్తున్న సమయంలోనే చావుకబుర్లు మరింతగా పెరిగిపోతున్నాయి. కరోనా విరుగుడు గురించి అరచేతిలో వైకుంఠం చూపుతున్నవారు అయితే రాజ కీయ నాయకులు, లేదంటే ఆ విరుగుడును కనుక్కున్న మరుక్షణం మార్కె టింగ్ మీద పడడానికి సిద్ధంగా ఉన్న కార్పొరేట్ సంస్థలు! ఇంతకీ వైద్య శాస్త్ర సంబంధమైన అనుభవజ్ఞులు, పరిశోధకులు ఏమంటున్నారు?

వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం మనుషులకు ఉపయోగపడే ఒక వ్యాక్సిన్ తయారు కావాలంటే, అది అన్ని పరీక్షలకు నిలబడి, ప్రయోగ స్థాయి నుంచి మనుషుల వినియోగార్థం ఉత్పత్తి స్థాయికి చేరాలంటే మామూలుగా అయితే కనీసం ఓ పది సంవత్సరాలైనా పడుతుంది. ప్రస్తుతం ప్రపంచం నలుమూలలా నెలకొన్న అత్యంత తీవ్రమైన పరిస్థితులలో సర్వత్రా ఉపయోగపడే దిశగా అటువంటి ప్రయోగం జరగాలంటే, దాని ఫలితం కనిపించాలంటే కొన్ని కొన్ని వైద్య సంబంధమైన పరిమితులను, సహజమైన ఆంక్షలను, నైతిక పరమైన అంశాలనూ కాస్త పక్కన పెట్టినా కనీసం 18 నెలల విలువైన పరిశోధనా సమయం పడుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతం కనీసం ఓ 50 వరకూ పరిశోధనా సంస్థలు కరోనా వైరస్ విరుగుడుకు వ్యాక్సిన్ కనిపెట్టే పనిలో ఉన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు.హెచ్.ఓ.) అంచనా. ఇంత పెద్ద ఎత్తున క్షణాలలో ఇన్ని కంపె నీలు ఒకే అంశంపై దృష్టి పెట్టడానికి నడుంబిగించడం చరిత్రలో ఇదే మొద టిసారి. గతంలో కొన్ని వైరస్‌లు ఉన్నట్టుండి మానవాళిపై విరుచుకుపడిన సందర్భంలో వెంటనే రంగంలోకి దిగి పరిశోధకులకు ఊతమిచ్చిన 'సెపి' (కొయలిషన్ ఫర్ ఎపిడెమిక్ ప్రెపేర్డ్‌నెస్ ఇనొవేషన్స్) అనే, నార్వే రాజధాని ఆస్లో కేంద్రంగా పనిచేసే, స్వచ్ఛంద సంస్థ ఇప్పుడు కూడా కొన్ని పరిశోధనా సంస్థలకు అండగా నిలిచి కరొనావైరస్ విరుగుడుకు ఆర్థికంగా సహకారం అందిస్తోంది. సెపి అందించిన నిధులతో మోడర్నా అనే అమెరికా సంస్థ కరోనా విరుగుడు పరిశోధనల్లో చాలా ముందున్నట్టు తాజా సమాచారం ప్రకారం తెలుస్తోంది. ఈ సంస్థ కేవలం 63 రోజులలో తయారు చేసిన వ్యాక్సిన్‌ను సియాటిల్‌లోని కైజర్ పర్మనెంట్ వాషింగ్టన్ హెల్త్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ మనుషులపై ప్రయోగించడానికి రంగం సిద్ధమైంది. ఇవి గాక ఇంకా ఫైజర్, జాన్సన్ అండ్ జాన్సన్, గ్లాక్సో స్మిత్ క్లైన్, జీ లీడ్ ఇన్క్ వంటి అంతర్జాతీయ సంస్థలు; అలాగే అహ్మదాబాద్‌కు చెందిన జైడస్ కాడిలా, సెరమ్ ఇన్ స్టిట్యూట్ కూడా ఇదే పనిలో నిమగ్నమైవున్నట్టు సమాచారం.

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈమధ్యే ఫార్మాస్యూటికల్ కంపె నీల ప్రతినిధులతో సమావేశమై మందులు తొందరగా కనిపెట్టండి అని హుకుం జారీచేశారు. ఆ తర్వాత షార్లెలో బహిరంగంగానే రిపబ్లికన్ పార్టీ సభలో మందులు తొందరగానే వచ్చేస్తాయి, అమెరికన్లు భయపడవద్దు అని హామీ ఇచ్చారు. అయితే ఇది నిజంగానే అంత తొందరగా జరిగే పనేనా అన్న అనుమానం అందరికీ ఉంది. ట్రంప్ ఆశ పెట్టినట్టు మరి వైరస్ విరుగుడు మందు త్వరలోనే మన చేతికి అంది వస్తుందా? ఇది ఆచరణ సాధ్యమా లేక ఇందులో అతిశయం ఉందా? ఈ మానవ ప్రపంచానికి ఏ ముప్పు సంభవించినా, ఏ ఉపద్రవం మీద పడినా మేమే రక్షకులం అని నూరి పోసే హాలీవుడ్ సినిమాలలో చూపించినట్టు, ఇది మరో శ్వేత జాత్యహంకార వ్యక్తీకరణ కాదు కదా?! ఈ ప్రశ్నలు ఆశను మట్టుపెట్టేవి కావు, నిరాశను అక్కున చేర్చుకోమనేవి కానేకావు, న్యూనతా భావాన్ని పెంపొందించేవీ కావు... వాస్తవ దృష్టిని మరింత సానబెట్టుకోవడానికి అందరూ వేసుకోవలసిన ప్రశ్నలు.

ప్రపంచమంతా 2019 సంవత్సరం చివరి రోజుకు ఘనంగా వీడ్కోలు చెబుతున్న సమయంలోనే గుర్తు తెలియని వ్యాధి సోకిన డజన్ల కొద్దీ అనా రోగ్య బాధితులకు చికిత్స చేస్తున్నట్టు చైనాలోని వుహాన్ స్థానిక ప్రభుత్వం ప్రకటించింది. ఆకస్మికంగా పెచ్చరిల్లిన ఈ అనారోగ్యానికి కారణం ఒక రక మైన వైరస్ అని చైనా పరిశోధకులు ఆ తర్వాత కొద్ది రోజులకు తేల్చారు. దీని బారిన పడ్డ 61 ఏళ్ల వ్యక్తి మరణించాడని, చైనాలో ఇదే తొలి మరణం అనీ జనవరి 11వ తేదీన చైనా మీడియా ప్రకటించింది. ప్రపంచానికి అదే తొలి మృత్యు ఘంటిక. వ్యాధి లక్షణాలను కూడా అప్పుడే చైనా మీడియా సవివరంగా వెల్లడించింది. ఆ వ్యాధికి మూలకారణం కరోనా వైరస్ అన్నారు. అతి తక్కువ సమయంలో, ఒక మనిషి నుంచి మరో మనిషికి ఈ వ్యాధి ఒక గొలుసుకట్టులాగా వ్యాప్తి చెందడానికి ప్రధాన కారణం చైనీ యుల కొత్త సంవత్సరం సెలవులు అప్పుడే ప్రారంభం కావడం, ఆ సమ యంలో చైనీయులు వేల సంఖ్యలో పని చేస్తున్న ఊళ్ల నుంచి సొంత ఊళ్లకు ప్రయాణిస్తారు – మన సంక్రాంతి లాగా! అప్పుడే వుహాన్ నుంచి కరోనా వైరస్ ప్రపంచ ప్రయాణం ప్రారంభమైంది. అప్పటికి ఈ వ్యాధికి ఇంకా ఓ ఊరూ పేరూ లేదు! దీనికి కరోనావైరస్ డిసీజ్–2019 (కోవిడ్19) అని నామకరణం చేస్తూ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) ఫిబ్రవరి 11వ తేదీన ఒక ప్రతిపాదన చేసింది. ఇదేదో ఒక ప్రాంతానికో, ఒక జాతికో పరిమితం కాదు కాబట్టి వ్యాధిని వ్యాధి లక్షణాలతోనే గుర్తించే ప్రయత్నం అది. గట్టిగా చెప్పాలంటే కరోనా వైరస్ మానవాళి ఎరుకలోకి వచ్చి, మానవాళి మనుగడనే ప్రశ్నార్థకంచేసే స్థాయికి ప్రబలిపోవడం మొదలై ఇంకా మూడు నెలలు నిండలేదు.

> అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆశ పెట్టినట్టు కరోనా వైరస్ విరుగుడు మందు త్వరలోనే మన చేతికి అందివస్తుందా? ఇది ఆచరణ సాధ్యమా లేక ఇందులో అతిశయం ఉందా? ఈ మానవ ప్రపంచానికి ఏ ముప్పు సంభవించినా, ఏ ఉపద్రవం మీద పడినా మేమే రక్షకులం అని నూరిపోసే హాలీవుడ్ సినిమాలలో చూపించినట్టు, ఇది మరో శ్వేత జాత్యహంకార వ్యక్తీకరణ కాదు కదా?! ఈ ప్రశ్నలు ఆశను మట్టుపెట్టేవి కావు, నిరాశను అక్కున చేర్చుకోమనేవి కానేకావు, న్యూనతా భావాన్ని పెంపొందించేవీ కావు... వాస్తవ దృష్టిని మరింత సానబెట్టుకోవడానికి అందరూ వేసుకోవలసిన ప్రశ్నలు.

మనుగడలోకి వచ్చి పట్టుమని నూరు రోజులైనా పూర్తి కాని ఒక ప్రాణాంతక వైరస్ నుంచి వచ్చే వ్యాధి నివారణకు వ్యాక్సినేషన్ కనిపెట్టడం ఇంత త్వరగా సాధ్యమవుతుందా? ఒక వేళ సాధ్యమైనా, దాని ప్రభావాన్ని అంచనా వేయడానికి మనుషులు లభిస్తారా? మనుషులపై ప్రయోగించిన తర్వాతే కదా ఇది మనుషులకు పనికి వస్తుందని తేల్చేది! వ్యాధి లక్షణం బయటపడడానికే రెండు వారాలు పడుతుంటే... మరి వ్యాధి నివారణకు ఉద్దేశించిన వ్యాక్సిన్ సక్రమంగా పనిచేస్తున్నదీ, లేనిదీ, ఏయే వయస్సుల వారికి ఏయే మోతాదులో మందు వినియోగించాలో నిర్ణయించడానికి, ఈ కొత్త మందు వాడడంవల్ల ఇతర వ్యాధులేమైనా వచ్చేదీ, లేనిదీ, అప్పటికే ఫలానా ఫలానా వ్యాధి ఉంటే ఇది పని చేయదనో, పని చేస్తుందనో తేలడా నికీ, దీనివల్ల ఏయే సైడ్‌ఎఫెక్ట్స్ వచ్చేదీ నిర్ధారించడానికీ ఇంత స్వల్ప వ్యవధి సరిపోతుందా? సరిపోదు! ఏ క్షణాన ఈ మహమ్మారి ఎవరిని తీసుకుపో తుందో ఊహకు సైతం అందని ఈ విపత్కర పరిస్థితులలో ప్రపంచవ్యా ప్తంగా కరోనా వైరస్ విరుగుడు వ్యాక్సిన్ కోసం పరిశోధనా రంగంలో ప్రస్తుతం భయంకరమైన పోటీ నడుస్తోంది. ఇటు ఇజ్రేల్‌లో, అటు అమెరి కాలో, బ్రిటన్‌లో, ఇంకా న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, జర్మనీలలో వ్యాక్సిన్ కోసం ఆగమేఘాలపై ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. ఇటువంటి పరిస్థితు లలో జర్మనీలోని క్యూర్ వాక్ అనే బయోఫార్మాస్యూటికల్ కంపెనీ త్వరలోనే ఇటువంటి వ్యాక్సిన్‌ను సిద్ధం చేయబోతున్నట్టు సమాచారం బయటకువ చ్చింది. ఆ కంపెనీకి అమెరికాలోని బోస్టన్‌లో కూడా ఒక బ్రాంచ్ ఉందట. కరోనా వైరస్ బాధితుల సంఖ్య అమెరికాలో కూడా వేలకువేలు పెరిగిపో తుండడంతో వైరస్ వ్యాప్తి నివారణపై ట్రంప్ ఏర్పాటు చేసిన ఒక టాస్క్‌ఫోర్స్ సమావేశానికి ఈ కంపెనీ సిఇఓను ఆహ్వానించిన ట్రంప్ మొత్తం కంపెనీనే కొనేస్తామని, లేదా ఆ పరిశోధనలేవో బోస్టన్‌లోనే నిర్వహించాలనీ ప్రోద్బలిస్తూ వంద కోట్ల డాలర్లు ఆశ చూపించారట. ఈ రెండింటిలో ఏది జరిగినా, ఫలితంగా తయారయ్యే వ్యాక్సిన్‌కు 'మేడ్ ఇన్ అమెరికా' హోదా రావడం ఒక ప్రయోజనమైతే, ఆ వ్యాక్సిన్‌ను మొదట అమెరికన్ పౌరులను కాపాడడంకోసం వినియోగించడం మరో ప్రయోజనం. ఈ ద్విముఖ వ్యూహాన్ని జర్మనీ చిటికెలో చిత్తు చేసేసింది. అది వేరే కథ! ఎంత ఖర్చయినా సరే, ఈ వ్యాక్సిన్ తయారీకి అయ్యే నిధులు తామే సమకూర్చనున్నట్టు తాజాగా జర్మనీ ప్రభుత్వం ప్రకటించడంతో అమెరికా ఆశలు అడియాసలయ్యాయి. ట్రంప్ నిజంగా ఆ కంపెనీని కొనజూశారో లేదో గాని ప్రయోగాల నిర్వహణకు కావలసిన నిధులకు మాత్రం జర్మనీ ప్రభుత్వ పరంగా ఇక ఢోకా లేదు.

ప్రపంచానికి ఇప్పటికే కొన్ని రకాల వైరస్‌లు, వాటి వల్ల ఎదురయ్యే ముప్పు తెలుసు కాబట్టి కొన్ని రకాల రసాయన మిశ్రమాలతో ఆస్ట్రేలియా, న్యూజిల్యాండ్ తమ ప్రయోగాలు తాము చేస్తున్నట్టు వార్తలు బయటకు వస్తున్నాయి. ముఖ్యంగా హెచ్ఐవి, సార్స్‌లకు వినియోగించే మందుల కాంబినేషన్‌లతో ఈ ప్రయోగాలు నిర్వహిస్తున్నారట. అంటే సూక్ష్మంలో మోక్షం అన్నమాట! వాషింగ్టన్ నుంచి వచ్చిన కరోనా వైరస్ బాధితునిపై ఈ ప్రయోగం నిర్వహించగా అతనికి వ్యాధి లక్షణాలు తగ్గినట్టు వారి ప్రయోగ ఫలితం తేల్చిందట. అయితే ఒక వ్యక్తిపై చేసిన ప్రయోగాన్ని, దాని ఫలితాన్ని సార్వత్రికంగా ఆపాదించి చెప్పలేమని ఆ శాస్త్రవేత్తలు చిత్తశుద్ధితో చెబుతున్నారు.

కంటికి కనిపించని ఒక సూక్ష్మ కణం మానవ నాగరికతను పరిహ సిస్తూ, శాస్త్ర సాంకేతికరంగాలకు సవాలు విసురుతూ ఇన్ని వేలమంది శాస్త్ర వేత్తలకు కంటి మీద కునుకు లేకుండా చేయడం ఈ ఆధునిక చరిత్రలో ఇదే మొదటిసారి. గతంలో ఎబోలా, సార్స్ వంటివి మానవజాతిపై విరుచుకు పడినప్పుడు కూడా మానవ హననం ఇంత తీవ్ర స్థాయిలో, ఇంత వేగంగా జరగలేదు. ఇప్పుడు అలా కాదు. కళ్లు మూసి తెరిచేలోగా మరణాల సంఖ్య అంతకంతకూ పెరిగిపోతోంది. అందుకే మందును తొందరగా తయారు చేయాలన్న తాపత్రయం! ఈ పరిశోధనలలో మునిగి తేలుతున్నవారిలో ఎవరు ముందుగా మందును కనిపెడితే వారే కోట్లకోట్ల కోటీశ్వరులు! కార్పొరేట్ కంపెనీల దృష్టి నుంచి చూసినప్పుడు సామాజిక బాధ్యత కంటె కాసుల పంటకే ఎక్కువ ప్రాసంగికత ఉందంటే అతిశయోక్తి కాదు. ఈ రోజున కరోనా వైరస్‌కు విరుగుడు టీకా బయటకువచ్చిందంటే ఒక్కొక్క ఇంజక్షన్ వెయ్యి డాలర్లకు అమ్ముడుపోయినా ఆశ్చర్యం లేదని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. అదే నిజమైతే ఇది కేవలం బిలియనీర్ల జబ్బుగా మిగిలిపోయే ప్రమాదం ఉంది గనక ప్రభుత్వాలు దీని ధరను తొలి దశలోనే కొంత నియంత్రించే అవకాశం ఉంది. లేకపోతే మందు తయారైన తర్వాత కూడా కరోనా పీడితులు లక్షల్లో మరణించవచ్చు!

ఈ సమయంలోనే ఓ మంచి వార్త వెలువడింది. కరోనా విరుగుడుకు సంబంధించిన వ్యాక్సిన్‌ను ప్రయోగాత్మకంగా పరీక్షించడానికి ఇంగ్లండ్ లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు సుమారు 500 మంది వాలంటీర్ల ఎంపిక ప్రక్రియ ప్రారంభించారు. రకరకాల వయస్సుల వారిని ముందుగా ఎంపిక చేసి వారి ఆరోగ్యంపై సమగ్రమైన విశ్లేషణ చేసి ఆ తర్వాత వ్యాక్సిన్‌ను వారిపై ప్రయోగిస్తారు. ఈ శాస్త్రవేత్తల బృందం గతంలో 2014లో ఎబోలా వైరస్ వ్యాపించినప్పుడు కూడా గణనీయమైన కృషి చేసింది. ఆ అనుభవంతో ఇప్పుడు ఈ కొత్త వ్యాక్సిన్‌పై పనిచేస్తోంది. ఈ ప్రయోగాల ఫలితాలు వెలువడి, మనుషులకు ఉపయోగపడే టీకా తయారు కావడానికి కనీసం ఒక సంవత్సర కాలమైనా పడుతుందని నిపుణులు చెబుతున్నారు.

ఇదంతా ఇలా ఉంటే కరోనా ప్రాణాంతక మహమ్మారి ఇంత పెద్ద ఎత్తున మానవాళిపై విరుచుకుపడిన ఈ సందర్భంలో భూగోళంపై దృశ్యం ఎలా ఉందంటే శబ్దాల రణగొణ ధ్వనుల నుంచి తాత్కాలికంగా విముక్తి చెందినట్టు... పక్షుల కిలకిలారావాలు తప్ప మరే శబ్దమూ వినపించనట్టు... ఫ్యాక్టరీలలోనుంచి విషవాయువులు ఆగిపోయినట్టు... పుడమి తల్లి కాస్త ఊపిరి పీల్చుకుంటున్నట్టు... పర్యావరణం నిర్మలంగా ఉన్నట్టు... వినూత్నంగా ధవళ వస్త్రం ధరించినట్టు...!!!

■ జగన్

ఇంటింటి సర్వే కాదు, ఇంటింటికీ వైద్యం కావాలి!

కరోనా వైరస్ విపత్తు నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు గ్రామ వలంటీర్ల ద్వారా ఇంటింటికీ తిరిగి ఆరోగ్య వివరాలు సేకరించటం, కరోనా వైరస్‌పై అవగాహన కల్పించటం వంటి చర్యలు చేపడుతున్నాయి. అయితే ఈ చర్యల వల్ల పెద్దగా ఒరిగేదేమీ లేదు. పైగా చాలా ప్రాంతాలలో ఈ వలంటీర్ల వ్యవస్థ సరిగా పనిచేయటం లేదు. దీనికంటే గ్రామా ల్లోనూ, పట్టణాల్లోనూ ఇంటింటికీ సంచార వైద్య బృందాలను పంపి, ప్రజల వైద్య అవసరా లను తీరిస్తే అది ఈ విపత్కాలంలో మరింత ఉపయుక్తంగా ఉంటుంది. పేదలు,వృద్ధులు తక్షణ వైద్యం అందక నానా అగచాట్లు పడుతున్నారు. ఈ సంచార వైద్య బృందాలు అక్కడి కక్కడే తీరే వైద్య అవసరాలేమైనా ఉంటే తీర్చగలవు. ఒకవేళ ఎవరికైనా తక్షణ వైద్య అవసరం ఉంటే వెంటనే జిల్లా ఆసుపత్రులకు కూడా తరలించగలవు. కేవలం సరైన పరీక్షా వ్యవస్థ లేక పోవటం వలన బయటపడని కరోనా కేసులు తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో ఉన్నాయని వాదనలు వస్తున్న నేపథ్యంలో ఈ చర్య ఎంతో ముఖ్యం. ఇది వాస్తవ పరిస్థితిని నిగ్గు తేలుస్తుంది. అంతే కాదు ప్రజల్లో ఆందోళనను కూడా చాలావరకూ తగ్గిస్తుంది. ప్రజలు ఇళ్ళనుంచి బైటకురావా ల్సిన అవసరాన్ని మరికొంత తగ్గిస్తుంది.

– గరిమెళ్ళ రామకృష్ణ, ఏలూరు

మత విద్వేషానికి కరోనా సాకు!

గురజాడ 'మతములన్నియు మాసిపోవును జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును' అన్నాడు, చాలా ఆశావాదంతో. కానీ మత చీకటి మేఘాల ముందు జ్ఞానం ఏపాటి నిలవదని ప్రస్తుత పరిస్థితి చెబుతోంది. కాబట్టి మనుషులందరు సమసిపోయే పరిస్థితిలో కూడా "మతము లన్నియు నిలిచి వెలుగును" అనుకోవాలేమో. 'నిజాముద్దీన్ మర్కజ్‌కు హాజరైన వారిలో కొందరికి కొవిడ్–19 వైరస్ పాజిటివ్ ఉన్నట్టు తేలటంతో కొందరు వివక్షాపూరిత హిందూత్వ వాదు లకు ఒక కొత్త ఆయుధం దొరికినట్టు అయింది. బీజేపీ ఐటి సెల్ అధ్యక్షుడు దీన్ని 'ఇస్లా మిక్ ఇన్‌సరెక్షన్' (తిర

విశేషం

నేడు శ్రీరామ నవమి

జన మనోభిరాముడు!

పాలకులు పదవులతో కాదు, దర్పంతో కాదు, వంశ వారసత్వంతో కాదు... అభిమానంతో. ఆత్మీయతతో ముందు మనసులను గెలవాలనీ... ఆ తరువాత మనుషులనూ పాలించాలని శ్రీరామకథ చాటి చెబుతుంది.



శ్రీమద్రామాయణం మహా కావ్యంగా అవతరించిన వేదం. రామచంద్రుడు వేదాలు వెతికే ధర్మ స్వరూపం. రామాయణం మొత్తం అనుబంధాల కథ. తల్లితండ్రులకూ బిడ్డలకూ, అన్నదమ్ములకూ, ఆలుమగలకూ, స్నేహితులకూ మధ్య ఉండే అనుబంధాలలోని తియ్యదనాన్నీ, మమకారాన్నీ యుగయుగాలకు వారసత్వంగా ఇచ్చింది.

సాధారణంగా రాజుకూ, ప్రజలకూ మధ్య ఉండే బంధం ఏమిటనే విషయం గురించి చర్చ జరగదు. రాజుల ఇష్టానిష్టాలను ప్రజలు భరించక తప్పని పరిస్థితి. అలాంటిది ప్రజలే ప్రభువుని ఏరికోరి ఎంచుకొనే మహోజ్వల ఘట్టం అయోధ్య కాండలో తొలి సర్గలో కనిపిస్తుంది.

మీ కోసం కాదు మా కోసం!

దశరథ మహారాజుకు వయోభారం కావడం వల్ల మునుపటి చురుకుదనం లేదు. రామచంద్రుణ్ణి గురించి మంచి మాటలు అడపాదడపా ఆయన చెవిన పడుతున్నాయి. రాముడు లోకాలు ఏలగల వీరుడైనా సౌమ్యంగా, శాంతంగా, గొప్ప నిగ్రహంగా ఉండేవాడు. రాజ్యంలో ఇంతమంది మనస్సుల్లో కొలువైన రాముణ్ణి చూచి దశరథుడు తండ్రిగా గర్వపడేవాడు. ఆనందపడేవాడు. రాజ్యభారం అప్పగించడానికి అదే తరుణమని భావించాడు. ఒక శుభ ముహూర్తంలో సామంతుల్ని, మంత్రుల్ని, అధికారుల్ని పిలిపించాడు. విశేషించి జన సమూహాలకు అత్యంత సన్నిహితంగా ఉండే పల్లెల నుంచి జానపదులను, పట్టణాల నుంచి పౌరులను పిలిపించాడు.

నిండు సభను ఉద్దేశించి దశరథుడు మాట్లాడుతూ "ఇక్ష్వాకు వంశీయులు అందరూ ప్రజల్ని కడుపున పుట్టిన బిడ్డల్లా సాకారు. కాపాడారు. వాళ్ల అడుగుజాడల్లో నేను నడిచి ఇన్నాళ్ళు రాజ్యభారం మోశాను. ఇప్పుడు వార్ధక్య భారం వల్ల కష్టంగా ఉంది. నా రాముడు శౌర్యవంతుడు. ఇంద్రియాలను జయించిన వాడు. మీ అందరి అనుమతితో పాలనా బాధ్యతలను అప్పజెప్పాలని అనుకుంటున్నాను. నా మాటల్లో స్వార్థం ఉండొచ్చు. మీరు స్వతంత్రంగా ఆలోచించండి. మీ నిర్ణయం శిరోధార్యం" అన్నాడు.

సభ మొత్తం హర్షధ్వానాలు మిన్నంటాయి. "మహారాజా! రామచంద్రమూర్తిని పట్టపుటేనుగు మీద శ్వేత ఛత్రం క్రింద ఒక మహారాజులా చూడాలని అనుకుంటున్నాం" అని అన్నారు యావన్మందీ.

"ఇదేమిటి? నాకు ఎదురు చెప్పడం ఇష్టం లేక ఇలా అంటున్నారా? లేదా నా పరిపాలన మీద విసుగు వచ్చిందా? నిస్సంకోచంగా చెప్పండి" అని దశరథుడు అడిగాడు.

"రాముడి సద్గుణాలు తలుచుకుని మేమంతా పొంగి పోతాం. మళ్లీ మళ్లీ తలచుకుని పరవశించిపోతాం. ఆయన ప్రజలకు ఆనందం కలిగించడంలో చంద్రుడు. బుద్ధిలో బృహస్పతి. సత్య పరాక్రముడు. మాన్యులనైనా, సామాన్యులనైనా తానే ముందుగా నవ్వుతూ పలకరిస్తాడు. ఎవరికి దుఃఖం కలిగినా తాను కూడా దుఃఖపడతాడు. ఎవరి ఇంట సంతోషం నిండినా 'కొడుకు పైకి రావడం చూసిన తండ్రిలా' ఆనంద పడిపోతాడు. అందరితో ఆత్మీయంగా ఉంటాడు. వేద వేదాంగాలను క్షుణ్ణంగా చదువుకున్నాడు. గాంధర్వం, శిల్పం లాంటి కళలలో ఆయనకు స్వయంగా అభినివేశం ఉన్నది. మీకు తెలుసో తెలియదో మహారాజా! ఆయన రాజు కావాలని వృద్ధులు, స్త్రీలు... ఒక్కరేమిటి, ఆబాలగోపాలయ దేవతలకు మొక్కుకుంటున్నారు. మీ అభీష్టం కోసం ఆయన్ని రాజును చేస్తానని అంటున్నారు మేము మాత్రం మా అందరి కోసం పట్టాభిషేకం చేయించమంటున్నాం" అన్నారు పౌరులు, జానపదులు.

దశరథుడి కళ్ళు ఆనందంతో నీటి చలమలు అయ్యాయి. ఈ సన్నివేశంలో రాజు కాకముందే ప్రజలతో మమేకమైన రాముడు కనిపిస్తాడు. అధికారం, దర్పం, హోదాలు ప్రదర్శించని నవ్వుతూ మాట్లాడే ఒక మంచి మనిషి కనిపిస్తాడు. ప్రజల యోగ క్షేమాలలోనే రాజు యోగ క్షేమాలు ఉంటాయని గుర్తించిన తాత్త్వికుడు కనబడతాడు.

చెట్లు కదలవు, పక్షులు తినవు!

ఇలాంటి ప్రస్తావన రామచంద్ర మూర్తి అడవికి వెళ్లే సమయంలో మళ్లీ వస్తుంది. రాముడు నగరం వదిలిన మరుక్షణం ద్విజులు అగ్నిహోత్రాలు ఆపేశారు. ప్రజలు పనులు మానేశారు. మావటి వాళ్ళు పెట్టిన ఆహారాన్ని ఏనుగులు కక్కేశాయి. రాముడి రథం వెళ్ళిన వైపు అయోధ్యలో పౌరులంతా బయలుదేరారు.

"మీరందరూ నా మీద ప్రేమాభిమానాలతో వస్తున్నారని తెలుసు. ఆ ప్రేమ భరతుడు మీద చూపండి. భరతుడు జ్ఞాన వృద్ధుడు, చక్కగా పాలించగలడు" అన్నాడు రాముడు.

ఆ మాట విన్న ప్రజానీకం రాముని ధర్మ దీక్షతకు కన్నీరు మున్నీరు అయింది. వేద పండితులు అశ్వాల ముందు నిలిచి, 'మీరు వెనక్కి మళ్ళి, రథాన్ని అయోధ్యకు తీసుకురమ్మ'ని వేడుకున్నారు. "ఈ చెట్లు చూడవయ్యా... ఏడుస్తున్నాయి, నీ వెంబడి వచ్చేద్దామని చూస్తున్నాయి, వాటి వేళ్ళు వాటిని కదలనివ్వడం లేదు. చెట్ల మీద పక్షులు చూడవయ్యా ఆహారం మానేశాయి" అని చెప్పారు. జనం ఎంత నచ్చజెప్పినా రాముడు వినడం లేదు.

సీతా రామక్ష్మణులు తమసా నది తీరానికి చేరుకున్నారు. వారిని. పౌరులు వెంబడిస్తూనే ఉన్నారు. అందరూ చెట్ల కింద రాత్రికి విశ్రాంతి తీసుకున్నారు.

"రాజన్నవాడు ప్రజలకు బాధ కలిగితే తొలగించాలి. రాజే బాధకు కారణం కాకూడదు. వీళ్ళు మేలుకొనే లోపే తెల్లవారేటప్పటికీ వెళ్ళిపోదాం" అన్నాడు రాముడు, మనస్సు రాయి చేసుకొని.

పౌరులు నిద్రలేచారు తమ దురదృష్టాన్ని నిందించుకొన్నారు. 'ఏం ముఖం పెట్టుకుని అయోధ్యకు వెళ్లాలి?' అనుకున్నారు. కాళ్ళీడ్చుకుంటూ దుఃఖంతో అయోధ్య చేరారు. అయోధ్య నీళ్లు లేని సముద్రంలాగా ఉంది. చంద్రుడు లేని ఆకాశంలాగా ఉంది. ఏ ఇంట్లో అగ్ని హోత్రం లేదు. స్వాధ్యాయం లేదు. వర్తకులు అంగళ్లు తెరవలేదు. దేవాలయాలలో పూజా పునస్కారాలు లేవు. స్త్రీలు 'ఏం ముఖం పెట్టుకుని తిరిగి వచ్చార'ని వచ్చిన వాళ్లను తిట్టారు. "రామయ్య పురుషులందరినీ, సీతమ్మ స్త్రీలందరినీ రక్షిస్తారు. రాముడు ఉన్నచోట అడవులు, పర్వతాలు, సరస్సులు అమృతానంద సంధాయకాలు అవుతాయి. రాముడు ఉన్నచోట పరాభవం ఉండదు. పదండి వెనక్కి వెళ్దాం, రాముణ్ణి వెతుక్కుంటూ..." అని స్త్రీలందరూ ముక్తకంఠంతో అన్నారు.

అయోధ్యలో దుఃఖం ఒక్కటే మిగిలింది. బెంగ పెట్టుకున్న ప్రజలు మిగిలారు. నగరమే విషాదంలో కూరుకుపోయింది. ఇదీ ప్రజల కోణం నుంచి రామ కథ.

రాముడు- కౌసల్యా సుప్రజా రాముడు, దశరథ రాముడు, జానకి రాముడు మాత్రమే కాదు... సకల జన మనోభి రాముడు కూడా! ప్రజల మనస్సుల్లో రాముడు ఎంత ఆత్మీయుడో ఈ రెండు సన్నివేశాలూ చెబుతాయి.

అయోధ్యకాండ ఒకటి, రెండు సర్గలు చదివినవారు ఎవరైనా మంచి పరిపాలకులు అవుతారు.

● నందివెలుగు ముక్తేశ్వరరావు

బొమ్మలు: ప్రసిద్ధ చిత్రకారుడు బాపు

కార్గిల్‌లో తొలి క్వారంటైన్ బర్త్

దేశంలోనే తొలి క్వారంటైన్ బర్త్ కేసు కార్గిల్‌లో నమోదైంది. కరోనా నేపథ్యంలో కార్గిల్‌కు చెందిన ఓ కుటుంబాన్ని అధికారులు క్వారంటైన్ చేశారు. ఆ కుటుంబంలోని 30 ఏళ్ల జహ్రా బాను నిండుచూలాలు. ఆమె సోదరుడికి కరోనా పాజిటివ్ రావడంతో వారి కుటుంబం అంతటిని క్వారంటైన్ చేశారు. నొప్పులు రావడంతో జహ్రాను

మీకు తెలుసా?

అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ హాస్పిటల్‌కు చేర్చారు. మార్చి 28న జహ్రా పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చారు. ఇది దేశంలోనే తొలి క్వారంటైన్ బర్త్ కేసుగా నమోదైంది. బిడ్డ 3.5 కిలోల బరువుతో ఆరోగ్యంగా ఉన్నాడు. అయితే కుటుంబ సభ్యులందరూ క్వారంటైన్‌లో ఉండడంతో ఎలాంటి సెలబ్రేషన్స్ చేయలేదు. జహ్రా భర్త కూడా క్వారంటైన్‌లో ఉండడంతో తమ బిడ్డను చూసుకోవడానికి రాలేదు. జహ్రా బానూ వెంట కుటుంబ సభ్యులు లేకపోవడంతో హాస్పిటల్ సిబ్బందే అన్నీ తామై చూసుకున్నారు. ఆమెకు అండగా నిలిచారు. కష్టకాలంలో తనను కంటికి రెప్పలా చూసుకున్న వైద్యులు, ఆస్పత్రి సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. 'మంగళవారంతో జహ్రా క్వారంటైన్ గడువు ముగిసి ఇంటికి తిరిగి వెళతారు' అని డాక్టర్లు చెప్పారు. బిడ్డకు ఇంకా పేరు కూడా పెట్టలేదు. తొందర్లోనే కుటుంబంతో కలిసి బారసాల వేడుకలు చేసుకునేందుకు జహ్రా ఎదురుచూస్తున్నారు. అయితే ఆమెకు ప్రసవం చేసిన వైద్యురాలు పేరు కూడా జహ్రాబానూ కావడం యాదృచ్ఛికం.

● కామిక్ కరోనా

కార్టూన్: చారి పి.ఎస్



వర్క్ ఫ్రమ్ విలేజ్

కరోనా అనుభవం

'కలలు కనండి... సాకారం చేసుకోండి' అన్నారు అబ్దుల్ కలామ్ సార్. కానీ, ఇప్పుడు అంతా 'మ'కారం మీద ధ్యాస... అమెరికా పయనం మీద ఆశే తప్ప ఇంకెక్కడి కలలు! 'సోషల్'గా నాలుగు మాటలు రాద్దామనుకుంటే ఆ కలమూ లేదు... ఆ కలామూ లేరు. ఇప్పుడున్నదంతా కరోనా కాలమే! వింటేనే నా పెన్నులోంచి సారీ... నా వెన్నులోంచి వణుకు పుడుతోంది.

ఓ పక్క కరోనా... ఇంకో పక్క సోషల్ మీడియా వణికించి పారేస్తున్నాయి. దీనికితోడు సోషల్ డిస్టెన్స్ అనే పదం వచ్చి చేరింది. చిన్నపుడు సోషల్ క్లాసులు ఎగ్గొట్టేవాడిని... కాస్త పెద్దయ్యాక సోషలిజం ఉపన్యాసాలకు ఆమడదూరంలో ఉండేవాడిని. అదేంటో ఈమధ్య సోషల్ మీడియాను వాటేసుకుని వదల్లేకపోతున్నా. నిజం చెప్పాలంటే, పట్నం వచ్చాక పల్లె వాసనలు నాలో పూర్తిగా పోయాయి. స్మార్ట్‌గా ఉంది కదా అని ఈ సొల్లు ఫోన్ కొనడం వల్లే కొంపకు తిప్పలు వచ్చిపడ్డాయి. కోడి కూతకే నిద్ర లేవాల్సి ఉన్నా... నా చేతిలోనే ఉన్న ట్విట్టర్ పిట్ట రాత్రి అంతా నిద్రపోనివ్వడం లేదు. వాప్ అనేలా వాట్సాప్ మెసేజ్ లొకటి. టీవీ కూడా స్మార్ట్‌గా మారేసరికి గొట్టంగాడు (యూట్యూబ్) దాపురించాడు. ఇంకేముంది జబ్బు బాగా ముదిరిపోయింది. వీరమాచనేని పుడ్డ నడుంనొప్పి పోగొట్టే బెడ్డు వాడేం 'పీకే' వీడేం గోకే... లాంటివన్నీ చూసేసరికి సమయమంతా చంకనాకి పోయింది.

నేనుండేది అసలే నగరం... అదో పెద్ద నరకం. ఓ పక్క కరోనా తరుముతోంది... ఏం చేద్దాం అనుకుంటుంటే మనసు 'పల్లెకు పోరా' అంది. 'మనసు గతి ఇంతే' అని తిట్టుకోలేదు... పోనీ 'పల్లెకుపోయి పారును చూద్దామా' అంటే ఆమె ముసలిదైపోయి ఉండొచ్చు. మనలో ఒరిజినల్ అలానే ఉందిలెండి... టిప్ టాప్‌గా కాకపోయినా నా ల్యాప్‌టాప్‌తో ఊళ్లో అడుగుపెట్టాను. అక్కడ అడుగుపెట్టగానే గోడల మీద మనుషుల కన్నా కోతులే ఎక్కువగా కనిపించాయి. మా ఊళ్లో తిప్పి కొడితే వెయ్యి గడపలు కూడా ఉండవు. ఒకప్పుడు నాలుగు కిలో మీటర్లు నడిస్తేగాని ఊరు చేరేవాడిని కాదు... ఇప్పుడు ఆటో ఎక్కితే పది రూపాయలు... పది నిముషాలు చాలు.

'ఏరా కరోనా వస్తే గానీ ఊరు గుర్తురాలేదా?' చిన్ననాటి స్నేహితుడు ఒకడు నిష్ఠూరంగా మాట్లాడాడు. ఏదో సంపాదిద్దామని పట్నం వెళ్ళి, ఉన్న రెండెకరాలూ అమ్మేశా. కానీ, ఊళ్లో ఉన్న నా స్నేహితుడి రెండెకరాలూ అలాగే ఉంది. ఎక్కడ తేడా కొట్టింది చెప్మా అనుకున్నా. ఊరు ఏమీ మారలేదు... జనాభా అలాగే ఉంది. పెదనాన్న కొడుకు రాంబాబు ఇంటికి వెళ్లా. 'ఒరే రాంబాబూ! లోడెత్తరా... కరోనా వస్తోందంట' అన్నాడు బాబాయి కొడుకు చినబాబు. వాడికి కాస్త వెటకారం ఎక్కువ. 'ఊరేం పెరగలేదేంట్రా' అన్నాను.

'అందరూ పట్నాలు పోతుంటే ఊరేం పెరుగుతుందన్నా! ఈ మధ్య గవర్నమెంటు పింఛను ఇస్తోందని పోయినోళ్లంతా మళ్లీ ఇక్కడితే వస్తున్నారు. ఇప్పుడు కరోనా కూడా వచ్చింది కదా! ఊరు మళ్లీ కళకళ లాడుతుందిలే' అన్నాడు. కూలీలు లోడెత్తుతుంటే నాకనిపించింది... 'ఇలాంటి ధాన్యం బస్తాలు ఎత్తుతుంటే అంతకన్నా ఆరోగ్యం ఏముంటుంది' అని!

కరోనా గురించి గోడ మీద బాతాఖానీ... వాట్సప్‌లో వీడియోలు చూపించి, 'చూడండి! కరోనా ఎంత దారుణంగా ఉందో' అన్నా. నన్ను వెర్రివాణ్ణి చూసినట్లు చూశాడు మా పనిలోకి వచ్చే ఎంకన్న. 'అవన్నీ ఫేక్ అండీ... పేపర్లో వచ్చేదే నమ్మండి' అన్నాడు. 'ఓర్నీ... నీకెన్ని తెలివితేటలు ఎప్పుడొచ్చాయిరా' అనుకున్నా.

దేశమంతా లాక్‌డౌన్ అంటున్నా, ఆ ఎఫెక్ట్ ఇక్కడ పల్లెటూళ్ళో ఏమీ కనిపించలా! పొలం గట్టు నుంచి వెళుతుంటే మా పనుల్లో తిరిగే దాసు కనిపించాడు. 'ఏంటండీ! ఫేస్‌బుక్‌లో ఫ్రెండ్ రిక్వెస్ట్ పెడితే ఇంతవరకూ కన్ ఫర్మ్ చేయలేదూ' అని నిష్ఠూరంగా మాట్లాడాడు. 'నీ పేరెక్కడా కనపడలేదురా' అన్నా. 'చూడండి... దాసు రాక్ అని ఉంటుంది అన్నాడు. 'పక్కన ఆ రాక్ ఎందుకురా బాబూ'... నాకే చిరాకు వేసింది. పల్లెల్లోకి సోషల్ మీడియా ఎంతగా చొచ్చుకుపోయిందో నాకప్పుడు అర్థమైంది.

నేను మా ఊరు ఎప్పుడొచ్చినా నా మనసంతా నాటుకోడి మీదే ఉంటుంది. ఎప్పుడూ నాకు కోడిని ఇచ్చే రామకృష్ణ 'ఈసారి నీకు కోడి దొరకదు. అన్నీ జబ్బులొచ్చి చచ్చాయ్' అనేశాడు. కరోనా పుణ్యమా అని సిటీలో బాయిలర్ కోడిని తినడమే మానేశా. ఈ నాటుకోళ్లను ఏ వైరస్ చంపేసిందో అనుకున్నా. వర్క్‌ఫ్రమ్ హోమ్ చేద్దామనుకుని ల్యాప్‌టాప్ ఆన్ చేశా. ఫోన్‌లో డేటా లేదు. ఒకప్పటి మా పాలేరు వాళ్ళబ్బాయి అక్కడే ఉన్నాడు. నా అవస్థ గమనించి, 'నా ఫోన్‌లో హాట్‌స్పాట్ ఆన్ చేశా... డేటా వాడుకోండి' అన్నాడు. మరోసారి ఖంగు తిని, నేను సరే అనగానే వాడు అందుకున్నాడు. 'సార్! నేను ఊళ్లో ఉండే టిక్ టాక్ వీడియోలు చేస్తున్నా. ఇన్ స్టాగ్రామ్‌లో, ట్విట్టర్‌లో నాకు మూడు వేల మంది ఫాలోయర్స్ ఉన్నారు' అన్నాడు. ఈసారి నాకు నోట మాట రాలేదు.

నేను హైదరాబాద్‌లో ఉండి సాధించింది ఏమిటి? అతను ఇక్కడ ఉండి సాధించనిది ఏమిటి? ఆ తేడా నాకే అర్థం కాలేదు. మొన్న ఎబోలా... ఈరోజు కరోనా... తరిమేస్తే నేను ఈరోజు ఇలా! మన జీవితం ఎక్కడ మొదలైందో మళ్లీ అక్కడికే చేరుకున్నా.'మా వాడు అమెరికా' అని ఒకప్పుడు గర్వంగా చెప్పినవాడు ఇవాళ 'మా వాడూ అమెరికాలో ఉన్నాడు' అని ఆందోళనగా చెబుతున్నాడు. కాలమహిమ అంటే ఇదే మరి! పట్నవాసం కన్నా పల్లె జీవితమే మిన్న అనిపించింది.

కరోనా దెబ్బకు వర్క్ ఫ్రమ్ హోమ్ కాదు... 'వర్క్ ఫ్రమ్ విలేజ్' అనేదే నా నినాదం. స్టే ఎట్ హోమ్ సరిపోదు... స్టే ఎట్ విలేజ్ అనాలనిపించింది. చటుక్కున ఫేస్‌బుక్‌లో ఓ పోస్ట్ పెట్టేశా. ఎవరైనా లైక్ కొట్టి, షేర్ చేస్తారేమోనని చూశా. ఇంతలో ఉన్నట్టుండి, కాపీ కొట్టి పేస్ట్ కొట్టేశాడు మా బాబాయి కొడుకు చినబాబు. అదేమంటే 'నాక్కూడా పేరు రావాలి గదన్నా' అనేశాడు. ఈ వైరల్ చేయాలి, కావాలనుకొనే జాడ్యం కరోనా కన్నా పెద్ద వైరస్ అనిపించింది.

● పామర్తి హేమసుందర్

వెరైటీ కరోనా!

లాక్‌డౌన్ మూలంగా దేశం మొత్తం స్తంభించింది. అందరూ ఇంటికే పరిమితమయ్యారు. కొందరు ఇష్టమైన పనులతో కాలక్షేపం చేస్తుంటే, మరికొందరు స్మార్ట్‌ఫోన్లతో గడిపేస్తున్నారు. అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలలో నివసించే వారు ఛాటింగ్ యాప్స్‌లో సరికొత్త ఆటలు ఆడుతూ బిజీగా ఉంటున్నారు.

❖ అపార్టుమెంట్లలో, గేటెడ్ కమ్యూనిటీలలో లాక్‌డౌన్‌ను కఠినంగా అమలు చేస్తున్నారు. ఏ ఇద్దరు ఒకచోట చేరకుండా చూస్తున్నారు. అందుకే వాళ్ల సామాజిక దూరం పాటిస్తూనే ఆటలు ఆడుకునేందుకు సోషల్ మీడియాను ఎంచుకుంటున్నారు.

❖ కొన్ని అపార్ట్‌మెంట్లలో 'సింగ్ ఎ సాంగ్' పేరుతో వాట్సప్ గ్రూప్‌లో ఒక గేమ్‌ను క్రియేట్ చేశారు. ఇందులో నిర్ణీత సమయంలో ఎవరైతే ఎక్కువ పాటలు పాడతారో వారిని విన్నర్‌గా ప్రకటిస్తారు.

❖ అలాగే 'అంత్యాక్షరి' పేరుతో మరో గేమ్‌ను వాట్సప్‌లో రూపొందించారు. ఇందులో పాల్గొనే వారు పాట పాడి అప్‌లోడ్ చేయాలి. క్లాసికల్ సాంగ్స్, పాత పాటలు ఏవైనా ఎంచుకోవచ్చు. ఒకరి తరువాత మరొకరు పాటలు పాడుతూ అప్‌లోడ్ చేస్తుండాలి.

❖ 'రైట్ ఎ స్టోరీ' పేరుతో మరో గేమ్ కూడా పెట్టారు. ఈ థీమ్‌లో ఏదైనా ఒక స్టోరీ రాసి పోస్ట్ చేయాల్సి ఉంఉంటుంది. అలా అందరూ రాసిన స్టోరీలను కలిపి లాక్‌డౌన్ పూర్తయ్యాక ఈ-బుక్ రూపంలో తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నారు.

❖ 'కిస్, మ్యారీ ఆర్ కిల్' పేరుతో మరో గేమ్‌ను రూపొందించారు. ఇందులో ఒక సెలబ్రిటీని ఎంచుకోవాలి. మిగతా సభ్యులు ఆ సెలబ్రిటీని కిస్ చేస్తావా? పెళ్లి చేసుకుంటావా? లేక చంపేస్తావా? అని అడుగుతారు. సభ్యులు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సి ఉంటుంది.

లాక్‌డౌన్ నేపథ్యంలో సామాజిక దూరం పాటిస్తూనే ఇలాంటి ఆటలు ఆడడానికి చాలామంది అపార్ట్‌మెంట్ వాసులు, గేటెడ్ కమ్యూనిటీవాసులు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. అలా తమకు తాము బిజీగా ఉండేలా చూసుకుంటున్నారు.

---

20 నిమిషాల్లో టొమాటో రైస్!

ఫటాఫట్

కొంచెం రైస్, మూడు టొమాటోలు, కొన్ని పోపు గింజలు, ఒక వంట పాత్ర ఉంటే చాలు.. 20 నిమిషాల్లో ఇట్టే రుచికరమైన టొమాటో రైస్‌ను చేసుకోని తినొచ్చు.

కావలసిన పదార్థాలు

రైస్ - 1 1/2 కప్పు, టొమాటోలు - 3, నూనె/నెయ్యి - 2 టేబుల్ స్పూన్లు, ఉల్లిపాయ - 1, కూరమిరప - 1, అల్లం వెల్లుల్లి పేస్ట్ - కొంచెం, ఉప్పు, పసుపు, కారం - తగినంత

తయారుచేసే విధానం

ముందుగా రైస్‌ను బాగా కడిగి వండి ఉంచుకోవాలి. స్టవ్ మీద పాత్రను పెట్టి నూనె వేయాలి. నూనె వేడెక్కాక లవంగాలు, దాల్చిన చెక్క, మిరియాలు వేగాక తరిగిపెట్టుకున్న కరివేపాకు, ఉల్లి, పచ్చిమిరప ముక్కలు వేసుకోవాలి. దానికి అల్లం వెల్లుల్లి పేస్ట్ కలుపుకొని సువాసన వచ్చేదాక వేగించాలి. టొమాటో ముక్కలు, పసుపు వేసి మూతపెట్టి, టొమాటో ముక్కలు మొత్తగా అయ్యేదాకా ఉడికించాలి. దానికి తగినంత కారం, ఉప్పు, పసుపు వేసి, అన్నం కలిపి మూతపెట్టి సన్నమంట మీద నీళ్లు ఇగిరిపోయేదాకా ఉంచాలి. తర్వాత కొత్తిమీర చల్లుకొని, నిమ్మరసం కలిపితే వేడివేడి టొమాటో రైస్ రెడీ.

కరోనా కాలం

కూతురు కింజాల్ వివాహాన్ని అత్యంత వైభవంగా జరిపించాలనుకున్నారు ఇండోర్‌కు చెందిన అక్షయ్ జైన్. ఈలోగా కోవిడ్-19 వైరస్ దేశం మొత్తాన్నీ ఇళ్లలో వేసి బంధించింది. ఇలాంటి అనూహ్య పరిస్థితుల్లో అంతా మాస్కులు ధరించారు. శానిటైజర్లు వెంట తెచ్చుకున్నారు. ఫొటోలకు పోజులిచ్చేటప్పుడు కూడా సామాజిక దూరం పాటించారు. కొసమెరుపు ఏమిటంటే... బయట నుంచి తెస్తే కరోనా వైరస్ వచ్చే ప్రమాదం ఉందని పూల దండలకు బదులు... ముత్యాల హారాలు మార్చుకున్నారు వధూవరులు!

జీఎస్‌టీ వసూళ్లు రూ.97,597 కోట్లు

న్యూఢిల్లీ: లాక్‌డౌన్ నేపథ్యంలో దేశవ్యాప్తంగా అన్ని వ్యాపార సంస్థలు మూతపడిన ప్రభావం జీఎస్‌టీ వసూళ్లపై పడింది. మార్చిలో జీఎస్‌టీ వసూళ్లు రూ.97,597 కోట్లుగా నమోదయ్యాయి. నాలుగు నెలల్లో మొదటిసారిగా లక్ష కోట్ల రూపాయలకన్నా తక్కువగా జీఎస్‌టీ వసూళ్లు జరిగాయి. గత ఏడాది మార్చిలో జీఎస్‌టీ వసూళ్లు రూ.1.06 లక్షల కోట్లుగా ఉన్నాయి. దీంతో పోల్చితే ఈ ఏడాది మార్చిలో వసూళ్లు 8.4 శాతం తగ్గాయి. మార్చిలో స్థూలంగా ఉన్న రూ.97,597 కోట్ల జీఎస్‌టీ వసూళ్లలో సీజీఎస్‌టీ రూ.19,183 కోట్లు, ఎస్‌జీఎస్‌టీ రూ.25,601 కోట్లు, ఐజీఎస్‌టీ రూ.44,508 కోట్లు (దిగుమతుల ద్వారా వసూలైన మొత్తం రూ.18,056 కోట్లు సహా), సెస్ రూ.8,306 కోట్లు (దిగుమతులపై వసూలు చేసిన మొత్తం రూ.841 కోట్లు సహా) ఉన్నట్టు ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. దేశీయంగా లావాదేవీలు తగ్గిపోవడం, దిగుమతులు తగ్గడం వంటివి రాబడులను ప్రభావితం చేశాయి. 2019 నవంబరు నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు జీఎస్‌టీ వసూళ్లు రూ.లక్ష కోట్లకు పైగానే నమోదవుతూ వచ్చాయి.

భారీ కొనుగోళ్లకు ఎఫ్ఎంసీజీల కళ్లెం

లాక్‌డౌన్ నేపథ్యంలో కీలక చర్య

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ నేపథ్యంలో వస్తువులు దొరుకుతాయో లేదో అన్న భయాలతో ఎగబడి వస్తువులు కొనుగోలు చేసే వారికి ఎఫ్ఎంసీజీ కంపెనీలు కళ్లెం వేస్తున్నాయి. డీమార్ట్ ఇప్పటికే ఈ చర్యకు ఉపక్రమించింది. ఫ్యూచర్ గ్రూప్‌నకు చెందిన ఈజీడే క్లబ్ స్టోర్స్ లోనూ ఒక్కో వ్యక్తి కొనుగోలు చేసే వస్తువులు, సరుకులపై పరిమితులు విధించారు. పలు వ్యవస్థీకృత రిటైలింగ్ స్టోర్లు కూడా అదే ఆలోచనలో ఉన్నాయని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. డీమార్ట్ ఒక్కో వ్యక్తికి బియ్యం 20 కిలోలు, గోధుమ పిండి 10 కిలోలు, పప్పులు నాలుగు కిలోలు, చక్కెర 5 కిలోలకు మించి అమ్మడం లేదు. బిస్కెట్లు, నూడుల్స్ కూడా ఒక్కో వ్యక్తికి 12 ప్యాకెట్లకు మించి అనుమతించడం లేదు. అయితే నిత్యావసర వస్తువులు, ఆహార పదార్థాల కోసం వినియోగదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రిటైల్ కంపెనీలు హామీ ఇచ్చాయి. గోదాముల్లో రెండు మూడు వారాల అవసరాలకు సరిపడా నిల్వలు ఉన్నట్టు తెలిపాయి.

కార్మికులు, డ్రైవర్ల కొరత

ప్రభుత్వం మినహాయింపు ఇవ్వడంతో ఎఫ్ఎంజీసీ కంపెనీలు ఉత్పత్తి కార్యకలాపాలు ప్రారంభించాయి. అయితే ఇప్పటికీ ఈ కంపెనీలను కార్మికుల కొరత, డ్రైవర్ల కొరత వారిని వేధిస్తోంది. సగం మంది కూడా విధులకు రాలేకపోతున్నారు. దీంతో కంపెనీలు ఉన్న కార్మికులతోనే రెండు మూడు షిఫ్టులతో నెట్టుకొస్తున్నాయి.

లాక్‌డౌన్‌తో ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోవడంతో కంపెనీలకు ముడి పదార్థాల సరఫరా కొండెక్కింది. దేశంలోని 90 లక్షల సరుకుల రవాణా ట్రక్కుల్లో అయిదు శాతం మాత్రమే ప్రస్తుతం రోడ్ల మీద తిరుగుతున్నాయి. డ్రైవర్ల కొరత అధికంగా ఉంది. సరకు లోడింగ్, అన్‌లోడింగ్‌కు కూలీలు కూడా దొరకడంలేదని అఖిల భారత మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్ (ఏఐఎంటీసీ) ఒక ప్రకటనలో తెలిపింది.

ఆటో అమ్మకాల్లో భారీగా క్షీణత

ఆర్థిక మందగమనంతో పాటు కరోనా వైరస్ దెబ్బతో ఆటోమొబైల్ రంగం విలవిల్లాడుతోంది. మార్చిలో అమ్మకాలు భారీగా క్షీణించడంతో కంపెనీల పరిస్థితి ఇబ్బందికరంగా మారిపోయింది. దిగ్గజ కంపెనీలకు ఇంతకు ముందెన్నడూ లేని విధంగా మార్చిలో గడ్డుపరిస్థితులు ఎదురయ్యాయి.

- మారుతీ సుజుకీ అమ్మకాలు మార్చి నెలలో 47 శాతం తగ్గి 83,792 యూనిట్లకు చేరాయి. ఎగుమతులు 55 శాతం క్షీణించి 4,712 యూనిట్లకు చేరినట్టు కంపెనీ తెలిపింది. మార్చితో ముగిసిన 2019-20 ఆర్థిక సంవత్సరంలో మారుతీ మొత్తం అమ్మకాలు అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 16.1 శాతం క్షీణించి యూనిట్లకు చేరుకున్నాయి.
- హ్యుండయ్ కంపెనీ మార్చిలో 32,279 కార్లను విక్రయించింది. గత ఏడాది ఇదే నెల (61,150 యూనిట్లు)తో పోల్చితే అమ్మకాలు 47.21 శాతం తగ్గాయి.
- టాటా మోటార్స్ అమ్మకాలు మార్చిలో 82.69 శాతం క్షీణించి 12,924 యూనిట్లకు చేరుకున్నాయి. గత ఏడాది ఇదే నెలలో కంపెనీ 74,679 వాహనాలను విక్రయించింది.
- మహీంద్రా అమ్మకాలు భారీ స్థాయిలో 88 శాతం క్షీణించి 7,401 యూనిట్లకు చేరుకున్నాయి. దేశీయ మార్కెట్లో అమ్మకాలు 90 శాతం తగ్గి 6,130 యూనిట్లకు చేరాయి.
- అశోక్‌లేలాండ్ అమ్మకాలు 90 శాతం క్షీణించి 2,179 యూనిట్లకు చేరాయి. దేశీయంగా అమ్మకాలు 91 శాతం తగ్గి 20,521 నుంచి 1,787కు చేరాయి.
- కియా మోటార్స్ దేశీయ మార్కెట్లో 8,583 కార్లను విక్రయించింది. ఇంత క్షీణతలోనూ వరుసగా మూడో నెల లోనూ దేశంలో అత్యధికంగా అమ్ముడయిన ఎస్‌యూవీగా సెల్టోస్ నిలిచింది.

దేశీయ సరఫరాకే ప్రాధాన్యం

ఫార్మా ఎగుమతిదారులతో జయేశ్ రంజన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పరిస్థితులు అనుకూలించే వరకూ ఔషధ ఎగుమతులపై వేచి చూడడం తప్ప వేరే మార్గం లేదని, ఎగుమతులకన్నా దేశీయ అవసరాలకు ఔషధాలు అందించడం ముఖ్యమని తెలంగాణ పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. తెలంగాణ ఎగుమతులు, దిగుమతుల వ్యాపారంపై లాక్‌డౌన్ ప్రభావాన్ని వెబ్‌నార్ ద్వారా సమీక్షించడానికి ఎఫ్‌టీసీసీఐ, ఫిక్కీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఔషధాల ఎగుమతుల పునరుద్ధరణకు చర్యలు చేట్టాలని వివిధ కంపెనీల ప్రతినిధులు కోరగా దేశీయ ప్రజల అవసరాలు తప్ప ప్రస్తుతానికి ఎగుమతుల గురించి ఆలోచించలేమని స్పష్టం చేశారు. కోవిడ్-19 వైరస్ నేపథ్యంలో 26 రకాల యాంటీ బయాటిక్స్, విటమిన్లు, హార్మోన్ల ఎగుమతులను కేంద్రం నిషేధించింది. మాస్కులు వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులకు కొరతగా ఉందని.. కరోనా వ్యాప్తిని కట్టడి చేయడంలో కీలకమైన ఈ పరికరాల కొరత ఉందని జయేశ్ అన్నారు. దేశీయంగా కొన్ని కంపెనీలు ఉత్పత్తి చేస్తున్నప్పటికీ చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. చైనా నుంచి భారత్‌కు కార్గో షిప్పులు, ఫ్లైట్లను అనుమతించనంత వరకూ కొన్ని ఇబ్బందులు తప్పవు. దీనిపై కేంద్రంతో చర్చిస్తున్నామని తెలిపారు.

ఈఎంఐ వాయిదా పడినా వడ్డీ పోటు!

న్యూఢిల్లీ: ఆర్‌బీఐ ఆదేశాలకు అనుగుణంగా బ్యాంకులు కస్టమర్లకు ఈఎంఐ చెల్లింపులను మూడు నెలలు వాయిదా వేసినా ఆ కాలానికి వడ్డీభారం తప్పదని బ్యాంకులు స్పష్టం చేశాయి. ఈ మారటోరియంతో రుణగ్రహీతలకు ప్రయోజనం అంతంత మాత్రమేనని విశ్లేషకులు అంటున్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులిప్పటికే తమ కస్టమర్లకు ఈ వెసులుబాటును కల్పించాయి. దేశీయ బ్యాంకింగ్ రంగంలో మూడింట రెండొంతుల మార్కెట్ వాటా వీటిదే. ప్రైవేట్ బ్యాంక్‌లు సైతం ఈఎంఐ హాలిడే సదుపాయాన్ని కల్పిస్తున్నాయి. కాగా మూడు నెలలకు మారటోరియం ఎంచుకునే గృహ, వాహన రుణ కస్టమర్లకు కావాలనుకుంటే మార్చిలో చెల్లించిన ఈఎంఐని రిఫండ్ చేస్తామని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) ప్రకటించింది.

వడ్డీ భారం ఎంత పెరుగుతుందంటే..

- రూ.30 లక్షల గృహ రుణం మరో 15 ఏళ్లు చెల్లించాల్సి ఉందనుకుందాం. మారటోరియం ఎంచుకునే వారిపై నికరంగా రూ.2.34 లక్షల అదనపు వడ్డీ భారం పడుతుంది. ఈ మొత్తం 8 ఈఎంఐలతో సమానం.
- రూ.6 లక్షల వాహన రుణం ఇంకా 54 నెలలు చెల్లించాల్సి ఉంటే అదనపు వడ్డీ రూ.19,000 అవుతుంది. అంటే, ఒక టిన్నర ఈఎంఐలతో సమానం.

ఆప్ట్ ఇన్.. అప్ట్ అవుట్

ప్రభుత్వ రంగ బ్యాంకులు మారటోరియాన్ని ఆప్ట్ అవుట్ ఆప్షన్‌తో ప్రకటించగా.. పలు ప్రైవేట్ బ్యాంక్‌లు ఆప్ట్ ఇన్ ఆప్షన్‌తో ప్రకటించాయి. రుణగ్రహీతలు తమ బ్యాంక్ ఏ ఆప్షన్‌తో మారటోరియాన్ని ప్రకటించిందనేది జాగ్రత్తగా గమనించాల్సి ఉంటుంది. ఎందుకంటే, ఆ ఆప్షన్ బట్టే కస్టమర్ ఏం చేయాల్సి ఉంటుందనేది ఆధారపడి ఉంది. ఈ ఆప్షన్ల వివరాలు.....

అప్ట్ ఇన్

ఈ ఆప్షన్‌లో మారటోరియం ఎంచుకోవాలనుకునే కస్టమర్లు నిర్దేశిత మార్గం (ఫోన్/మెయిల్/ఆన్‌లైన్/బ్యాంక్ బ్రాంచ్) ద్వారా బ్యాంక్‌ను సంప్రదించాలి. అప్పుడే మారటోరియం వెసులుబాటు లభిస్తుంది. చెల్లింపుల వాయిదా వద్దనుకుంటే మాత్రం ఏం చేయనక్కర్లేదు.

అప్ట్ అవుట్

ఈ ఆప్షన్‌లో బ్యాంక్ తన కస్టమర్లకు ఈఎంఐ చెల్లింపుల మారటోరియాన్ని ఆటోమేటిక్‌గా వర్తింపజేస్తుంది. మారటోరియం వద్దనుకున్నప్పుడే కస్టమర్ బ్యాంక్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

రాష్ట్రాలకు, ఎగుమతిదారులకు ఊరట

ఆర్‌బీఐ తాజా నిర్ణయం

ముంబై: కరోనా కష్టాల నుంచి ఊరట కల్పించేందుకు ఆర్‌బీఐ మరిన్ని చర్యలు ప్రకటించింది. ఒకటేమో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాల కోసం కాగా.. మరో రెండు చర్యలేమో ఎగుమతిదారులు, బ్యాంకుల కోసం. ఆ వివరాలు..

- వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సెస్ (డబ్ల్యూఎంఏ)లో భాగంగా రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఇచ్చే రుణాల పరిమితిని 30 శాతం పెంచుతున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. ఈ నెల 1 నుంచే అమలులోకి వచ్చిన పరిమితి పెంపు.. ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధం (సెప్టెంబరు 30) వరకు అందుబాటులో ఉంటుంది. కేంద్రం, రాష్ట్రాల ప్రభుత్వాలు ద్రవ్య కొరతను తీర్చుకునేందుకు ఈ నిధి నుంచి గరిష్ఠంగా 90 రోజుల కోసం రుణం తీసుకునే వీలుంటుంది.
- వస్తువులు లేదా సాఫ్ట్ వేర్ ఎగుమతులపై రాబడిని స్వదేశానికి తరలించేందుకు మరింత సమయం కల్పించింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం, ఎగుమతి రాబడిని ఎగుమతి తేదీ నుంచి 9 నెలల్లోగా స్వదేశానికి తరలించాలి. ఈ ఏడాది జూలై 31 వరకు ఎగుమతులకు ఈ గడువును 15 నెలలకు పెంచింది.
- బ్యాంకులు కౌంటర్‌సైకిల్ క్యాపిటల్ బఫర్స్ (సీసీవైబీ)ని మరో ఏడాది వరకు అమలులోకి తీసుకురానవసరం లేదని ఆర్‌బీఐ తెలిపింది. అంటే, ఈ బఫర్ కోసం కేటాయించాల్సిన నిధులను బ్యాంకులు ఇతర అవసరాలకు ఉపయోగించుకునే వెసులుబాటు లభిస్తుంది.

దివాలా స్థితిలో ఎయిర్‌లైన్స్

దేశంలోని విమాన యాన కంపెనీలన్నీ విమాన సర్వీసులు నిలిపివేయాల్సివచ్చినందు వల్ల ఆయా కంపెనీల వద్ద ఉన్న నగదు నిల్వలు త్వరితగతిన తరిగిపోతున్నాయని, అవి దివాలా స్థితిలోకి పోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయని ఫిక్కీ ఏవియేషన్ కమిటీ ప్రభుత్వానికి నివేదించింది. వారి దయనీయమైన స్థితిని పరిగణనలోకి తీసుకుని తగురీతిలో పలు మద్దతు చర్యలు ప్రకటించాలని కోరుతూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పౌర విమానయాన మంత్రి హర్‌దీప్ సింగ్ పురిలకు లేఖ రాసింది. విమానయాన సంస్థలు, ఆయా సంస్థలకు చెందిన బ్యాంకులు జారీ చేసిన స్టాండ్ బై లెటర్స్ ఆఫ్ క్రెడిట్, విదేశీ గ్యారంటీలు, బ్యాంకు గ్యారంటీల వంటివి 90 రోజుల పాటు వాయిదా వేయాలని ఆర్‌బీఐకి ఆదేశించాలని కోరింది. అలాగే విమానయాన సంస్థలపై ఎలాంటి వడ్డీలు, పెనాల్టీలు, జాప్యానికి చార్జీలు వంటివి విధించకుండా చూడాలని, అందుకు ఎయిర్‌పోర్ట్ ఆపరేటర్లకు ఏర్పడే ఆదాయం నష్టాన్ని భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కూడా సూచించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

1వ తేదీకి..			
హైదరాబాద్	335	విజయవాడ	345
2వ తేదీకి..			
చిత్తూరు	353	విశాఖపట్నం	345
గోదావరి	345	వరంగల్	338
		డజను గుడ్లు రూ.	54

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	70	విజయవాడ	62
వరంగల్	70	గుంటూరు	60
మహబూబ్‌నగర్	70	ఒంగోలు	58
కరీంనగర్	70	చిత్తూరు	60
కర్నూలు	70	నెల్లూరు	60
విశాఖపట్నం	50	అనంతపురం	66
గోదావరి	65		

స్పోర్ట్స్

వార్న్.. గ్రేటెస్ట్ లెవెన్

సారథి గంగూలీ

న్యూఢిల్లీ: ఆల్‌టైమ్ భారత క్రికెట్ జట్టు కెప్టెన్ ఎవరు? అంటే.. సౌరవ్ గంగూలీనే అంటున్నాడు ఆస్ట్రేలియా స్పిన్ లెజెండ్ షేన్ వార్న్. గ్రేటెస్ట్ ఇండియా-11 పేరిట తన జట్టును ప్రకటించిన వార్న్.. వీరిలో దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, కపిల్ దేవ్, రాహుల్ ద్రావిడ్, అనిల్ కుంబ్లేతో పాటు మహ్మద్ అజరుద్దీన్‌కు చోటు కల్పించాడు. తన హయాంలో, తనతో ఆడిన భారత ఆటగాళ్లతోనే జట్టును రూపొందించానని.. అందుకే తన జట్టులో విరాట్ కోహ్లీ, ధోనీకి చోటు కల్పించలేదని వార్న్ చెప్పుకొచ్చాడు. ఓపెనర్లుగా వీరేంద్ర సెహ్వాగ్, నవ్‌జ్యోత్‌సింగ్ సిద్ధూలను తీసుకున్న వార్న్.. తాను ఆడే సమయంలో స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కొన్నందునే మిగతావాళ్లను కాదని సిద్ధూకు ఓపెనింగ్ స్థానమిచ్చానన్నాడు. అయితే, ఆస్ట్రేలియాపై అద్భుతమైన రికార్డున్న వీవీఎస్ లక్ష్మణ్‌కు మాత్రం వార్న్ జట్టులో చోటివ్వలేదు. కెప్టెన్‌గా సౌరవ్ గంగూలీని తీసుకున్నానని, అందుకే సొగసరి లక్ష్మణ్‌ను పక్కన పెట్టక తప్పలేదని తన నిర్ణయాన్ని వార్న్ సమర్థించుకున్నాడు.

వార్న్ జట్టు ఇదే: గంగూలీ (కెప్టెన్), సెహ్వాగ్, నవ్‌జ్యోత్ సింగ్ సిద్ధూ, ద్రావిడ్, సచిన్ టెండూల్కర్, అజరుద్దీన్, కపిల్ దేవ్, నయన్ మోంగియా (వికెట్ కీపర్), హర్భజన్ సింగ్, జవగళ్ శ్రీనాథ్, అనిల్ కుంబ్లే.

హాకీ ఇండియా సాయం 25 లక్షలు

న్యూఢిల్లీ: దేశంలో కరోనా వైరస్ నిర్మూలనకు పీఎం కేర్స్ ఫండ్‌కు హాకీ ఇండియా (హెచ్ఐ) రూ.25 లక్షల విరాళం ప్రకటించింది. బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు హెచ్ఐ అధ్యక్షుడు మహ్మద్ ముస్తాక్ అహ్మద్ తెలిపారు. 'క్లిష్టమైన సమయంలో దేశానికి సాయం చేయడానికి ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. హాకీ క్రీడకు దేశ ప్రజలు ఎప్పుడూ అండగా నిలుస్తారు. కాబట్టి మా వంతుగా వారికి చిన్న సాయం చేయాలని నిర్ణయం తీసుకున్నాం'. అని అహ్మద్ తెలిపారు.

టోక్యో ఆతిథ్యమివ్వాల్సిన ఒలింపిక్స్‌కు ఏడో ఒక అవరోధం ఎదురవుతోంది. ఎప్పుడో ఎనిమిది దశాబ్దాల కిందట ఇప్పటిలాగే ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఒలింపిక్స్ నిర్వహించాలని టోక్యో భావించింది. కానీ అప్పుడు ఆధిపత్యం కోసం యుద్ధం చేయాల్సి రావడంతో ఏకంగా క్రీడలే రద్దయ్యాయి. ఈసారి కరోనా 'యుద్ధం'తో జీవన్మరణ సమస్యగా మారి విశ్వక్రీడలు వాయిదా పడ్డాయి.

నాడు ఆధిపత్యం.. నేడు జీవన్మరణం

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

అది రెండో ప్రపంచ యుద్ధకాలం. విశ్వమంతా భయం గుప్పిట కూరుకుపోయింది. ఆ తరుణంలో 1940లో 12వ ఒలింపిక్స్‌ను టోక్యో నిర్వహించాలి. అయితే యుద్ధం వల్ల వాటిని ఫిన్లాండ్ రాజధాని హెల్సింకీకి తరలించారు. కానీ అక్కడా సాధ్యపడకపోవడంతో మొత్తంగా ఆ ఒలింపిక్స్‌ను రద్దు చేశారు. అసలు ఆ ఒలింపిక్స్ ఆతిథ్యాన్ని టోక్యో చేజిక్కించుకోవడం వెనుక రెండు ప్రధాన కారణాలున్నాయి. 1923 సెప్టెంబరు 1న వచ్చిన భూకంపం.. టోక్యో, దాని పక్కనేగల పట్టణం యోకొహామాను నేలమట్టం చేసింది. లక్షన్నరమంది ఆ ప్రకృతి ప్రకోపానికి బలయ్యారు. ఈ ఉత్పాతం నుంచి కోలుకున్నామని నిరూపించుకొనేందుకు టోక్యో 1940 ఒలింపిక్స్‌కు బిడ్ వేసింది.

బిడ్‌కు మరో కారణం ఇదీ...

1940 ఒలింపిక్స్‌ను నిర్వహించాలని జపాన్ భావించడానికి మరో కారణం కూడా ఉంది. జపాన్ తొలి చక్రవర్తి జిమ్ము పట్టాభిషిక్తుడై 1940కి 2600 సంవత్సరాలు అవుతుంది. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వాలని తలచింది. 1932లో జపాన్ బిడ్ ప్రయత్నాలు ప్రారంభించగా.. రోమ్, హెల్సింకీ కూడా పోటీ పడ్డాయి. అయితే బిడ్‌ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న జపాన్ తీవ్రస్థాయిలో లాబీయింగ్ చేసింది. అంతేకాదు.. తమకు మద్దతుగా బరినుంచి వైదొలగాలని నాటి ఇటలీ నియంత ముస్సోలినీని కూడా అభ్యర్థించింది. అయితే, ముస్సోలినీ ఓ షరతు విధించారు. తాము జపాన్‌కు మద్దతిస్తామని, ప్రతిగా 1944 ఒలింపిక్స్ బిడ్‌కు తమకు మద్దతివ్వాలని కోరారు. తద్వారా ఇటలీ రేస్‌నుంచి నిష్క్రమించగా.. టోక్యో, హెల్సింకీ పోటీలో నిలిచాయి. ఓటింగ్‌లో టోక్యో ఆతిథ్యాన్ని దక్కించుకుంది. ఒలింపిక్స్‌కు బిడ్ వేయడానికి ముందు 1931లో చైనాలోని మంచూరియా ప్రాంతాన్ని జపాన్ ఆక్రమించడంతోపాటు రెండేళ్ల తర్వాత నానాజాతి సమితినుంచి వైదొలగింది. దాంతో బ్రిటన్, అమెరికాలు జపాన్‌పై ఆగ్రహం ప్రకటించాయి. ఆ రెండు దేశాలతో సంబంధాలు మెరుగుపరుచుకొనేందుకు ఒలింపిక్స్‌కు జపాన్ బిడ్ వేసిందని కూడా చెబుతారు. అప్పటికే ప్రపంచమంతా యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. బ్రిటన్, అమెరికా ఒలింపిక్స్‌ను బహిష్కరిస్తాయన్న వార్తలు బయలుదేరాయి. ఈ తరుణంలో 1937లో రెండో చైనా-జపాన్ యుద్ధం ప్రారంభమైంది. ఫలితంగా మిలటరీ ఆపరేషన్లకు జపాన్‌కు భారీగా డబ్బు అవసరమైంది. దాంతో ఒలింపిక్స్‌కంటే కూడా యుద్ధానికే ప్రాధాన్యమిచ్చిన జపాన్.. విశ్వ క్రీడల నిర్వహణనుంచి వైదొలుగుతున్నట్టు 1938లోప్రకటించింది. అలా ఆ ఒలింపిక్స్‌కు బ్రేక్ పడిందన్నమాట! మరి ఈసారి కంటికి కనపడని శత్రువు కరోనాపై ప్రపంచమంతా యుద్ధం చేస్తుండడంతో ఒలింపిక్స్ వాయిదా పడ్డాయి.

విదేశీ ఆటగాళ్లు లేకుండా ఐపీఎల్?

ముంబై: ప్రస్తుత పరిస్థితులు మెరుగుపడితే ఐపీఎల్‌ను విదేశీ ఆటగాళ్లు లేకుండా నిర్వహించవచ్చునని రాజస్థాన్ రాయల్స్ సీఈఓ రంజిత్ బర్థాకూర్ అన్నారు. 'కేవలం భారత ప్లేయర్లతోనే మినీ ఐపీఎల్‌ను నిర్వహిస్తే ఎలా ఉంటుందని ఆలోచన చేస్తున్నాం. కరోనా ఉధృతి తగ్గితే ఐపీఎల్‌ను నిర్వహించేందుకు బీసీసీఐ సిద్ధంగా ఉంది. ఏదైనా ఐపీఎల్ నిర్వహణపై ఈనెల 15 తర్వాతే స్పష్టత వస్తుంద'ని చెప్పారు.

మెకెన్రో తమ్ముడికి కరోనా

న్యూయార్క్: ప్రఖ్యాత టెన్నిస్ వ్యాఖ్యాత, ఫ్రెంచ్ ఓపెన్ మాజీ డబుల్స్ విజేత ప్యాట్రిక్ మెకెన్రోకి కరోనా వైరస్ సోకింది. వైద్య పరీక్షల్లో తనకి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని ప్యాట్రిక్ స్వయంగా ట్విటర్‌లో తెలిపాడు. ప్యాట్రిక్.. టెన్నిస్ లెజెండ్ జాన్ మెకెన్రో తమ్ముడు. ఈ 53 ఏళ్ల అమెరికన్ 1989లో ఫ్రెంచ్ ఓపెన్ డబుల్స్ టైటిల్ నెగ్గాడు. 1991లో ఆస్ట్రేలియా ఓపెన్ సెమీస్ చేరాడు.

ఎంఏ పరీక్షలకు చదువుతున్నా!

హాకీ కెప్టెన్ రాణి

బెంగళూరు: టోక్యో ఒలింపిక్స్ సన్నద్ధతలో భాగంగా భారత మహిళల హాకీ జట్టుకు ఇటీవల స్థానిక సాయ్ సెంటర్‌లో సన్నాహక శిబిరం ఏర్పాటు చేశారు. అయితే కరోనా వైరస్‌ను కట్టడి చేయడానికి ప్రధాని మోదీ దేశం మొత్తం లాక్‌డౌన్ ప్రకటించారు. దీంతో భారత మహిళల జట్టు సాయ్ సెంటర్‌లోనే ఉండిపోయింది. ఇక టోక్యో ఒలింపిక్స్ కూడా వచ్చే ఏడాదికి వాయిదా పడ్డాయి. కాబట్టి ఖాళీ సమయాన్ని తన ఎంఏ పరీక్షల కోసం సద్వినియోగం చేసుకుంటున్నట్టు కెప్టెన్ రాణీ రాంపాల్ తెలిపింది.

వినయశీలి.. విరాట్

కరాచీ: టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ ఎంతో వినయ విధేయతలున్న ఆట గాడని పాకిస్థాన్ మాజీ కెప్టెన్ జావెద్ మియాందాద్ ప్రశంసించాడు. క్రికెట్‌ను ఎంతగానో ప్రేమించే విరాట్ తన సహచర ఆటగాళ్లను చాలా గౌరవిస్తాడని పేర్కొన్నాడు. అలాగే బ్యాటింగ్‌లో అతడి నిలకడ తననెంతో ఆకట్టుకుంటుందని చెప్పాడు. 'తాను అనుకున్నప్పుడల్లా పరుగులు సాధించగల సామర్థ్యం కోహ్లీ సొంతం. ఇక విరాట్ అణకువ కలిగిన క్రికెటర్. ప్రత్యర్థి జట్టుతోనూ అతడు స్నేహపూర్వకంగా ఉంటాడు. విరాట్ స్థాయి క్రికెట్ ఆడిన ఆటగాడిగా నేను ఇది చెబుతున్నా. భారత ఆటగాళ్లు దూకుడుగా ఉంటారని అంటారు. మైదానంలో దూకుడుగా ఉండాల్సిందే. కానీ దానికి పరిమితులున్నాయి' అని మియాందాద్ చెప్పుకొచ్చాడు.

లాక్‌డౌన్ ఎన్నో నేర్పుతోంది!

అనుష్క

న్యూఢిల్లీ: కొవిడ్-19 విజృంభణతో క్రీడలు, సినిమా, ఇలా.. ఒకటేమిటి అన్ని రంగాలు స్తంభించిపోయాయి. దీంతో దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ ప్రకటించడంతో సామాన్యులతో పాటు సెలెబ్రిటీలంతా ఇళ్లకే పరిమితమయ్యారు. ఇక, టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ, అతని భార్య, బాలీవుడ్ నటి అనుష్క శర్మ స్వీయ నిర్బంధంలో ఉంటూ ఈ సమయాన్ని ఆస్వాదిస్తున్నారు. ఈ సందర్భంగా విరాట్‌తో కలిసున్న ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో బుధవారం పోస్ట్ చేసిన అనుష్క.. లాక్‌డౌన్ సందర్భంగా ఎన్నో సానుకూల విషయాలను నేర్చుకుంటున్నట్టు రాసుకొచ్చింది. ఈ విపత్కర పరిస్థితుల్లో అందరూ ఇంటివద్దే జాగ్రత్తగా ఉండాలని సూచించింది.

75 ఏళ్ల తర్వాత తొలిసారి.. వింబుల్డన్ రద్దు

లండన్: కరోనా మహమ్మారి సెగ ప్రతిష్ఠాత్మక వింబుల్డన్‌కూ తగిలింది. పురాతనమైన గ్రాండ్‌స్లామ్‌ల్లో ఒకటిగా ఖ్యాతిగాంచిన ఈ టెన్నిస్ టోర్నీని కొవిడ్-19 కారణంగా రద్దు చేస్తున్నట్టు నిర్వాహకులు బుధవారం ప్రకటించారు. దీంతో 75 ఏళ్ల (చివరిసారి 1945లో) తర్వాత తొలిసారిగా ఈ టోర్నీ రద్దయినట్టయింది. వాస్తవంగా జూన్ 29 నుంచి జూలై 12 వరకు ఈ ఆల్ ఇంగ్లండ్ క్లబ్ టోర్నీ జరగాలి. తదుపరి టోర్నీ 2021 జూన్ 28 నుంచి జూలై 11 వరకు జరగనున్నట్టు వెల్లడించారు. 143 ఏళ్ల క్రితం అంటే...1877లో ప్రారంభమైన వింబుల్డన్‌ను ఇప్పటివరకు పదిసార్లు మినహా నిరాటంకంగా నిర్వహిస్తున్నారు. మొదటి ప్రపంచ యుద్ధం కారణంగా 1915 నుంచి 1918 వరకు (4 సార్లు), రెండో ప్రపంచ యుద్ధం వల్ల 1940 నుంచి 1945 వరకు (6 సార్లు) జరపలేదు. ఇక..కరోనా వైరస్‌తో ఫ్రెంచ్, యూఎస్ ఓపెన్‌లను వాయిదా వేసిన సంగతి తెలిసిందే.

వేలానికి బట్లర్ టీషర్ట్!

లండన్: కరోనా బాధితులకు సహాయం చేసేందుకు ఇంగ్లండ్ వికెట్ కీపర్ జోస్

జూనియర్ వైద్యులకు కరోనా లక్షణాలు

- 4రోజుల హోమ్ క్వారంటైన్‌కు ఐదుగురు
- ఇద్దరు స్టాఫ్‌నర్సులు ఐసొలేషన్ వార్డుకు
- విశాఖ ఛాతీ, అంటువ్యాధుల ఆస్పత్రిలో సేవలు

విశాఖపట్నం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): విశాఖలోని ప్రభుత్వ ఛాతీ, అంటువ్యాధుల ఆస్పత్రిలో కరోనా బాధితులకు వైద్యసేవలు అందిస్తున్న ఐదుగురు జూనియర్ డాక్టర్లు(పీజీలు), ఇద్దరు స్టాఫ్ నర్సుల్లో వైరస్ లక్షణాలు కనిపించడంతో అధికారులు క్వారంటైన్‌కు తరలించారు. ఢిల్లీ వెళ్లివచ్చిన సుమారు 70మంది అనుమానితులకు పరీక్షల నిర్వహణ, నమూనాల సేకరణ సమయంలో పీజీలు ఇన్ఫెక్షన్‌కు గురైనట్టు తెలిసింది. మంగళవారం రాత్రి లక్షణాలు కనిపించడంతో వారికి సెలవులు మంజూరుచేసిన అధికారులు నాలుగు రోజుల పాటు హోమ్ క్వారంటైన్‌లో ఉండాలని ఆదేశించారు. అనారోగ్యానికి గురైన ఇద్దరు స్టాఫ్ నర్సులను ఐసొలేషన్ వార్డుకు తరలించారు. మరో హెడ్ నర్సు కూడా వైరస్ లక్షణాలతో బాధపడుతున్నట్టు తెలిసింది. వైరస్ బారినపడి ఆస్పత్రికి వస్తున్నవారికి పరీక్షలు నిర్వహించేటప్పుడు కనీసం ఎన్-95 మాస్కులు, పీపీఈ కిట్లు సమకూర్చకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సిబ్బంది వాపోతున్నారు. వైద్యులు, సిబ్బందికి పీపీఈ కిట్లు, ఎన్-95 మాస్కులు, శానిటైజర్లు, ఇతర సదుపాయాలు కల్పించాలని జూనియర్ వైద్యులు డిమాండ్ చేస్తున్నారు.

గుంటూరులో మరో పదివేల పడకలు సిద్ధం

గుంటూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కరోనా వ్యాప్తిని కట్టడి చేసేందుకు అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ అనుమానితులకు పరీక్షలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. వీరి సంఖ్య అనూహ్యంగా పెరిగినా అప్పటికప్పుడు ఆందోళన పడే పరిస్థితి లేకుండా గుంటూరు చుట్టుపక్కల మరో పదివేల పడకలు సిద్ధం చేసే పనిలో రెవెన్యూ యంత్రాంగం నిమగ్నమైంది. ఇప్పటికే 6వేల బెడ్లకు అనువైన ప్రదేశాలు గుర్తించగా గురువారం నాటికి మరో 4వేల పడకలు కూడా సిద్ధం చేయనున్నారు. ఆర్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాల, భాష్యం, మాస్టర్‌మైండ్ విద్యాసంస్థలకు చెందిన భవనాలు స్వాధీనం చేసుకొని బెడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇవికాకుండా వందల సంఖ్యలో ఉన్న ఫంక్షన్ హాళ్లలో కూడా పడకలు అందుబాటులోకి తెచ్చేపనిలో నిమగ్నమయ్యారు.

భారీ వేతనాలతో కాంట్రాక్ట్ నియామకాలు

అమరావతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : కరోనా హాస్పిటల్స్‌లో కాంట్రాక్ట్ పద్ధతిన విధులు నిర్వహించేందుకు సూపర్ స్పెషాలిటీ వైద్యులు, స్పెషలిస్ట్ వైద్యులు, నర్సింగ్ స్టాఫ్, పారా మెడికల్, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్‌ను నియమించుకునేందుకు ఆరోగ్యశాఖ సిద్ధం అయింది. రాష్ట్రంలోని అన్ని మెడికల్ కాలేజీల్లో ఈ మేరకు ఇంటర్వ్యూలు నిర్వహించాలని నిర్ణయించారు. సూపర్ స్పెషలిస్ట్ కార్డియో, గ్యాస్ట్రో, నెఫ్రాలజీ వైద్యులుకు రూ.లక్షా 40 వేలు వేతం ఇవ్వనున్నారు. జనరల్ ఫిజిషియన్, ఫల్మనాలజిస్ట్, ఆనస్థీయా వైద్యులకు లక్షా 10 వేలు ఇవ్వనున్నారు ఈఎన్‌టి సర్జన్లకు, సైకియాట్రిస్ట్, మైక్రోబయాలజిస్ట్‌కు లక్షా 10 వేలు, ఈసీజీ టెక్నీషియన్‌కు రూ.28 వేలు, ల్యాబ్ టెక్నిషియన్లకు రూ. 28 వేలు వేతనం ఇవ్వనున్నారు.

1902తో 2,674 సమస్యలకు పరిష్కారం

అమరావతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): టోల్‌ఫ్రీ నంబర్ 1902 స్పందన కాల్ సెంటర్ ద్వారా 2862 ఫిర్యాదులు రాగా, 2674 సమస్యలకు పరిష్కారం లభించిందని సమాచార పౌరసంబంధాలశాఖ కమిషనర్ టి.విజయ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిత్యావసర వస్తువుల రవాణాకు సంబంధించిన సమస్యలను 2 గంటల వ్యవధిలో పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. వీటి కోసం 11 ప్రభుత్వ శాఖల సమన్వయంతో 24 గంటలు పని చేసే రాష్ట్ర స్థాయి కంట్రోల్ రూమ్‌ను విజయవాడలోని ఆర్‌అండ్‌బీ భవనంలో ఏర్పాటు చేశామని తెలిపారు. ఇక్కడ మార్కెటింగ్, పౌరసరఫరాలు, పోలీస్, పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమ, ఏపీఎస్ఆర్టీసీ, మున్సిపల్ పంచాయతీరాజ్, కార్మికశాఖల సిబ్బంది సమన్వయంతో పని చేస్తారని పేర్కొన్నారు.

పట్టణాల్లో ఓకే.. శివారు పరిస్థితేంటి?

- కూరగాయల కోసం ప్రజల పాట్లు

అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కరోనా లాక్‌డౌన్ నేపథ్యంలో కూరగాయల కోసం రైతుబజార్లలో ప్రజలు బారులు తీరకుండా మార్కెటింగ్ శాఖ రైతుబజార్ల వికేంద్రీకరణ చేపట్టింది. అదేవిధంగా పట్టణ ప్రాంతాల్లోని కూడళ్లలో మినీ మార్కెట్లు ఏర్పాటు చేయించారు. 385 కూడళ్లలో మినీ రైతుబజార్లను ఏర్పాటు చేశారు. విజయవాడ, కాకినాడ, రాజమండ్రి, గుంటూరు, ఒంగోలు, తిరుపతి, నెల్లూరు వంటి నగరాల్లో 277 మొబైల్ వాహనాలను అందుబాటులోకి తెచ్చారు. ఇవి కాకుండా 868 మందితో డోర్ డెలివరీ విధానాన్ని అమలు చేస్తున్నారు. దీంతో పట్టణ ప్రాంతాల్లో కూరగాయల సమస్య తీరింది. అయితే, నగరాలు, పట్టణాలకు శివారు ప్రాంతాల్లో ఉన్న జనం కూరగాయల కోసం ఇబ్బంది పడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో ఒకటి రెండు మార్కెట్లే ఉండడంతో వాటి వద్దే జనం క్యూకడుతున్నారు. దీంతో వ్యాపారులు కూరగాయలను ఇష్టాను సారం ధరలు పెంచి విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో శివారు ప్రాంతాల్లోనూ రైతు బజార్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రాష్ట్రానికి అత్యవసర మందులు

- ఎయిర్‌ఫోర్స్ విమానంలో రాక

విజయవాడ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో అత్యవసర మందులు, కరోనా చికిత్సా సామగ్రి రాష్ట్రానికి చేరుకున్నాయి. ఎయిర్‌ఫోర్స్ విమానం ఏఎన్-32 బుధవారం తంజావూరు నుంచి వాటిని తీసుకొచ్చింది. విజయవాడ(గన్నవరం) విమానాశ్రయంలో మందులు, పరికరాలు, స్టేషనరీ బండిల్స్ దించారు. విజయవాడకు గత కొద్ది రోజులుగా విమానాల రాకపోకలు లేవు. వైమానిక దళానికి చెందిన అతి పెద్ద రవాణా యుద్ధ విమానం కావటంతో భారీ శబ్దంతో దిగింది. ఎయిర్‌పోర్టు డైరెక్టర్ గిరి మధుసూదనరావు సిబ్బందితో ఆ బండిల్స్‌ను దింపించారు. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం వాటిని స్వాధీనంలోకి తీసుకుంది.

కూలీలను సాగు పనులకు అనుమతించాలి

- జిల్లా కలెక్టర్లకు మంత్రి కన్నబాబు ఆదేశం

కాకినాడ(ఆంధ్రజ్యోతి), ఏప్రిల్ 1: రబీ పంట కోతల సమయం ఆసన్నమైన దృష్ట్యా జిల్లాలో వరికోత యంత్రాల మూమెంట్, పనులకు కూలీల హాజరు అంశాలను అనుమతించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కురసాల కన్నబాబు కలెక్టర్లను ఆదేశించారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్‌నుంచి బుధవారం రాత్రి ఆయన రాష్ట్ర కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. లాక్‌డౌన్ నేపథ్యంలో వ్యవసాయ కార్యకలాపాలు, ఉత్పత్తుల మార్కెటింగ్‌లకు విఘాతం లేకుండా చేపట్టాల్సిన చర్యలను సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ రెండోవారంలోగా రబీ కోతలు ప్రారంభం కానున్నాయని, ఇందుకు అవసరమైన వరికోత యంత్రాల మూమెంట్‌కు ఇబ్బంది లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్లను కోరారు. ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కూలీలు భౌతిక దూరం పాటిస్తూ వ్యవసాయ పనులకు హాజరయ్యేందుకు అనుమతించాలని సూచించారు. పెరిషబుల్, నాన్ పెరిషబుల్ వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ ఇంట్రవెన్షన్ల ద్వారా రైతులు నిరాశతో డిస్ట్రెస్ సేల్‌కు పాల్పడి నష్టపోకుండా చూడాలని కోరారు.

కరోనా నివారణకు మిశ్రమ పిచికారీ

- వేపాకు, పసుపు, బ్లీచింగ్ కలిపిచేసిన కిర్లంపూడి యువత

కిర్లంపూడి, ఏప్రిల్ 1: కరోనా వైరస్ వ్యాప్తిని నివారించడానికి తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడికి చెందిన కొందరు యువకులు వేపాకు, పసుపు, బ్లీచింగ్ మిశ్రమాన్ని తయారు చేశారు. మండలంలోని ముక్కోలు గ్రామంలో బసవ వీరబాబు, కర్రి రాజా, తోట ఆదినారాయణమూర్తి తదితరులు ఈ మిశ్రమాన్ని రూపొందించారు. పిచికారీ యంత్రాల ద్వారా గ్రామ వీధుల్లో 30 ట్యాంకులను వినియోగించి పిచికారీ చేశారు. దీనివల్ల వైరస్‌ను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కర్రి కార్తీక్, జ్యోతుల రాంబాబు, మాజీ ఎంపీటీసీ ద్వారంపూడి బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

ముక్కోలులో పసుపు, వేపాకు, బ్లీచింగ్ మిశ్రమాన్ని పిచికారీ చేస్తున్న యువకులు

అనంతపురంలో బైక్‌పై తిరుగుతున్న యువకులపై లాఠీ ఝుళిపిస్తున్న పోలీసులు

బుధవారం రాత్రి నిర్మానుష్యంగా విజయవాడ బెంజ్‌సర్కిల్

రాష్ట్రాన్ని చుట్టేసింది!

(మొదటి పేజీ తరువాయి)

అత్యధికంగా 20పాజిటివ్‌లు నమోదయ్యాయి. కృష్ణా జిల్లాలో కేసుల సంఖ్య 15కు పెరిగింది. వీరంతా విజయవాడ నగరానికి చెందినవారే. ఇక మంగళవారం వరకూ ఒక్క కేసు కూడా లేని కడప జిల్లాలో ఒక్కసారిగా 15కేసులు, పశ్చిమగోదావరిలో 14కేసులు (మంగళవారం అర్ధరాత్రి ప్రకటించిన 12తో కలిపి) వెలుగు చూశాయి. కడపలో కరోనా నిర్ధారణ అయిన 15మందిలో 14మంది ఢిల్లీ సమావేశాలకు వెళ్లి వచ్చిన వారు కాగా.. మరొకరు వారితో సన్నిహితంగా తిరిగిన వ్యక్తి. పశ్చిమగోదావరి జిల్లాలో ఢిల్లీ వెళ్లి వచ్చిన వారికి పరీక్షలు నిర్వహించగా 14మందికి పాజిటివ్ వచ్చింది. తూర్పుగోదావరిలో కొత్తగా 5కేసులు నమోదవడంతో జిల్లాలో మొత్తం కేసులు తొమ్మిదికి చేరాయి. చిత్తూరు జిల్లాలో ఢిల్లీ వెళ్లివచ్చిన శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలాలకు చెందిన ఇద్దరికి పాజిటివ్ వచ్చింది. అసోంలోని గోల్‌భర్ ప్రాంతానికి వెళ్లి వచ్చిన పలమనేరు వాసులు ముగ్గురికి కరోనా నిర్ధారణ అయింది. నెల్లూరు జిల్లా నాయుడుపేటకు చెందిన వ్యక్తికి, బుచ్చిరెడ్డిపాళెం మండలానికి చెందిన మరొకరికి కరోనా సోకింది. వీరిద్దరూ ఢిల్లీ సమావేశాలకు హాజరయ్యారు. బుధవారం ప్రకాశం జిల్లా చీమకుర్తిలో ఒకటి, ఒంగోలులో 3పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.

ఢిల్లీ లింకుతో హడల్

విదేశాల నుంచి రాష్ట్రానికి సుమారు 30వేల మంది వచ్చారని గుర్తించగా వీరిలో 16మందికి పాజిటివ్ వచ్చింది. వారితో కొంత ముప్పు తగ్గిందని అధికారులు ఊపిరి పీల్చుకునేలోపే ఢిల్లీ సమావేశాలు పెద్ద బాంబ్ పేల్చాయి. రాష్ట్రంనుంచి సుమారు 1,500మంది ఢిల్లీ వెళ్లి వచ్చారని అంచనా కాగా ఇప్పటి వరకూ 1,085 మందిని క్వారంటైన్‌కు తరలించారు. మరి కొంతమంది కోసం అధికారులు గాలిస్తున్నారు.

కనిపించని 21 మంది!

అమరావతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ నుంచి ఢిల్లీ సమావేశాలకు వెళ్లినవారిలో 21మంది ఆచూకీ లభ్యం కాలేదు. మిగిలిన వారందరినీ ఆస్పత్రులు, క్వారంటైన్ సెంటర్లకు తరలించారు. వారిలో పలువురు మతప్రచారం కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లారని... అలాగే ఇతర రాష్ట్రాల వారూ ఏపీలో పర్యటిస్తున్నారని సమాచారం అందింది. ఈ 21మందిలో పలువురు బెంగళూరు, చెన్నైలో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఆ రాష్ట్రాల పోలీసుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. 2రోజుల క్రితం హిందూపురానికి చెందిన ఒక మహిళ బెంగళూరులో మరణించారు. ఆమె కుటుంబంలో ఒకరు నిజాముద్దీన్ సమావేశాలకు వెళ్లి వచ్చారు. ఆమె కోడలు, మనుమరాలికి కూడా వైరస్ సోకినట్లు తేలడంతో అనంతపురం జిల్లా నుంచి ఎంతమంది బెంగళూరు వెళ్లారనేదానిపై కూపీ లాగుతున్నారు. ఎవరికి అనుమానం ఉన్నా 100 లేదా 104కు ఫోన్ చేయవచ్చని డీజీపీ గౌతమ్ సవాంగ్ పిలుపునిచ్చారు.

హెడ్ కానిస్టేబుల్ కుమారుడికి పాజిటివ్

- కాళ్ల పీఎస్ సిబ్బంది హోం క్వారంటైన్‌కు

పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ కుమారుడు ఇటీవల ఢిల్లీ వెళ్లి వచ్చాడు. ఆయనకు కరోనా పాజిటివ్ రావడంతో కుటుంబ సభ్యులందరినీ ఏలూరు ఆశ్రం ఆస్పత్రికి తరలించి క్వారంటైన్‌లో ఉంచారు. బాధితుడి తండ్రితో పాటు కాళ్ల స్టేషన్ ఎస్ఐ, ఇద్దరు ఏఎస్ఐలు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, పది మంది కానిస్టేబుళ్లు, ఐదుగురు హోంగార్డులు మొత్తం 20మందిని హోం క్వారంటైన్‌కు పంపించారు.

కడపలో పూర్తి ముసుగుతో వాహనదారుడు

ఆదాయం ఉంది... జీతాలు ఇవ్వొచ్చు

- సమస్యను భూతద్దంలో చూపించే యత్నం
- టీడీపీ టెలి కాన్ఫరెన్స్‌లో నేతల వ్యాఖ్య

అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): "ఉద్యోగులకు జీతాలు పూర్తిగా ఇవ్వగలిగిన పరిస్థితిలోనే రాష్ట్ర ఆదాయం ఉంది. వారి జీతాలు తగ్గించి ఇవ్వాల్సినంత ఇబ్బందికర పరిస్థితులేవీ రాష్ట్రంలో లేవు" అని టీడీపీ నేతలు అభిప్రాయపడ్డారు. ఆపార్టీ అధినేత చంద్రబాబు బుధవారం తమ పార్టీ నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. దానిలో ఈ అభిప్రాయం వ్యక్తమైంది. టీడీపీ వర్గాల సమాచారం ప్రకారం... ఉద్యోగులకు ఈ నెల జీతాలు సగం తగ్గించి ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయంపై కాన్ఫరెన్స్‌లో చర్చకు వచ్చింది. జనవరి, ఫిబ్రవరిల్లో రాష్ట్ర ఆదాయం ఎంత ఉందో మార్చిలో కూడా అంతే ఉందని కొందరు మాజీ మంత్రులు చెప్పారు. ఉద్యోగులకు జీతాలు కోతకోసి ఇవ్వాల్సినంత కిష్ట పరిస్థితులేవీ రాలేదని స్పష్టం చేశారు. మార్చి చివరివారంలో పెట్టిన లాక్‌డౌన్‌తో ఆదాయం ఘోరంగా పడిపోయే అవకాశం లేదని ఓ సీనియర్ నేత అభిప్రాయపడ్డారు. 'మార్చిలోనూ ప్రభుత్వం తనకు కావాల్సినవారికి బిల్లులు చెల్లిస్తూనే ఉంది. కరోనా కోసం పెద్దగా ఖర్చు చేసిందేమీలేదు. ఇటువంటి పరిస్థితుల్లో జీతాల్లో కోతెందుకు? లేని సమస్యను భూతద్దంలో చూపించే ప్రయత్నం చేస్తున్నారు' అని ఒక మాజీమంత్రి వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఆదాయం తగ్గిందని ప్రభుత్వం వాదిస్తే జనవరి, ఫిబ్రవరి, మార్చికి సంబంధించిన ఆదాయ వివరాలు ప్రజల ముందుపెట్టాలని మరో మాజీమంత్రి డిమాండ్ చేశారు. వారి వాదనను విన్న చంద్రబాబు 'మీ అభిప్రాయాలు విలువైనవిగా అనిపిస్తున్నాయి' అని వ్యాఖ్యానించినట్లు సమాచారం. కరోనా నిరోధానికి కృషి చేస్తున్న వైద్యులు, సిబ్బందికి అవసరమైన రక్షణ సామగ్రి కూడా ప్రభుత్వం చాలినంతగా ఇవ్వలేకపోతోందని కొందరు నేతలు వివరించారు.

దేశంలో 'నిజాముద్దీన్'లెన్నో..!

- లాక్‌డౌన్‌ను ధిక్కరించిన వారెందరో..

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: గత నెల 13-15 మధ్య ఢిల్లీలోని నిజాముద్దీన్‌లో జరిగిన ఓ ఇస్లామిక్ సమావేశం దేశంలో ప్రకంపనలు రేపుతోంది. తబ్లీగీ జమాత్ అనే అంతర్జాతీయ ఇస్లామిక్ మిషనరీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమారోహానికి దేశ విదేశాల నుంచి దాదాపు 2000 మంది హాజరయ్యారు. సామూహిక సమావేశాలు వద్దని ఢిల్లీ ప్రభుత్వం నిషేధం విధించినా ఇది జరిగింది. అయితే ఇలా సామూహిక సమావేశాలు దేశమంతా జరిగాయి.

- **రాష్ట్రపతి భవన్:** ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభావశీలురైన మహిళలకు సత్కార కార్యక్రమం మార్చి 8న రాష్ట్రపతి భవన్‌లో జరిగింది. అనేకమంది సెలబ్రిటీలు పాల్గొన్నారు. ఆ తేదీ నాటికే ఢిల్లీలో కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.
- **తిరువనంతపురం:** కేరళలో మళయాళీలు జరుపుకునే పండగ అటుకుల్ పొంగల్. మార్చి 8 నుంచి పదిరోజుల సాగిన ఈ పండగ వేళకే 9 కరోనా కేసులున్నాయి.
- **రామనవమి, అయోధ్య:** మార్చి 24న దేశవ్యాప్త లాక్‌డౌన్ ప్రకటించినా యూపీ సీఎం ఆదిత్యనాథ్ అయోధ్య లో రామ నవమి ఉత్సవాలు నిర్వహించారు.
- **లఖ్‌నవూ బర్త్ డే పార్టీ:** పార్లమెంట్‌ను వణికించిన బర్త్‌డే పార్టీ ఇది. ఎంపీలు, సెలబ్రిటీలు పాల్గొన్న ఈ బర్త్ డే పార్టీకి బాలీవుడ్ గాయని కనికా కపూర్ హాజరవడం, ఆమెకు అప్పటికే కరోనా పాజిటివ్ ఉండడం కలకలం రేపింది.

లక్షణాల్లేవు.. అయినా పాజిటివ్!

- 5 పాజిటివ్ కేసుల్లో నలుగురిలో కనిపించని వైరస్ లక్షణాలు
- అధికార యంత్రాంగంలో టెన్షన్
- 'ఢిల్లీ లింకు' కేసుల్లోనే ఈ పరిస్థితి

విశాఖపట్నం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పొడి దగ్గు, గొంతు నొప్పి, ఒళ్లు నొప్పులు, జ్వరం.. ఇవీ కరోనా వైరస్ బారినపడిన వ్యక్తుల్లో కనిపించే లక్షణాలు. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆస్పత్రికి వెళ్లాలని వైద్యులు చెబుతున్నారు. అయితే ఈ లక్షణాలేవీ కనిపించకపోయినా వైరస్ బారినపడేందుకు అవకాశం ఉందా? అంటే ఇప్పటి వరకు అలాంటి ప్రశ్నే ఉత్పన్నం కాలేదు. కానీ, జిల్లాలో కొత్తగా నమోదైన 5 పాజిటివ్ కేసులను పరిశీలిస్తే.. ఈ ప్రశ్నకు అవుననే సమాధానమే వస్తోంది. ఎందుకంటే మంగళ, బుధవారాల్లో వైరస్ బారినపడినట్టు తేలిన ఐదుగురిలో నలుగురికి ఎలాంటి లక్షణాలూ కనిపించలేదు. ఇది వైద్య వర్గాలను ఆశ్చర్యానికి గురి చేసింది. ఇప్పటి వరకు వైద్యులు కూడా దగ్గు, జ్వరం వంటి లక్షణాలు ఉన్న వారికి మాత్రమే పరీక్షలు చేశారు. లక్షణాలు లేని వ్యక్తులను కొద్ది రోజులపాటు పరిశీలనలో ఉంచి డిశ్చార్జి చేస్తున్నారు. ఢిల్లీలో జరిగిన మత సమావేశంలో పాల్గొని నగరానికి వచ్చిన 35 మందిని వైద్యులు 3 రోజుల కిందట ఆసుపత్రికి తరలించి నమూనాలు సేకరించారు. అయితే, వీరంతా ఢిల్లీ నుంచి వచ్చి 10 రోజులు దాటుతుండడం, ఎవరిలోనూ వైరస్ సోకిన లక్షణాలు కనిపించక పోవడంతో పాజిటివ్ కేసులు ఉండవని భావించారు. వీరిలో మంగళవారం రాత్రి కొందరివి, బుధవారం ఉదయం మరికొందరివి రిపోర్టు వచ్చాయి. వీటిలో ఐదుగురు వైరస్ బారినపడినట్టు తేలింది. ఐదుగురిలో ఒక వృద్ధుడు(70) మాత్రమే ఒళ్లు నొప్పులతో బాధపడుతుండగా, మిగిలిన నలుగురిలో ఎలాంటి లక్షణాలు లేకపోగా ఆరోగ్యంగా కనిపించారు. అయినా, వైరస్ బారినపడడంతో అధికారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. దీనిపై వైద్యాధికారులను ఆరా తీయగా కొంతమందిలో వైరస్ ఉన్నా లక్షణాలు కనిపించేందుకు ఎక్కువ సమయం పడుతుందని తెలిపారు.

వైరస్ వర్రీ వద్దు!

(మొదటి పేజీ తరువాయి)

అవసరంగానీ లేదని పేర్కొన్నారు. కరోనా వైరస్ సోకిన వ్యక్తులపై వివక్ష చూపొద్దని, వారిపై ప్రేమాప్యాయతలను మరింతగా చూపాలని కోరారు. రాష్ట్రంలో కరోనా వ్యాప్తి ఒక్కసారిగా ప్రబలమయిన నేపథ్యంలో బుధవారం ఆరోగ్యం, ఆక్వారంగంపై అధికారులతో తయన సమీక్ష నిర్వహించారు. అనంతరం ప్రజలకు వీడియో సందేశం విడుదల చేశారు. "గత రెండు రోజులుగా రాష్ట్రంలో కరోనా వైరస్ పాజిటివ్ కేసులు పెరగడం బాధ కలిగిస్తోంది. ఈ వైరస్ లక్షణాలు గుర్తించి వైద్యం అందించడంపై సమగ్ర విధానం అమలు చేస్తున్నాం. దీని నియంత్రణకు ఏ కొరతా లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోంది. వైరస్ లక్షణాలు ఉన్నవారిని గుర్తించడంతో పాటు వారికి చికిత్సను అందించడంలో సమర్థవంతమైన విధానాన్ని అనుసరిస్తున్నాం" అని వివరించారు.

ఢిల్లీ వెళ్లినవారిలోనే పాజిటివ్

ఢిల్లీలో జరిగిన సదస్సుకు రాష్ట్రం నుంచి హాజరైనవారికి వైరస్ సోకిందని ముఖ్యమంత్రి చెప్పారు. 'సదస్సులో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్లిన వారిని, వారితో ఆ సమయంలో ప్రయాణించిన వారిని, వారితో కాంటాక్టులో ఉన్నవారిని గుర్తించేందుకు ప్రభుత్వం గట్టి ప్రయత్నం చేస్తోంది. ఈ వైరస్ ఒక స్టిగ్మా లాంటిది. అది వస్తే ఏదో జరిగిపోతుందని ఎవరూ అనుకోవద్దు. పలు దేశాల ప్రధానులు, వారి కుటుంబసభ్యులకు కూడా కరోనా వైరస్ రావడం.. వారు చికిత్స పొంది బాగు కావడం కూడా చూశాం" అని గుర్తు చేశారు. ఇప్పటి వరకూ రాష్ట్రంలో 87 కరోనా పాజిటివ్ కేసులు వచ్చాయన్నారు. వీటిలో దాదాపు 70 కేసులు ఢిల్లీ వెళ్లి వచ్చినవారివేనని చెప్పారు. 'రాష్ట్రం నుంచి దాదాపు 1085 మంది ఢిల్లీకి వెళ్లగా, వారిలో 585 మందిని పరీక్షించగా 70 మందికి పాజిటివ్‌గా వచ్చాయి. మరో 500 మంది ఫలితాలు రావాల్సి ఉంది. ఇంకో 21 మంది జాడ తెలియడం లేదు. కాబట్టి వారుగానీ.. వారి కుటుంబ సభ్యులుగానీ, వారితో కాంటాక్టులో ఉన్నవారుగానీ వారంతట వారే 104కు ఫోన్ చేసి స్వయంగా పరీక్ష చేయించుకోవాలి" అని ఆదేశించారు. సర్వే కోసం వచ్చేవారికి ఆరోగ్య వివరాలను చెప్పాలని ప్రజలను కోరారు. 'ప్రతి ఇంటికీ గ్రామ వలంటీర్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, రీసోర్సు పర్సన్లు సర్వే చేస్తున్నారు. ఎవరికి ఆరోగ్యం బాగా లేకున్నా.. జ్వరంగా ఉన్నా.. శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఉన్నా.. ఏమాత్రమూ సంకోచం లేకుండా వారికి చెబితే, వైద్య సేవలు అందిస్తారు. అవసరమైన ఔషధాలు ఇస్తారు. కరోనా సోకినవారిలో 81 శాతం కేసులు ఇళ్లలోనే ఉండి వైద్యం చేయించుకుని నయమయ్యారు. 14 రోజుల పాటు స్వీయ నిర్బంధంలో ఉంటే చాలు. ఏ సమస్యా ఉండదు. కేవలం 14 శాతం మాత్రమే ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు. వారిలో 4నుంచి 5 శాతమే ఐసీయూలో ఉన్నారు. రోగులకు వైద్యాధికారులు తోడుగా ఉంటారు. ఆస్పత్రులకు తీసుకెళ్లి వైద్యం అందేలా చూస్తారు" అని తెలిపారు.

కష్టమైనా సహకరించారు..

'రాష్ట్రంలో కరోనా దాడి కారణంగా పూర్తిగా ఆదాయం మందగించింది. ఇబ్బందుల్లో ఉన్న ప్రజలకు తోడ్పాటు అందించడంలో ఖర్చులు విపరీతంగా పెరిగాయి. ఇలా అనుకోని విధంగా ఆర్థిక భారం చాలా పడింది. ఈ తరుణంలో ప్రజా ప్రతినిధులూ ఐఏఎస్ అధికారులూ ఐపీఎస్ అధికారులూ ఉద్యోగులూ.. పెన్షనర్లు.. జీతాలు వాయిదా చేసుకుంటామంటూ ముందుకొచ్చినందుకు.. ఉద్యోగులందరికీ ధన్యవాదాలు. ఉద్యోగులూ పింఛనుదారులకు కష్టమనిపించినా సహకరించారు' అని సీఎం చెప్పారు.

మర్కజ్‌కు ఏ రాష్ట్రం నుంచి ఎందరు!

ఢిల్లీ, ఏప్రిల్ 1: నిజాముద్దీన్‌లో తబ్లిగీ జమాత్ నిర్వహించిన మర్కజ్ దేశవ్యాప్తంగా కలకలం రేపుతోంది. గత నెలలో జరిగిన ఈ కార్యక్రమానికి పలు రాష్ట్రాలకు చెందిన వారు పాల్గొన్నట్టు గుర్తించారు.

రాష్ట్రం	హాజరైనవారు
తమిళనాడు	1,500
తెలంగాణ	1,000
ఆంధ్రప్రదేశ్	711
అసోం	456
కర్ణాటక	342
కేరళ	300
మహారాష్ట్ర	157
ఉత్తరప్రదేశ్	157
హరియాణా	125
మధ్యప్రదేశ్	107
ఛత్తీస్‌గఢ్	101
గుజరాత్	93
జమ్మూకశ్మీర్	88
బిహార్	86
పశ్చిమబెంగాల్	73
జార్ఖండ్	46
ఉత్తరాఖండ్	26
రాజస్థాన్	22
అండమాన్, నికోబార్ దీవులు	21
హిమాచల్ ప్రదేశ్	17
ఒడిసా	15
మణిపూర్	14
పంజాబ్	9
పుదుచ్చేరి	9
మేఘాలయ	7

లాక్‌డౌన్‌పై రాజీ వద్దు

- రాష్ట్రాలకు కేంద్ర కేబినెట్ కార్యదర్శి గౌబ ఆదేశం
- ఏపీకి మరిన్ని కిట్లు అవసరం: నీలం సాహ్నా

అమరావతి, న్యూఢిల్లీ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): లాక్‌డౌన్‌లో ప్రజలను ఆదుకునేందుకు ప్రధాని మోదీ ప్రకటించిన ప్యాకేజీని సక్రమంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ ఆదేశించారు. బుధవారం ఢిల్లీ నుంచి వివిధ రాష్ట్రాల సీఎస్‌లు, డీజీపీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాక్‌డౌన్ అమలులో ఏ మాత్రం రాజీపడ

మోదీ చెప్పారు కదా.. బయటకు వెళ్లొద్దు నాన్న

- డోర్‌కు అడ్డంగా నిల్చుని తండ్రిని వారించిన పాప
- మీ కోసం మా నాన్న బయట పనిచేస్తున్నారు
- ఇంట్లోనే ఉండండి: మరో బాలిక విజ్ఞప్తి

ఇటానగర్, ఏప్రిల్ 1: నాలుగేళ్లుంటాయేమో ఆ పాపకు. ఇంట్లో నుంచి బయటకు వెళ్తే ఆయనకు కరోనా వైరస్ సోకుతుందనే భయంతో ఆ చిన్నారి తలుపులకు అడ్డంగా నిలబడింది. తాను డ్యూటీకి వెళ్లాలంటూ తండ్రి బతిమాలినా ఆ చిచ్చరపిడుగు వింటేనా? తల్లిదండ్రులను ఇంట్లోనే ఉండేలా చూడాలంటూ 'బాల సేన' (పిల్లలకు)కు ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు స్ఫూర్తితో తండ్రిని ఇంట్లో నుంచి వెళ్లనీయలేదా బాలిక. 'ఉద్యోగానికి వెళ్లనీ యమ్మా నన్ను' అని తండ్రి అడుగుతుంటే.. 'బయటకు వెళితే కరోనా వైరస్ వస్తుందని ప్రధానమంత్రి చెప్పారు కదా. నువ్వు వెళ్లొద్దు' అని ముద్దు ముద్దు మాటలతో తండ్రిని వారించింది. అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన ఆ చిన్నారి వీడియోను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పెమా ఖండూ ట్విటర్‌లో షేర్ చేశారు. లాక్‌డౌన్ నిబంధనలను పాటించాలని ప్రజలకు అరుణాచల్ ప్రదేశ్‌కే చెందిన మరో తొమ్మిదేళ్ల బాలిక వేడుకుంది. 'మా నాన్న పోలీసు. నాకు ఆయన దూరంగా ఉంటున్నారు. మీ కోసం బయట పనిచేస్తున్నారు. దయచేసి మీరు ఇంట్లోనే ఉండండి' అని వేడుకుంది. బాలిక మెసేజ్, ఆమె ఫొటోను కేంద్రమంత్రి కిరెణ్ రిజిజు ట్విటర్‌లో పోస్ట్ చేశారు.

ఆ పది యమ డేంజర్!

- దేశవ్యాప్తంగా 10 కరోనా వ్యాప్తి కేంద్రాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: దేశంలో కరోనా వైరస్ వ్యాప్తికి కేంద్రస్థానాలుగా భావిస్తున్న 10 ప్రదేశాలను కేంద్రం గుర్తించింది. వీటిలో ఢిల్లీ, యూపీ, కేరళ, మహారాష్ట్రల్లో రెండేసి, గుజరాత్, రాజస్థాన్‌ల్లో ఒక్కొక్కటి ఉన్నాయి. కర్ణాటకలో బెంగళూరు, మైసూరు ప్రాంతాలనూ వైరస్ హాట్ స్పాట్స్‌గా ప్రకటించింది.

ఢిల్లీ: సూఫీ మతగురువు ఖ్వాజా నిజాముద్దీన్ దర్గా వైరస్ వ్యాప్తి కేంద్రాల్లో అగ్ర స్థానంగా గుర్తించారు. మార్చి 1-15 మధ్య జరిగిన తబ్లిగీ జమాత్‌కు హాజరైన వేలాది మందిలో అనేక మంది వైరస్ బారిన పడ్డట్లు ప్రాథమిక నిర్ధారణకొచ్చా రు. వీరు తిరిగిన అనేక రాష్ట్రాల వారికి ఇది వ్యాపించింది. దిల్షన్ గార్డెన్ ఈశాన్య ఢిల్లీలోని ఓ ప్రాంతం. సౌదీ వెళ్లొచ్చి న ఓ మహిళకు వైరస్ సోకింది. ఆమె నుంచి ఆమె కుమార్తెకు, మరో ముగ్గురు బంధువులకు సోకింది. ఆమె ఓ క్లినిక్‌కు వెళ్లాక అక్కడి డాక్టర్‌కు, ఆయన భార్యకు సోకింది.

యూపీ: ఢిల్లీని ఆనుకుని ఉన్న నొయిడాలో 38 కొవిడ్ కేసులు నమోదయ్యాయి. మరో 32 కేసుల్లో పరిస్థితి తీవ్రంగా ఉంది. ఓ ప్రైవేటు కంపెనీ ద్వారా ఇవి వ్యాపించినట్లు నిర్ధా రించారు. 626 నమూనాలు పరీక్షించారు. 1852 మంది నిఘాలో ఉన్నారు. 300 మంది స్వీయ నిర్బంధంలో ఉన్నారు. యూపీలోని మేరట్‌లో కేసుల సంఖ్య 100 దాటింది. వీరిలో 19 మందికి పాజిటివ్. మహారాష్ట్ర నుంచి తిరిగొచ్చిన 72 ఏళ్ల వ్యక్తి చనిపోయాడు. కుటుంబ సభ్యులకూ వైరస్ సోకింది.

మహారాష్ట్ర: ముంబైలోని వర్లి, కొలివాడ, గోరేగాం మహారాష్ట్రలో ప్రధాన వ్యాప్తి కేంద్రాలుగా నిర్ధారించారు. ముంబైలో 8మంది మరణించారు. 167మంది చికిత్సలో ఉన్నారు. వీరిలో మూడో వంతు మంది పరిస్థితి విషమం. మహారాష్ట్రలో 230 మందికి వైరస్ సోకగా 10 మంది చనిపోయారు. రాష్ట్రంలో 181 ఏక్టివ్ కేసులున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ ప్రకటించింది. మహారాష్ట్రలో కొవిడ్-19 మొదలైంది పుణెలోనే. అయితే ఇక్క డ పరిస్థితి మరీ అంత ఆందోళనకరం కాదని అధికారులు అంటున్నారు. అక్కడ 46 ఏక్టివ్ కేసులున్నాయి.

కేరళ: దేశంలో అతి తీవ్రంగా వ్యాపించిన జిల్లా. 100 మందికి పాజిటివ్ తేలగా.. 7725 మంది అబ్జర్వేషన్లో ఉన్నారు. పథనంథిట్టలో పాజిటివ్ కేసులు ఐదే.

గుజరాత్: రాష్ట్రంలో నమోదైన 73 కేసుల్లో 28 అహ్మదాబాద్‌లోనివే. చనిపోయిన ఆరుగురిలో ముగ్గురు ఇక్కడి వ్లేళ్లే.

రాజస్థాన్: రాష్ట్రంలో నమోదైన 106 పాజిటివ్ కేసుల్లో 26 జోళి నగరమైన భిల్వారాలోనే! ఇద్దరు చనిపోయారు. 1200 మంది పరిశీలనలో ఉన్నారు.

వారంతా ఎక్కడ?

(మొదటి పేజీ తరువాయి)

సిబ్బంది కలిసి 36 గంటలపాటు 'ఆపరేషన్ మర్కజ్' నిర్వహించారు. ఇక, దేశవ్యాప్తంగా కరోనా కేసులు పెరుగుతుండటం... అందులోనూ 'ఢిల్లీ కనెక్షన్' ఉన్నవే అధికం కావడంతో అన్ని రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు అందిన సమాచారం ప్రకారం... కేవలం 24 గంటల్లో 386 కొత్త కరోనా కేసులు నమోదయ్యాయి. అందులోనూ 'ఢిల్లీ కనెక్షన్' ఉన్న కేసులే అత్యధికం కావడం కేంద్రాన్నీ, రాష్ట్రాలనూ కలవర పరుస్తోంది. తమిళనాడులో ఒక్కరోజులో 110 కొత్త కేసులు బయటపడగా... వీరిలో వందమంది మర్కజ్ సమావేశాలకు హాజరై వచ్చిన వారే. ఆంధ్రలో దాదాపు కొత్త 'పాజిటివ్' కేసులన్నింటికీ ఢిల్లీ కనెక్షన్ ఉన్నట్లు తేలింది. మార్చి 1నుంచి మర్కజ్‌లో జరిగిన సమావేశాలకు హాజరైన వారిని గుర్తించి, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, క్వారంటైన్‌కు తరలించే ప్రక్రియ దేశవ్యాప్తంగా యుద్ధ ప్రాతిపదికన సాగుతోంది. ఇందులో రాష్ట్రాల ఇంటెలిజెన్స్, పోలీసు సిబ్బంది క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. మర్కజ్‌కు హాజరైన వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పరీక్షలు నిర్వహించుకోవాలని, క్వారంటైన్‌కు సహకరించాలని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే పిలుపునిచ్చాయి. మహారాష్ట్రలోని నాగపూర్, అహ్మద్‌నగర్ తదితర ప్రాంతాల్లో బుధవారం 89 మందిని క్వారంటైన్‌కు పంపించారు. తగ్లీబీ జమాత్ సమావేశానికి హాజరైన పది మందిని జమ్మూలో క్వారంటైన్‌కు పంపారు. వీరిలో తొమ్మిది మంది హైదరాబాద్‌కు చెందిన వారు. తమిళనాడు 1500 మంది ఢిల్లీ సమావేశానికి వెళ్లగా, ఇప్పటికి 515 మందిని మాత్రమే గుర్తించగలిగారు. మిగిలిన వారిలో పలువురు ఇంకా ఢిల్లీలోనే ఉండొచ్చునని, మరికొందరి చిరునామాలు తప్పుగా ఉన్నాయని ముఖ్యమంత్రి పళనిస్వామి తెలిపారు. కర్ణాటకకు సంబంధించి ఇంకా 150 మంది వివరాలు లభించలేదు. ఢిల్లీ సమావేశాల్లో పాల్గొన్న అనంతరం మత ప్రచారాల్లో పాల్గొనేందుకు మలేషియా, ఇండొనేషియాకు చెందిన 62 మంది కర్ణాటకకు వచ్చారు. వీరిలో 12 మంది తిరిగి వెళ్లిపోగా... 50 మందిని క్వారంటైన్‌లో ఉంచారు. కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా బుధవారం అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, డీజీపీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తగ్లీబీ ప్రార్థనలకు ఏ రాష్ట్రం నుంచి ఎంత మంది వచ్చారు, తిరిగి వెళ్లాక ఎక్కడెక్కడ పర్యటించారు, ఎవరితో సన్నిహితంగా (కాంటాక్ట్) మెలిగారో యుద్ధ ప్రాతిపదికన గుర్తించాలని ఆదేశించారు. వివిధ రాష్ట్రాల నుంచి మర్కజ్‌కు హాజరైన వారిలో అత్యధికులు రైళ్లలోనే ప్రయాణించారు. మార్చి 13 నుంచి 19 వ తేదీ మధ్య ఢిల్లీ నుంచి వెళ్లిన 5 రైళ్లలో ప్రయాణించిన వారి వివరాలను రైల్వే శాఖ నేరుగా రాష్ట్రాలకు ఇవ్వనుంది.

జమాత్‌లో పాల్గొన్న వారి వివరాలపై యూపీ పోలీసుల ఆరా

మర్కజ్‌లో నిబంధనల ఉల్లంఘన

కరోనా కట్టడికి కేంద్రం తీసుకున్న చర్యలకు తగ్లిబీ జమాత్ సమావేశాలు తీవ్ర విఘాతం కలిగించాయని జాతీయ మైనారిటీ కమిషన్ పేర్కొంది. మర్కజ్‌లో నిబంధనలను దారుణంగా ఉల్లంఘించారని, పౌరుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టారని ఆందోళన వ్యక్తం చేసింది. మదర్సాలు, ఇతర ప్రార్థనా మందిరాల్లో 'లాక్‌డౌన్' నియమాలను పూర్తిస్థాయిలో పాటించాలంటూ ఎన్‌సీఎం చీఫ్ సయ్యద్ హసన్ రజ్వీ లేఖలు రాశారు.

ఖాళీకి ససేమిరా!

రంగంలోకి అజిత్ డోబాల్

ఆ తర్వాతే మర్కజ్ ఖాళీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: 'కరోనా వ్యాపిస్తోంది. మర్కజ్‌లో వందలమంది ఒకే చోట బస చేశారు. ఇది ఎంతమాత్రం క్షేమం కాదు. వెంటనే ఖాళీ చేయించండి'.... అని పదేపదే కోరినా తగ్లిబీ జమాత్ ప్రతినిధులు అంగీకరించలేదని తెలిసింది. చివరికి... జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ డోబాల్ రంగంలోకి దిగిన తర్వాతే వారు దిగి వచ్చినట్లు కేంద్ర హోంశాఖ వర్గాలు తెలిపాయి. కాగా.. 'కరోనా వైరస్ మనల్ని ఏమీ చేయదు' అని తగ్లీబ్ చీఫ్ మౌలానా సాద్ పేర్కొన్నట్లుగా యూట్యూబ్‌లో ప్రత్యక్షమైన ఆడియో క్లిప్పింగ్‌ను ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు పరిశీలిస్తున్నారు. అందులోని స్వరం మౌలానాదేనా, నిజంగానే మర్కజ్‌లో ఇలాంటి ప్రసంగాలు చేశారా అనే అంశంపై దృష్టి సారించారు.

అజ్ఞాతంలో మౌలానా సాద్?

తగ్లీబ్ చీఫ్ మౌలానా సాద్ అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. ఆయనతోపాటు తగ్లీబ్‌కు చెందిన ఆరుగురిపై కేసు నమోదు చేశారు. 'ఎపిడమిక్ డిసీజ్ యాక్ట్, 1897తోపాటు ఐపీఎస్ సెక్షన్ల కింద కూడా కేసు పెట్టారు. యూపీలోని బాదోహీ జమాత్ కేంద్రంలో విదేశీ యాత్రికులకు బస ఏర్పాట్లు చూసే అన్సారీపైనా కేసు పెట్టారు.

కరోనా కాటు

(మొదటి పేజీ తరువాయి)

యువకుడు మరణించాడు. తరువాత వచ్చిన పరీక్ష ఫలితాల్లో అతనికి కరోనా ఉన్నట్లు తేలింది. దేశంలో వైరస్ బారినపడిన 132 మంది కోలుకున్నారని కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. మధ్యప్రదేశ్‌లో కొత్తగా 20 కేసులు నమోదయ్యాయి. వాటిలో 19 ఇండోర్‌లోనే బయటపడ్డాయి. వారిలో ముగ్గురు పిల్లలు సహా 9 మంది ఒకే కుటుంబంవారు. బాధితుల్లో ఓ పోలీసు అధికారి కూడా ఉన్నారు. తాజా కేసులతో రాష్ట్రంలో కేసుల సంఖ్య 86కు పెరిగింది. వారిలో ఐదుగురు మరణించారు. మహారాష్ట్రలో కొత్తగా 18 కేసులు నమోదవడంతో మొత్తం 320కు పెరిగింది. తాజా కేసుల్లో 16 ముంబైలోనే వెలుగుచూశాయి. రాష్ట్రంలో మరో ఇద్దరు వృద్ధులు మృతిచెందారు. దీంతో మరణాల సంఖ్య 12కు చేరింది. రాష్ట్రంలో 162 మంది కరోనా సోకిన వారితో దగ్గరగా మసలిన 5,000 మందిని క్వారంటైన్ చేశారు. ముంబైలో తొలిసారిగా ఓ పోలీసు కానిస్టేబుల్‌కు కరోనా సోకడంతో అతని కుటుంబ సభ్యులను, 32 మంది సహ సిబ్బందిని హోం క్వారంటైన్‌లో ఉండాలని ఆదేశించారు. ఢిల్లీలో కేసుల సంఖ్య 152కు ఎగబాకింది. వీరిలో 53 మంది నిజాముద్దీన్ మర్కజ్‌లో ప్రార్థనలకు హాజరైన వారు ఉన్నారు. రాజస్థాన్‌లోని అజ్మేర్ జిల్లా సర్వాడ్ పట్టణంలో ఓ దర్గా వద్ద మత ప్రార్థనల కోసం వంద మంది గుమిగూడగా పోలీసులు చెదరగొట్టారు. ఆరుగుర్ని అరెస్టు చేశారు. అసోంలో కొత్తగా నాలుగు కేసులు నమోదయ్యాయి. ఆ నలుగురూ ఢిల్లీలోని నిజాముద్దీన్‌లో తబ్లిగి జమాత్‌కు వెళ్లి వచ్చినవారే. పంజాబ్‌లో తాజాగా ఐదు కేసులు బయటపడగా... మొత్తం 46కు చేరాయి. విదేశాల నుంచి ఇటీవల రాష్ట్రానికి వచ్చిన 2,800 మందిని గుర్తించే పనిలో ఉన్నట్లు ఒడిసా ప్రభుత్వం తెలిపింది. గుజరాత్‌లో వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉద్యోగుల పదవీ విరమణను రెండు నెలలు(మే 31 వరకు) వాయిదా వేశారు.

వైద్యుడికి కరోనా.. కేన్సర్ ఆస్పత్రి మూసివేత

ఢిల్లీ ప్రభుత్వ కేన్సర్ ఇనిస్టిట్యూట్‌లో ఒక డాక్టర్‌కు కరోనా సోకడంతో ఆస్పత్రిని రసాయనాలతో శుద్ధి చేయడానికి ఒక రోజు మూసివేశారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో ఇద్దరు రెసిడెంట్ డాక్టర్లు కూడా కొవిడ్-19 బారినపడ్డారు.

తెలంగాణలో ఒక్క రోజే 30 కేసులు

తెలంగాణలో రాష్ట్రంలో కరోనా వైరస్ కేసులు రోజు రోజుకు పెరుగుతున్నాయి. బుధవారం ఒక్క రోజే 30 కేసులు నమోదయ్యాయి. వీటిలో అత్యధికం ఢిల్లీలోని నిజాముద్దీన్ మర్కజ్‌తో సంబంధం ఉన్నవేనని తెలుస్తోంది. మొత్తం కేసుల సంఖ్య 121కి పెరిగింది. తాజాగా మరో ముగ్గురు చనిపోయారు. దీంతో మరణాల సంఖ్య తొమ్మిదికి చేరుకుంది. బుధవారం నమోదైన కేసులు సిద్దిపేట, నిర్మల్ జిల్లాకు చెందినవిగా సమాచారం. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో రోజుకు మూడు హెల్త్ బులెటిన్లు విడుదల చేస్తుండగా తెలంగాణలో మాత్రం ప్రభుత్వం తీవ్ర గోప్యత ప్రదర్శిస్తోంది. రోజుకు ఎన్ని నమూనాలు పరీక్షిస్తున్నారో కూడా ప్రకటించడం లేదు. ఈ గోప్యత ప్రజల్లో గందరగోళానికి దారి తీస్తోంది. జిల్లాలవారీగా కేసుల సంఖ్య ప్రకటిస్తే కనీసం ఆయా ప్రాంతాల్లోనైనా ప్రజలు అప్రమత్తంగా ఉంటారు. కానీ కేవలం కేసుల సంఖ్య మాత్రమే తెలిపి ప్రభుత్వం చేతులు దులుపుకుంటోందన్న విమర్శలు వస్తున్నాయి.

మొబైల్ ట్రాకింగ్‌తో క్వారంటైన్‌పై నిఘా

హోం క్వారంటైన్‌లో ఉన్నవారి కదలికలపై కన్నేసి ఉంచేందుకు ఢిల్లీ ప్రభుత్వం చైనా, సింగపూర్ బాటను అనుసరిస్తోంది. గృహనిర్బంధంలో ఉండాలని ఆదేశించినవారి మొబైల్ ఫోన్లను ట్రాక్ చేయాలని సీఎం కేజ్రీవాల్ పోలీసులను ఆదేశించారు. ఈ మేరకు 25 వేల ఫోన్ నంబర్లను పోలీసులకు ఇచ్చారు. సింగపూర్ వంటి దేశాల స్ఫూర్తితో టెక్నాలజీని వినియోగించాలని నిర్ణయించామని ఆయన తెలిపారు. ఉల్లంఘనులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొబైల్ ఫోన్ల ట్రాకింగ్ పద్ధతిని మొదట చైనా అవలంబించింది. తర్వాత సింగపూర్ అనుసరించింది.

కరోనాపై పోరులో మరణిస్తే రూ.కోటి: కేజ్రీవాల్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: కరోనారోగులకు వైద్యం చేస్తూ ఢిల్లీలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు, నర్సులు, పారిశుద్ధ్య కార్మికుల్లో ఎవరైనా మరణిస్తే వారి కుటుంబానికి కోటి రూపాయలు అందజేస్తామని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ బుధవారం ప్రకటించారు. విధి నిర్వహణలో మరణించిన సైనికుల కుటుంబాలకు ఢిల్లీ ప్రభుత్వం కోటి రూపాయలు అందజేస్తుందని, కరోనాపై పోరాడే వైద్య సిబ్బంది సేవలు వారికంటే తక్కువేం కాదని ఆయన అన్నారు.

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత పెను సంక్షోభమిదే

పారిస్, ఏప్రిల్ 1: ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లో 8.3 లక్షలకు పైగా కేసులు.. 42 వేల మరణాలు.. కరోనా విలయతాండవానికి ఇవి ప్రత్యక్ష నిదర్శనాలు! అందుకే.. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత మానవాళి ఎదుర్కొంటున్న అత్యంత దారుణమైన సంక్షోభం కరోనా అని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనీ గుటెర్రెస్ అన్నారు. వైరస్ కారణంగా చెలరేగుతున్న అసాధారణ ఆర్థిక, రాజకీయ ఉపద్రవాలే మానవాళికి అసలైన ముప్పు అన్నారు.

శానిటరీ ప్యాడ్లకు కొరత!

- అత్యవసరాల జాబితాలో చేర్చని కేంద్రం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: లాక్‌డౌన్ నేపథ్యంలో అత్యవసర సేవలు, విభాగాల వివరాలతో రూపొందించిన జాబితాలో మహిళల వ్యక్తిగత శుభ్రతకు అత్యవసరమైన శానిటరీ ప్యాడ్లను, వాటిని ఉత్పత్తి చేసే పరిశ్రమలను చేర్చలేదు. దీంతో శానిటరీ నాప్‌కిన్ల ఉత్పత్తి నిలిచిపోయింది. ఫలితంగా వీటికి తీవ్ర కొరత ఏర్పడే ప్రమాదం ముంచుకొస్తోంది. దీంతో శానిటరీ ప్యాడ్ల తయారీని అత్యవసరాల జాబితాలో చేరుస్తూ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ఉత్తర్వులిచ్చారు.

కడుపు కొట్టిన కరోనా!

(మొదటి పేజీ తరువాయి)

కూలి పనుల కోసం ముంబైలోని వర్సోవాకు వలస వెళ్లిన 600 కుటుంబాలు నేడు ఆకలి కేకలతో అలమటిస్తున్నాయి. దేశమంతా లాక్‌డౌన్ అమలవుతుండడంతో పనుల్లేక, చేతిలో చిల్లిగవ్వలేక.. బిక్షమెత్తుకునే దుస్థితి దాపురించింది. సహృదయులు అన్నదానం చేస్తున్నా.. అడుగు బయటపెడితే పోలీసులు ఎముకలు విరిగేలా కొడుతుండడంతో ఆ మెతుకులు కూడా అందడంలేదు. వెనక్కురాలేక, తిండిలేక ప్రాణాలు వదులుకోలేక వేదన పడుతున్న ఆ కూలీలు 'ఆంధ్రజ్యోతి'ని ఆశ్రయించారు. ఆకలి తీర్చమని చేతులెత్తి వేడుకుంటున్నారు.

పది రోజులుగా పస్తులే..

కర్నూలు జిల్లా ఆదోని, గోనెగండ్ల, ఎమ్మిగనూరు, పెద్దకడుబూరు, ఆస్పరి, నందవరం, కోడుమూరు, సి.బెళగల్, గూడురు, పత్తికొండ తదితర మండలాల నుంచి అనేకమంది 8నెలల క్రితం ముంబైకి వలస వెళ్లారు. సిమెంట్ పనులు, చేపలు పట్టే వద్ద, రోడ్లు ఊడ్చడం వంటి పనులు చేస్తే మహిళలు రోజుకు రూ.300, పురుషులకు రూ.500 చొప్పున కూలీ దొరుకుతుంది. వాటితో తిండి, నీళ్లు తెచ్చుకుని బతుకు వెళ్లదీస్తున్నారు. ఈ క్రమంలో కరోనా వారి కడుపు కొట్టింది. పది రోజులుగా పనుల్లేక ఆ కుటుంబాలు పస్తులుంటున్నాయి. వారిలో బాలింతలు, వృద్ధులు, పసిపిల్లలతో పాటు దివ్యాంగులు కూడా అధికంగా ఉన్నారు.

పట్టని ప్రభుత్వం

కరోనా నుంచి ప్రజలను రక్షించడంతో పాటు అన్నమో రామచంద్రా అని అలమటించే వారిని ఆదుకునే బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉంది. కానీ ప్రభుత్వాధికారులు మాత్రం ఇలాంటి వారి కష్టాల్ని విస్మరిస్తున్నారు. కర్నూలు జిల్లాకు చెందిన 600 కూలీలకు రిలీఫ్ ఇవ్వాలిందిగా మహారాష్ట్ర ప్రభుత్వానికి జిల్లా యంత్రాంగం లేఖ రాసింది. తమను తమ ప్రాంతాలకు తరలించాలని లేదంటే ఆహార ఏర్పాట్లయినా చేయాలని ఆ కూలీలు వేడుకుంటున్నారు.

అన్నం పెట్టండయ్యా...

ముంబైకి పనుల కోసం 7నెలల క్రితం వచ్చాం. సిమెంట్, రోడ్లు ఊడ్చే పనులు చేసుకుంటేనే 600 కుటుంబాల కడుపునిండేది. లాక్‌డౌన్‌తో పది రోజులుగా పనుల్లేవు. దాతలు పెట్టే అన్నం తెచ్చుకుందామని బయటకు వెళ్తే పోలీసులు కొడుతున్నారు. ఏపీ ప్రభుత్వమే సాయపడాలి. లేదా మా అందరి ప్రాణాలు ఇక్కడే పోతాయి.

- దేవదాసు, ముంబై కూలీ
(ఎమ్మిగనూరు మండల వాసి)

ఒక ఫ్యాన్, బల్బుకు 1500 కట్టాలి

ముంబైలో ప్రతిదీ డబ్బుతో విలువ కట్టాల్సిందే. బిందె నీళ్లు రూ.5. కడుపుకు తిన్నా లేకున్నా మేం వేసుకున్న గుడిసెలకు రూ.2వేలు బాడుగ కట్టాలి. ఒక ఫ్యాన్, బల్బు వాడుకున్నందుకు రూ.1500 ఇవ్వాలి. ఈ పరిస్థితిలో పది రోజులుగా ఇళ్లల్లోని బాలింతలు, ముసలోళ్ల కడుపు నింపడానికే ప్రయాస పడుతున్నాం. దయచేసి మమ్మల్ని ఆదుకోండయ్యా.

- దయాకర్, ముంబై కూలీ
(పెద్దకడుబూరు మండలవాసి)

సీఎంలతో నేడు ప్రధాని వీడియో కాన్ఫరెన్స్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కరోనా నియంత్రణ చర్యలు, లాక్‌డౌన్ అమలు తీరుతెన్నులపై ప్రధాని నరేంద్రమోదీ గురువారం రాష్ట్రాల ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహిస్తారని అధికార వర్గాలు తెలియజేశాయి. కరోనా నియంత్రణకు రాష్ట్రాలు తీసుకుంటున్న చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ప్రధానంగా చర్చ జరగనుంది. ప్రస్తుతం ఒక్కసారిగా దేశంలో కరోనా కేసులు పెరుగుతున్న దృష్ట్యా.. ఈ సమావేశానికి ప్రాధాన్యం పెరిగింది.

కరోనాపై పోరుకు అమెరికాలో రెండెసివర్?

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: కరోనాపై పోరుకు ప్రయోగాత్మక ఔషధంగా రెండెసివర్‌ను అభివృద్ధి చేస్తున్నారు! అమెరికా ఫార్మా కంపెనీ గిలీడ్ సైన్సెస్ ఈ ఔషధాన్ని తయారుచేస్తోంది. ప్రస్తుతం ప్రయోగాలు కీలక దశలో ఉన్నట్లు సమాచారం. ఇప్పటి వరకు జరిగిన పరిశోధన ప్రకారం ఈ మందు కీలక ఎంజైమ్‌లా పనిచేసి వైరస్ ప్రతిరూపాలను చంపేస్తోంది. అమెరికాలో తొలి కరోనా బాధితుడైన యువకుడి ఆరోగ్య పరిస్థితి విషమించిన సమయంలో రెండెసివర్ వాడగా.. మరుసటి రోజుకు అతని ఆరోగ్యం మెరుగుపడిందని గుర్తించారు. దీనిపై చైనాలో క్లినికల్ ట్రయల్స్ జరుగుతున్నాయి.

వూహాన్ లాక్‌డౌన్ కాకుంటే 7 లక్షల కేసులు

వాషింగ్టన్, ఏప్రిల్1: కరోనా జన్మస్థానమైన వుహాన్‌ను తగిన సమయంలో లాక్‌డౌన్ చేయకుంటే చైనా పరిస్థితి ఘోరంగా ఉండేదని ఓ అధ్యయనం వెల్లడించింది. జనవరి 23నే వుహాన్‌ను మూసివేయడంతో కరోనా మహమ్మారి వ్యాప్తిని చైనా సమర్థంగా అడ్డుకోగలిగిందని పేర్కొంది. ముందస్తు చర్యలు చేపట్టేందుకు మిగిలిన పట్టణాలు, నగరాలకు తగిన సమయం లభించిందని సైన్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ కథన రచయితల్లో ఒకరైన క్రిస్టోఫర్ డై వివరించారు. ఫిబ్రవరి 19 నాటికి కరోనా బయటపడి 50 రోజులైందని... ఆ రోజుకి చైనాలో 30,000 కొవిడ్-19 పాజిటివ్ కేసులున్నాయని చెప్పారు. వుహాన్‌ను లాక్‌డౌన్ చేయకపోతే ఈ సంఖ్య 7 లక్షలకు పైనే ఉండేదని ఆయన అంచనా వేశారు.

హలో హెల్ప్‌లైన్.. రసగుల్లా కావాలి

లఖ్‌నవూ, ఏప్రిల్ 1: "హలో పోలీస్ హెల్ప్‌లైన్. నాకు ఇప్పటికిప్పుడు రసగుల్లా తినాలని ఉంది" అంటూ యూపీలోని హజ్రత్‌గంజ్ పోలీస్ స్టేషన్‌కు కాల్ వచ్చింది. దీంతో వెంటనే అప్రమత్తమైన స్టేషన్ హౌజ్ ఆఫీసర్ బంద్ చేసి ఉన్న ఓ మిఠాయి దుకాణాన్ని తెరిపించి మరీ కాల్ చేసిన వృద్ధుడి కోసం రసగుల్లాలు తీసుకెళ్లారు. పోలీసులు తన ఇంటికి చేరుకోగానే ఒక్క క్షణం కూడా ఆగకుండా వాళ్ల చేతిలోని రసగుల్లాలను లాక్కొని మరీ తినేశారు. రసగుల్లాల కోసం మాకు ఫోన్ చేయడం సబబేనా? అని పోలీసులు అడగగా.. 'నా భార్య చనిపోయింది. పిల్లలు విదేశాల్లో ఉన్నారు. నేను ఇంట్లో ఒంటరిగా ఉంటాను. లో షుగర్‌తో ఆరోగ్యం బాలేకుంటే రసగుల్లాల కోసం మీకు ఫోన్ చేశా' అంటూ ఆయన సెంటిమెంట్ పండించాడు. దీంతో పోలీసులు తిరుగు ముఖంపట్టారు. ఆయనలాగే మరెందరో ఆకతాయిలు పోలీస్ హెల్ప్‌లైన్‌కు ఫోన్లు చేసి వేధిస్తున్నారు. అలాంటి వారితో కాల్వలు, రోడ్లను శుభ్రం చేయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కరోనాపై పోరులో దూకుడు పెంచాలి: ఆక్ఫామ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: కొవిడ్ నిర్ధారణ పరీక్షల విషయంలో ప్రభుత్వం మరింత దూకుడుగా వ్యవహరించాలని, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఈ పరీక్షలు ఉచితంగా చేసేలా చర్యలు తీసుకోవాలని హక్కుల సంస్థ ఆక్ఫామ్ ఇండియా కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. కరోనా నియంత్రణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం ప్రధానంగా దృష్టిపెట్టాల్సిన ఎనిమిది అంశాలను సూచిస్తూ బుధవారం ఈ సంస్థ ప్రధాని నరేంద్ర మోదీకి బహిరంగ లేఖ రాసింది. పరీక్షల్లో వేగం, నాణ్యత పెంచడం ద్వారా మాత్రమే కొవిడ్ లక్షణాలున్న వారిని త్వరగా గుర్తించి.. సమాజం నుంచి వేరుచేయడం సాధ్యపడుతుందని, తద్వారా సామాజిక వ్యాప్తిని నిరోధించగలమని ఆక్ఫామ్ సీఈవో అమితాబ్ బెహర్ అన్నారు. కరోనా రోగుల, అనుమానితుల గౌరవానికి భంగం కలగకుండా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

కరోనా వైరస్ 8 మీటర్లు ప్రయాణించగలదు: ఎంఐటీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 : కరోనా వైరస్ గాల్లో 8 మీటర్ల దాకా ప్రయాణించగలదని, గాల్లోనే గంటలకొద్దీ మనగలదని అమెరికాలోని మస్సాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ) శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడైంది. రోగులు తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు, శ్వాస వదిలినప్పుడు వెలువడే గాలి, నీటితుంపరల సమూహం కొన్ని సెకన్లలోనే 8 మీటర్ల దూరం వెళ్లి, ఎదురుగా ఉన్న ఏదైనా ఉపరితలాన్ని తాకి అక్కడికే పరిమితమవుతుందని తెలిపారు. అయితే గాలి, నీటితుంపరలు ప్రయాణించిన మార్గంలో వాటి అవశేషాలు మిగిలే ఉంటాయని, వాటి నడుమ కరోన